- ఇథియోపియాలో పేలిన అగ్నిపర్వతం

భారత్ నుంచి విమానాల రద్దు

10

గల్ఫ్, యూరప్ దేశాలకు సర్వీసుల నిలిపివేత

బద్దలైన హేలి గుబ్బి.. 15 కిలోమీటర్ల ఎత్తు వరకు విరజిమ్మిన బూడిద.. భారత్‌వైపు ధూళిమేఘాలు

విమానయాన సంస్థలకు డీజీసీఏ హెచ్చరికలు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మంగళవారం | 25-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 237 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి రా.10.57 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా.11.58 తదుపరి శ్రవణం, వర్జ్యం: ఉ.6.35-8.19, తె.4.13-5.56; దుర్ముహూర్తం: ఉ.8.42-9.26, రా.9.49-10.39; అమృతఘడియలు: సా.5.00-6.45; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 5.34

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఓపెన్ లిఫ్ట్ కూలి.. ఒకరి మృతి

3

- ఇద్దరి పరిస్థితి విషమం
- ఆరో అంతస్తు నుంచి గ్రానైట్ రాళ్లు కిందకు తెస్తుండగా తెగిపడిన లిఫ్ట్
- సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ఘటన
- ఘటన బాధాకరం: మంత్రి రాజనర్సింహ



జస్టిస్ సూర్యకాంత్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

సూర్యకాంత్ అనే నేను..

53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం

ఉప రాష్ట్రపతి, ప్రధాని, స్పీకర్, సీఎం రేవంత్ తదితరులు హాజరు

15 నెలలపాటు సీజేఐగా కొనసాగనున్న జస్టిస్ సూర్యకాంత్

బాధ్యతలు చేపట్టిన తొలిరోజే 17 కేసుల విచారణ

అత్యవసర కేసులను ఇకపై లిఖితపూర్వకంగానే సమర్పించాలి

పెండింగ్ కేసులు తగ్గించడంపై ప్రత్యేక దృష్టి: జస్టిస్ సూర్యకాంత్

రాష్ట్రపతి భవన్‌లోనే అధికారిక వాహనాన్ని వదిలి వెళ్లిన మాజీ సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయి

న్యూఢిల్లీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత 53వ ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ గణతంత్ర మండపంలో.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో.. 'దైవసాక్షిగా..' అంటూ నూతన సీజేఐ ప్రమాణం చేశారు. అనంతరం తన అక్క, అన్న పాదాలకు నమస్కారం చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. మాజీ జస్టిస్ బీఆర్ గవాయిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ వేడుకలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తోపాటు కేంద్రమంత్రులు

మిగతా 12వ పేజీలో...

ఎన్నికలకు వేళాయె!

జిల్లాలవారీగా గెజిట్లు ప్రచురించిన కలెక్టర్లు


ప్రతులను ఎస్ఈసీకి సమర్పించిన సర్కారు

వాటి ఆధారంగా షెడ్యూల్‌ను సిద్ధం చేయనున్న ఎస్ఈసీ

26న పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు చాన్స్

డిసెంబరు 11, 15, 19 తేదీల్లో పోలింగ్ జరిగే అవకాశం

కోడ్ అమల్లోకి రానున్న నేపథ్యంలో చీరల పంపిణీ, వడ్డీ మాఫీ పథకాల అమలును వేగవంతం చేసిన ప్రభుత్వం



మూసీ అభివృద్ధి పనులు మార్గిలో!

5800 కోట్ల అంచనాలతో తొలిదశ పనుల ప్రారంభం

సర్కారు సన్నాహాలు 13

ఏడీబీ నుంచి రూ.4100 కోట్ల రుణానికి ఆమోదం

ఉస్మాన్‌సాగర్ నుంచి బాపుఘాట్ దాకా 11 కి.మీ.

హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ దాకా 9 కి.మీ.

వారంలో పూర్తి డీపీఆర్!

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నికల హడావుడికి వేళయింది! అధికారికంగా పార్టీలు లేకపోయినా.. పల్లెల్లో రంగురంగుల జెండాలు.. ఫ్లెక్సీలతో ప్రచారానికి రంగం సిద్ధమైంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ముందస్తు ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. జిల్లాలవారీగా కలెక్టర్లు (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా) సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన గెజిట్ ప్రచురించారు. పూర్తి సమాచారంతో సదరు గెజిట్ కాపీలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సోమవారం సమర్పించింది. వాటి ఆధారంగా రిజర్వేషన్లను సూచిస్తూ ఎస్ఈసీ ఎన్నికల షెడ్యూల్‌ను సిద్ధం చేయనుంది. ఈ మేరకు ఆయా విభాగాలు ఇప్పటికే కసరత్తు ప్రారంభించాయి. ఈ ప్రక్రియను పూర్తి చేసి.. ఈనెల 26న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎస్ఈసీ విడుదల చేయనున్నట్లు తెలిసింది. అదే జరిగితే.. బుధవారం

మిగతా 13వ పేజీలో...

డిస్కమ్‌లకు ఊరట లభించేనా!?

విద్యుత్తు సంస్థలను గట్టెక్కిస్తారా?

నష్టాల ఊబి నుంచి బయటపడేస్తారా?

కొత్త డిస్కమ్‌పై నిర్ణయం తీసుకుంటారా?

నేడే 'విద్యుత్తు' క్యాబినెట్ 13



బాలీవుడ్ హీమ్యాన్ ఇక లేరు

దిగ్గజ నటుడు ధర్మేంద్ర తుదిశ్వాస

అనారోగ్యంతో ఇంట్లోనే మృతి

ముంబైలో పూర్తయిన అంత్యక్రియలు

ఆరున్నర దశాబ్దాల సినీ ప్రస్థానంలో 300కు పైగా చిత్రాల్లో నటన

'బాలీవుడ్ హీమ్యాన్' అనే బిరుదుతో ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సంతాపం

ముంబై, నవంబరు 24: 'హీమ్యాన్ ఆఫ్ ద హిందీ సినిమా'గా పేరొందిన దిగ్గజ నటుడు, నిర్మాత, పార్లమెంట్ మాజీ సభ్యుడు.. ధర్మేంద్ర (89) ఇక లేరు. కొంతకాలంగా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో సోమవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ధర్మేంద్ర పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్థానిక విల్లే పార్లే శ్మశానవాటికకు తరలించారు. ఆయన కన్నుమూశారన్న విషయం తెలుసుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు అక్కడికి వచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడే ఆయనకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ధర్మేంద్ర మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము,

మిగతా 10వ పేజీలో...

నిరంజన్ రెడ్డీ.. పిచ్చిపిచ్చిగా మాట్లాడితే

పుచ్చలేస్తది



- అంగడి స్థలాలను కబ్జా చేసిన నిరంజన్
- మూడు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నడు
- ఆయన అవినీతిని కప్పిపుచ్చిన హరీశ్‌రావు
- మీడియా ద్వారా పెద్దసారు దృష్టికి తీసుకెళ్తా
- నిరంజన్‌రెడ్డి కారణంగా వనపర్తి స్థానంలో బీఆర్ఎస్ ఇక ఎన్నటికీ గెలవదు: కవిత

వనపర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వంకాయ పుచ్చు ముఖం వేసుకొని ప్రజల్లోకి ఎలా వెళ్తారంటూ తనపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వ్యక్తిగత ఆరోపణలు చేశారని, ఇంకోసారి తన గురించి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చలేస్తదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా హెచ్చరించారు. తండ్రి వయసు వారని.. ఇప్పటికీ గౌరవిస్తున్నానని, లేకపోతే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రెండు రోజుల 'జాగృతి జనం బాట'లో భాగంగా రెండో రోజు సోమవారం ఆమె వనపర్తిలో పర్యటించారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో...

అడ్డంగా బుక్కై జైలుకెళ్లిన 'లిక్కర్ రాణి'



గత ఎన్నికల్లో ప్రజల ముందు మాకు తలవంపులు

ఎవరి మెప్పుకోసం ఈ ఆరోపణలు?

చేతనైతే నిరూపించాలి

కవితకు సభ్యత, సంస్కారం లేవు

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి 2



నిందితురాలు ఇందిర

పెళ్లయినా దాచి.. మళ్లీ పెళ్లి..

8.5 తులాల బంగారంతో వధువు పరారీ

అప్పటికే ఆమెకు వివాహం.. కుమార్తె కూడా

పెళ్లయిన 2 రోజులకే బయటపడ్డ బాగోతం

మ్యారేజీ బ్యూరో మాటలు నమ్మి నట్టేట మునిగిన వరుడు.. వరంగల్‌లో ఘటన

నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు 3

భర్తను కడతేర్చిన భార్యలు

పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య

నిజామాబాద్ జిల్లా దేవక్కపేటలో ఘటన

తెలంగాణ నోయిడా!

అంతర్జాతీయ గుర్తింపు వచ్చేలా లగచర్లను అభివృద్ధి చేస్తాం

ఇప్పుడు రైతులే ముందుకొచ్చి 3000-4000 ఎకరాలు ఇస్తున్నారు

రూ.5000 కోట్లతో కొడంగల్‌లో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మాణం

ఉస్మానియా క్యాంపస్‌లో లేని విభాగాలకూ ఇక్కడ చోటు

మూడేళ్లలో నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి

ఆర్థిక స్వాతంత్ర్యానికి పెద్దపీట వేశాం.. ఆడబిడ్డలు అండగా ఉండాలి

మూడు నాలుగు రోజుల్లో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చే చాన్స్

కొడంగల్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌కు భూమిపూజ... రూ.103 కోట్ల పనులకు శంకుస్థాపన



కొడంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): "కొడంగల్ ప్రాంతానికి అంతర్జాతీయ పరిశ్రమలను తీసుకొస్తాం. పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం. 'తెలంగాణ నోయిడా'గా అంతర్జాతీయ గుర్తింపు వచ్చేలా లగచర్ల పారిశ్రామికవాడను తీర్చిదిద్దుతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. పరిశ్రమల ఏర్పాటుకు లగచర్లలో భూ సేకరణ చేస్తే కొంతమంది కుట్రలు చేసి.. అమాయక రైతులను రెచ్చగొట్టి అధికారులపై దాడులు చేయించారని, దాంతో వారు అన్యాయంగా కేసుల్లో ఇరుక్కున్నారని గుర్తు చేశారు. తాము భూ నిర్వాసితులతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని, దాంతో, లగచర్ల, హకీంపేట, పోలేపల్లిల్లో 3000-4000 ఎకరాల భూములను రైతులు ముందుకొచ్చి ఇస్తున్నారని తెలిపారు. సున్నం గనులు కొడంగల్ నియోజకవర్గంలో ఉంటే పరిశ్రమలు, ఉద్యోగాలు కర్ణాటకలో ఉన్నాయని, త్వరలో ఇక్కడే సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. కొడంగల్ శివారు ఎన్కేపల్లి వద్ద హరే కృష్ణ సంస్థ - అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ కిచెన్ భవన నిర్మాణ పనులకు

మిగతా 13వ పేజీలో...

హెల్త్ యూనివర్సిటీలో అక్ర'మార్కులు' నిజమే

నిగ్గు తేల్చిన కమిటీ

ప్రాథమిక ఆధారాల సేకరణ.. సర్కారుకు నివేదిక

కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం 14

నేను రాజీనామా చేయడం లేదు 13

స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్నా సిద్ధమే: కడియం శ్రీహరి



అందరికీ అభివృద్ధి

ప్రతి ఒక్కరికీ ఫలాలు సమానంగా పంచడమే లక్ష్యం

మెరుగైన విద్య, భద్రత, ఉత్తమ వైద్యం, ఉపాధి

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం

జీడీపీకి రాష్ట్రం నుంచి 10% వాటా అందించడం

రాష్ట్రాన్ని 3 ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి

తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌లో సర్కారు లక్ష్యాలు

వచ్చే నెల 8,9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరణ



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలను సమానంగా అందించడమే 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్ లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది. అందరి దృష్టినీ తెలంగాణ వైపు ఆకర్షించడమే ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వ కార్యక్రమాలు ఉంటాయని తెలిపింది. ఈ మేరకు డిసెంబరు 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో ఆవిష్కరించనున్న విజన్ డాక్యుమెంట్‌లో పలు విషయాలను పొందుపరిచింది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి 10 శాతం వాటాను అందించేందుకు వీలుగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని తెలిపింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) ఆధారంగా ఈ అభివృద్ధిని సాధిస్తామని, సమగ్ర, సమాన, స్థిరమైన అభివృద్ధి అనేవి ప్రజలే కేంద్రబిందువుగా ఉంటాయని వెల్లడించింది. రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ప్రధాన ఆశయాలను నిర్దేశించుకున్నట్లు

మిగతా 14వ పేజీలో...



కోకాపేటలో హెచ్ఎండీఏ విక్రయించిన 17, 18 నంబరు ప్లాట్లు

కోకాపేటలో మళ్లీ కోట్లు!

ఈసారి రూ.137 కోట్లు పలికిన ఎకరం భూమి ధర

9.9 ఎకరాల వేలంతో హెచ్ఎండీఏకు రూ.1,356 కోట్లు

రెండేళ్ల క్రితం ఇక్కడే ఎకరానికి రూ.100.75 కోట్లు

నాటి సగటు ధర రూ.73 కోట్లు.. నేడు రూ.136.75 కోట్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోకాపేటలో భూముల ధర మళ్లీ కోట్లు పలికింది. రెండేళ్ల క్రితం ఇక్కడి స్థలాలను హెచ్ఎండీఏ విక్రయించగా ఎకరం అత్యధికంగా రూ.100.75 కోట్లు పలికి తెలుగు రాష్ట్రాల్లో రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే. ఇటీవల రాయదుర్గంలోని నాలెడ్జి సిటీలో టీజీఐఐసీ భూములను వేలం వేస్తే ఎకరం ఏకంగా రూ.177 కోట్లు పలికింది. తాజాగా కోకాపేటలోనే మరోసారి రూ.100 కోట్ల మార్కు దాటింది. అక్కడి నియోపోలీస్ లేఅవుట్‌లోని 17, 18వ నంబర్ ప్లాట్లను హెచ్ఎండీఏ సోమవారం ఆన్‌లైన్‌లో (ఈ-వేలం) వేలం వేసింది. ఈ వేలం ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ ఈ కామర్స్ నిర్వహించింది. ఉదయం 11 గంటల నుంచి

మిగతా 2వ పేజీలో...

'హెచ్ఐఎల్‌టీ' విధానంలో

ఇన్‌సైడర్ ట్రేడింగ్

పారిశ్రామికవేత్తలతో ముందుగానే కాంగ్రెస్ ముఖ్య నేతల ఒప్పందాలు

టీజీఐఐసీ ధరలు కాదని, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరలు.. అదే మతలబు

లక్షల కోట్ల భూముల్ని దోచేసే యత్నం

దేశంలోనే భారీ కుంభకోణమిది

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి 13

సాదాబైనామా తిరస్కరణకు 3 కారణాలు

అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లకు సీసీఎల్ఏ సర్క్యులర్

ఉన్నతాధికారుల్లో అయోమయం

క్షేత్రస్థాయిలో దాదాపు 15 కారణాలు ఉన్నట్లు గుర్తింపు 2

ప్రతి జిల్లాకు ఒక ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్

» డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు ఏర్పాటు చేస్తూ జీవో జారీ

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని ప్రాసిక్యూషన్ విభాగానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 33 జిల్లాల్లోని జ్యుడిషియరీకి అనుగుణంగా అన్ని జిల్లాల్లోనూ ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ సోమవారం జీవో జారీ చేశారు. దాని ప్రకారం ప్రతీ జిల్లా ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్‌లో ఒక డిప్యూటీ ప్రాసిక్యూషన్ డైరెక్టర్, ఒక అసిస్టెంట్ ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌ను ప్రభుత్వం నియమించనుంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయా పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లను నియమించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ శీలం సాంబశివారెడ్డిని ఆదేశించింది. గతంలో జిల్లా ప్రాసిక్యూషన్ కార్యాలయాల్లోని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రేడ్-1, డిప్యూటీ ప్రాసిక్యూషన్ డైరెక్టర్లకు పరిపాలనా అధికారాలను కల్పిస్తూ ఉన్న ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు తాజా జీవోలో సర్కారు పేర్కొంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాసిక్యూషన్ విభాగంలో ముఖ గుర్తింపు హాజరు పద్ధతి (ఎఫ్ఆర్ఏఎంఎస్)ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సాదాబైనామా తిరస్కరణకు 3 కారణాలు

» సర్క్యులర్ జారీ చేసిన సీసీఎల్ఏ

» ఉన్నతాధికారుల్లో అయోమయం

» క్షేత్రస్థాయిలో 15 కారణాలున్నట్లు గుర్తింపు

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ఎటువంటి కారణాలు ఉంటే సాదాబైనామాలను తిరస్కరించవచ్చునో తెలియజేస్తూ క్షేత్రస్థాయి అధికారులకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) కార్యాలయం రెండు రోజుల క్రితం ఒక సర్క్యులర్ పంపింది. దాని ప్రకారం.. దరఖాస్తుదారు ఆధీనంలో భూమి లేకపోయినా, అఫిడవిట్ ఇవ్వకపోయినా, డిమాండ్ నోటీసు పంపిన తర్వాత రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించకున్నా.. ఇచ్చిన ఫార్మాట్ ప్రకారం.. ఈ మూడు కారణాలను నమోదు చేయాలని పేర్కొంది. అయితే, ఈ సర్క్యులర్ అధికారులను గందరగోళానికి గురిచేసింది. క్షేత్రస్థాయిలో సుమారు 15 కారణాలుంటే.. కేవలం మూడింటినే ప్రస్తావించడం అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లలో చర్చకు దారితీసింది. ఒకవైపు సాదాబైనామా దరఖాస్తుల విషయంలో అఫిడవిట్ తప్పనిసరి కాదని, గ్రామ స్థాయిలో విచారణ చేసి నిర్ధారణ చేయాలని చెప్పిన ఉన్నతాధికారులు.. తిరస్కరణకు చూపిన కారణాల్లో అఫిడవిట్ కూడా చేర్చడంతో అధికారులు విస్తుపోతున్నారు. అఫిడవిట్ తప్పనిసరి కాదని గతంలో ఉన్నతాధికారులు చెప్పినా.. చాలా మంది తహసీల్దార్లు అఫిడవిట్ లేదనే సాకుతో అనేక దరఖాస్తులను పక్కన పెట్టారని తెలుస్తోంది. సీసీఎల్ఏ పంపిన సర్క్యులర్‌లో మూడు కారణాలే చూపినా.. క్షేత్రస్థాయి అధికారులు 15 కారణాలున్నాయని అంటున్నారు. దరఖాస్తుదారు ఆధీనంలో భూమి లేకపోవడం, అఫిడవిట్ తీసుకురాలేకపోవడం, స్టాంప్ డ్యూటీ చెల్లించకపోవడం, పహాణీలో విక్రయించిన వ్యక్తి పేరు లేకపోవడం, సర్వే నంబరు మునిసిపల్ పరిధిలో ఉండటం, ప్రభుత్వ భూమి, సీలింగ్ క్యాటగిరీ.. వక్ఫ్, దేవాదాయ, భూదాన్ క్యాటగిరీలో ఉండటం, 2-6-2014 తర్వాత సాదాబైనామా విక్రయాలు, ఇప్పటికే భూ భారతిలో నమోదై ఉండటం, వ్యవసాయేతర భూమిగా ఉండటం, ఇంటి పట్టా.. కొనుగోలుదారు చిన్న, సన్నకారు రైతుల క్యాటగిరీలో లేకపోవడం, కోర్టు వివాదాలు ఉండటం వంటివి ఉన్నాయని పేర్కొంటున్నారు. దరఖాస్తు తిరస్కరణకు ఇవన్నీ కారణాలుగా తెలిపేందుకు కొత్త ఫార్మాట్‌ను తామే తయారు చేసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

అరకొరగానే పరిష్కారం..

సీసీఎల్ఏ లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 9,00,880 సాదాబైనామా దరఖాస్తులున్నాయి. దీనికి సంబంధించి 11,49,316 సర్వే నంబర్లున్నాయి. వీటిలో 9,00,295 మందికి నోటీసులు పంపారు. మొత్తం దరఖాస్తుల్లో తహసీల్దార్ నుంచి ఆర్డీవోకు పంపినవి 4,63,412. అందులో ఆమోదించిన సర్వే నంబర్లు కేవలం 44. తిరస్కరించిన సర్వే నంబర్లు 1,39,713. సూర్యాపేట జిల్లాలో 81,626 సాదాబైనా దరఖాస్తులు ఉండగా, అందులో 55,956 దరఖాస్తులను తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు పంపారు. వాటిలో ఆమోదించినవి ఒకటి మాత్రమే. ఖమ్మంలో 1,11,442 దరఖాస్తులు ఉంటే తహసీల్దార్ నుంచి ఆర్డీవోకి వెళ్లినవి 58,596. ఇందులో నేటి వరకు ఒక్కటి కూడా ఆమోదించలేదు. రంగారెడ్డి, హనుమకొండ, మహబూబాబాద్, గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మంచిర్యాల, సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్, సిరిసిల్ల, వరంగల్, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, ములుగు, సిద్దిపేట, వనపర్తి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో తహసీల్దార్ నుంచి ఆర్డీవో లాగిన్‌కు వెళ్లిన దరఖాస్తుల్లో ఒక్కటీ ఆమోదం పొందలేదు. జనగామలో2 ,కరీంనగర్-5, నిజామాబాద్-12, జగిత్యాల-3, నల్లగొండ-7, మెదక్-9, భూపాలపల్లి-2 నారాయణపేటలో ఒక దరఖాస్తు ఇప్పటి వరకు ఆమోదం పొందాయి.

నిరంజన్ రెడ్డీ.. పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చలేస్తది

(మొదటి పేజీ తరువాయి)

ఆమె మీడియాతో మాట్లాడారు. కృష్ణానది పరివాహక ప్రాంతం, వనపర్తి, పెబ్బేరులలో నిరంజన్ రెడ్డి అంగడి స్థలాలను కబ్జా చేసి మూడు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. ఒక ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వకుండా నీళ్ల నిరంజన్‌రెడ్డి అని పేరు పెట్టుకున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్కొక్కరు మూడేసి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని ధ్వజమెత్తారు. వనపర్తిలో నిరంజన్‌రెడ్డి చేసిన అవినీతిని మాజీ మంత్రి హరీశ్‌రావు కప్పిపుచ్చారని ఆరోపించారు. అవినీతి విషయాన్ని పెద్దసారు దృష్టికి తీసుకెళ్లకుండా వెనుకేసుకొచ్చారని విమర్శించారు. ప్రస్తుతమున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరంజన్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హరీశ్‌రావుకు కాంగ్రెస్ ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నందుకే నిరంజన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఇక ఎప్పటికీ అధికారంలోకి రాదని, దానికి ప్రధాన కారణం నిరంజన్ రెడ్డేనని అన్నారు. పదేళ్లలో 32 మంది బీసీలపై కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేశారని, ఇది కూడా పెద్ద సారుకు తెలియదన్నారు. ఆయన అవినీతి బాగోతాన్ని మీడియా ద్వారా పెద్ద సారు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం.. నిరంజన్ రెడ్డి అవినీతిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అడ్డంగా బుక్కై జైలుకెళ్లిన 'లిక్కర్ రాణి'

» గత ఎన్నికల్లో ప్రజల ముందు మాకు తలవంపులు

» ఎవరి మెప్పుకోసం ఈ ఆరోపణలు?: నిరంజన్ రెడ్డి

వనపర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితలా తాను అడ్డంగా బుక్కయి జైలులో ఉండి, రాష్ట్రంలోని మహిళల మనోభావాలను బజారుకీడ్చేలా 'లిక్కర్ రాణి' అని పేరు తెచ్చుకోలేదని మాజీ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా గత ఎన్నికల ముందు ఆమె తెచ్చుకున్న లిక్కర్ రాణి అనే పేరుతో తాము ప్రజలకు సమాధానం చెప్పలేకపోయామని అన్నారు. సోమవారం వనపర్తిలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కవితకు సభ్యత, సంస్కారం లేవని, తనపై చేసిన ఆరోపణలు, వ్యాఖ్యలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. తనపై ఆమె చేసిన ఆరోపణలను చేతనైతే ఆధారాలతో నిరూపించి మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నదని, సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. వాటిపై పోరాటం చేయాల్సింది పోయి కవిత బీఆర్ఎస్ పార్టీ నాయకులపై ఎందుకు విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై సుతిమెత్తగా మాట్లాడుతున్న కవిత.. బీఆర్ఎస్ నాయకులైన తనతో పాటు సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డిలపై ఎవరు మెప్పు కోసం ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో లక్ష 25 వేల ఎకరాలకు సాగునీరు అందించామని, అందుకే ప్రజలు నీళ్ల నిరంజన్‌రెడ్డిగా పేరు పెట్టారని అన్నారు.

గిరిజనుల సొమ్ము స్వాహా

జీసీసీ పెట్రోల్ బంకుల్లో రూ.కోట్లు మాయం.. ఉన్నతాధికారుల అండతో సిబ్బంది చేతివాటం

» ఆడిట్‌లో తేడాలున్నా.. చర్యలు శూన్యం

» ఆయిల్ కంపెనీలకు డబ్బులు ఇవ్వకపోవడంతో పెట్రోల్ బంకుల మూత


భద్రాచలం డివిజన్ పాల్వంచ జీసీసీలోని ములకలపల్లి ఫిల్లింగ్ స్టేషన్

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాల్సిన రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్(టీజీ జీసీసీ) అక్రమాలు, అవినీతికి నిలయంగా మారింది. గిరిజనుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు(గిరిజన ఫిల్లింగ్ స్టేషన్లు) అక్రమార్కుల పాలిట కామధేనువులయ్యాయి. కంచె చేను మేసిన చందంగా.. బంకుల నిర్వాహకులే అవినీతికి పాల్పడుతున్నారు. నిధులు దుర్వినియోగమైనట్లు ఆడిట్ నివేదికల్లో తేటతెల్లమైనా.. చర్యలు, రికవరీ లేకపోవడం వల్ల నిత్యం ఏదో ఒక చోట డబ్బులు కాజేస్తున్న ఉదంతాలు బయటకు వస్తూనే ఉన్నాయి. పలు ప్రాంతాల్లో జీసీసీ పరిధిలో జరిగిన అక్రమాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రమే కాకుండా ఉన్నతస్థాయి అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ఉట్నూర్, భద్రాచలం, ఏటూరునాగారం డివిజన్ల పరిధిలోని 31 పెట్రోల్ బంకులను జీసీసీ నిర్వహిస్తోంది. స్థానిక గిరిజనులకు ఉపాధి కల్పించడం, వచ్చే లాభాలతో వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలనేదే లక్ష్యం. ఏటా దాదాపు రూ.200 కోట్లకుపైగా వ్యాపారం నడుస్తోంది. అయితే, బంకులు నిర్వహించే ఉద్యోగులు అక్రమాలకు పాల్పడటంతో ఆశించిన లక్ష్యం నెరవేరడంలేదు. వచ్చే డబ్బులను కాజేస్తూ.. పెట్రోల్, డీజిల్ ఎక్కువగా ఆవిరవుతుందనే సాకు చూపుతూ, నష్టాలొస్తున్నాయని కంపెనీలకు డబ్బులు చెల్లించడం లేదు. దీంతో నర్సంపేట, ఏటూరునాగారం, భద్రాచలం, ఉట్నూరు ప్రాంతాల్లోని కొన్ని బంకులు మూతపడ్డాయి.

చోద్యం చూస్తున్న జీసీసీ..

● పాల్వంచ బ్రాంచ్ జీసీసీ పరిధిలో పనిచేసిన ఓ సేల్స్‌మన్ విషయంలో జరిగిన వ్యవహారం జీసీసీ లోపాలను కళ్లకు కట్టింది. 2021-22లో జీసీసీ ఆడిట్ నివేదిక ప్రకారం.. అక్కడి సేల్స్‌మన్ రూ.45,32,591 అక్రమాలకు పాల్పడ్డారు. ఇందులో గోడౌన్ సరుకుల నిధులు రూ.20,70.504, ములకలపల్లి జీసీసీ బంకు నిధులు రూ.24,62,086 కాజేసినట్లు ఆడిట్ నివేదికలు స్పష్టం చేశాయి. దీనిపై నోటీసులు ఇచ్చిన ఉన్నతాధికారులు.. దుర్వినియోగమైన సొమ్మును రాబట్టడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు.

● ములకలపల్లిలోని జీసీసీ ఫిల్లింగ్ స్టేషన్‌లో జరిగిన అక్రమం.. సంస్థ నియమావళిని ఏ విధంగా ఉల్లంఘించారో తెలియజేస్తోంది. జీసీసీ నిబంధనల ప్రకారం బంకుల నిర్వహణ బాధ్యత(ఇన్‌చార్జ్) రెగ్యులర్ ఉద్యోగికి మాత్రమే ఇవ్వాలి. కానీ, జీసీసీలోని ఓ ఉన్నతాధికారి తనకు అనుకూలమైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి బంక్ బాధ్యతలు అప్పగించారు. జీసీపీఎస్ పాల్వంచ మేనేజర్ 31.5.2023న జారీ చేసిన మెమో (ఆర్‌సి. నం..బి.91/2022) ప్రకారం.. ప్రేమ్ కుమార్ అనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ములకలపల్లి బంకులో ఏకంగా రూ.72 లక్షలు కాజేసినట్లు తేలింది. ఆ సొమ్ము వెంటనే చెల్లించాలని నోటీసులిచ్చినా, నిధుల రికవరీపై జీసీసీ తీసుకున్న చర్యలు ప్రశ్నార్థకంగా ఉన్నాయి. ఈ తతంగంలో ఉన్నతాధికారుల ప్రమేయం ఉందన్న అనుమానాలున్నాయి.

అక్రమాలు పునరావృతం..

జీసీసీ బంకుల్లో అవినీతికి పాల్పడిన ఉద్యోగులపై కఠిన చర్యలు లేకపోవడంతో పలు బంకుల్లో పదే పదే అవే అక్రమాలు జరుగుతున్నాయి. నిర్మల్ బంకు ఇన్‌చార్జ్ గతంలో దాదాపు రూ.15 లక్షలకుపైగా కాజేశారని స్పష్టమైంది. అతడిపై చర్యలు తీసుకోకపోవడంతో మళ్లీ రూ.9లక్షలకుపైగా దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల ఉట్నూరులో ఐటీడీఏ పీవో నిర్వహించిన సమీక్షలో ఈ విషయం వెల్లడైంది. ఇక ఆదిలాబాద్ జిల్లా జైనూరులోని పెట్రోల్ బంకు ఇన్‌చార్జ్ రూ.12 లక్షలు కాజేసినట్లు విచారణలో తేలింది. దీంతో ఆ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. అయినా, ప్రస్తుతం ఆ బంకులో రూ.7లక్షలకుపైగా నిధులు దుర్వినియోగమవడం విశేషం. అదే జిల్లా తిర్యాణిలో కూడా ఇదే విధమైన పరిస్థితి ఉంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట జీసీసీ పరిధిలోని అనంతరెడ్డిపల్లి పెట్రోల్ బంకులోనూ రూ.10 లక్షలు దుర్వినియోగమైనా.. నోటీసులతో సరిపెట్టారనే ఆరోపణలున్నాయి. అయితే, రికవరీకి చర్యలు తీసుకుంటున్నామని జీసీసీజీఎం సీతారాంనాయక్ తెలిపారు.

డిజిటల్ అరెస్టు పేరిట వైద్యుడి కుటుంబం బందీ!

» సీబీఐ అధికారినంటూ ఫోన్లో బెదిరింపులు

» గంట గంటకూ వీడియో కాల్

» 3 రోజుల పాటు ఇల్లు కదలని కుటుంబం

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు వంటిదేదీ లేదని ప్రభుత్వం, పోలీసులు ఎంతగా చెబుతున్నా.. ప్రజల్లో అవగాహన లేక మోసపోతూనే ఉన్నారు. తాజాగా సైబర్ నేరగాళ్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ సీనియర్ వైద్యుడి కుటుంబాన్ని డిజిటల్ అరెస్టు పేరిట మూడు రోజుల పాటు బందీ చేశారు. డబ్బులు లాగేందుకు ప్రయత్నించారు. కానీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) పోలీసులకు విషయం తెలియడంతో సదరు వైద్యుడి కుటుంబానికి అవగాహన కల్పించారు. భద్రాచలంలో డాక్టర్ బుద్ధరాజు సుబ్బరాజు(80), ఆయన కుటుంబ సభ్యులు నీలా నర్సింగ్ హోమ్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం ఆయనకు కొందరు వాట్సాప్ వీడియోకాల్ చేశారు. తాము సీబీఐ అధికారులమని.. ముంబైలో సుబ్బరాజు ఆధార్‌తో తెరిచిన బ్యాంకు ఖాతాకు 100కుపైగా సైబర్ నేరాలతో ప్రమేయం ఉందని తేలిందని చెప్పారు. సుబ్బరాజు, ఆయన కుటుంబ సభ్యులంతా సీబీఐ డిజిటల్ అరెస్టులో ఉన్నారని.. ఈ విషయం ఎవరికి చెప్పవద్దని, ప్రతి గంటకు వీడియోకాల్ చేస్తామని, అందుబాటులో ఉండాలని బెదిరించారు. సుబ్బరాజు బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల వివరాలు తీసుకున్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లను రద్దు చేసి, ఆ సొమ్మును తాము చెప్పిన ఖాతాలకు బదిలీ చేయాలని, లేకుంటే కఠిన చర్యలు చేపడతామని బెదిరించారు. ఆదివారం రాత్రి వరకు వైద్యుడి కుటుంబం ఇంట్లోనే బందీగా ఉండిపోయింది. వారు ఆస్పత్రికి రాకపోవడంపై సందేహం వచ్చిన సిబ్బంది.. సుబ్బరాజు ఇంటికి వెళ్లారు. డిజిటల్ అరెస్టు విషయం తెలుసుకుని జిల్లా సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాధితుడి ఇంటికి చేరుకుని.. డిజిటల్ అరెస్ట్ అనేదే లేదని, ఇది సైబర్ నేరగాళ్ల మోసమని అవగాహన కల్పించారు. సదరు సైబర్ నేరస్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టామని సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ సోమవారం హైదరాబాద్‌లో మీడియాకు వెల్లడించారు.

ప్రీ లాంచ్ పేరుతో రూ. 60 కోట్లు మోసం

» జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థల్లో ఈడీ సోదాలు

హైదరాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచ్ స్కీములతో మోసాలకు పాల్పడుతున్న జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ గ్రూప్ ఆఫ్ సంస్థల్లో ఈడీ ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. సంస్థ ఎండీ కాకర్ల శ్రీనివాస్ సహా అనుబంధ సంస్థలకు సంబంధించి మొత్తం 8 ప్రాంతాల్లో వరుసగా 2 రోజులు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో డిజిటల్ పరికరాలు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారుల నుంచి వసూలు చేసిన డిపాజిట్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసినట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు వివరాలను వెల్లడించారు. జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రీ-లాంచ్ స్కీమ్‌ల పేరుతో ప్లాట్లు విక్రయిస్తున్నట్లు ఆఫర్లు ప్రకటించి కస్టమర్ల నుంచి రూ.60 కోట్లు వసూలు చేసింది. ఆ తరువాత గడువు ముగిసినప్పటికీ ప్లాట్లను అప్పగించలేదు. నిబంధనల మేరకు ప్లాట్ అప్పగించకపోవడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని వినియోగదారులు కోరినా ఆ మొత్తం తిరిగి చెల్లించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్ కమిషనరేట్ సహా పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. వినియోగదారుల నుంచి సేకరించిన సొమ్ములు వివిధ సంస్థలకు మళ్లించినట్లు ఈడీ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇందులో జనప్రియ గ్రూప్ సహా మరో ఆరు సంస్థల పేరుతో షెల్ కంపెనీలను ఏర్పాటు చేసినట్లు ఈడీ దర్యాప్తులో వెలుగు చూసింది. దీంతో వరుసగా రెండు రోజులపాటు చేపట్టిన సోదాల్లో కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలు సేకరించారు. ప్రధాన నిందితుడు కాకర్ల శ్రీనివాస్‌ను గతంలో హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేయగా బెయిల్‌పై విడుదలైన తర్వాత అజ్ఞాతంలో ఉన్నట్లు ఈడీ అధికారులు వెల్లడించారు.

కాంగ్రెస్ ద్రోహాన్ని ఢిల్లీలో ఎండగడతాం

బీసీలకు 42% రిజర్వేషన్లపై పార్లమెంటులో చర్చించాలి: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీలకు కాంగ్రెస్ చేసిన ద్రోహాన్ని, ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ చేసిన అన్యాయాన్ని ఢిల్లీలో ఎండగడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కి, అడుగడుగునా బీసీలను వంచిస్తున్న ఆ పార్టీని ఎక్కడికక్కడ నిలదీస్తామని చెప్పారు. తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించకుండానే అమలు చేసినట్లు చెబుతూ దేశవ్యాప్తంగా తిరుగుతున్న రాహుల్‌గాంధీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో ఈ అంశం చర్చకు వచ్చేలా చూడాలన్నారు. లేదా ప్రైవేట్ మెంబర్ బిల్లు సైతం ప్రవేశపెట్టవచ్చు అని చెప్పారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఎంపీలు తమ గళమెత్తాలన్నారు. బీసీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలతో సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. ఇందులో బీఆర్ఎస్ నేతలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, బండ ప్రకాష్, మధుసూదనాచారి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, జోగురామన్న, తుల ఉమ తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్ల నుంచి నిధుల అమలు, ఓబీసీ సంక్షేమశాఖ వరకు అన్ని అంశాల్లో కేంద్రంలోని బీజేపీ ద్రోహం చేస్తోందన్నారు. కాగా బీఆర్ఎస్ వెన్నంటి ఉన్న కార్పొరేటర్లకు భవిష్యత్తులో మంచి పదవులు దక్కుతాయని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీకి చెందిన జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో సమావేశమైన సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నారు. కాగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా తమ పార్టీ అధినేత కేసీఆర్ దీక్ష చేపట్టిన నవంబరు 29వ తేదీని దీక్షాదివస్ పేరిట ఘనంగా నిర్వహించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. పార్టీ శ్రేణులు దీక్షాదివస్‌ను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు ఇవ్వాలి: హరీశ్

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామంటూ చేస్తున్న డబ్బా ప్రచారాన్ని ఇకనైనా ఆపేయాలని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 13నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు, బిల్లులును వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం సీఎం రేవంత్‌ను డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాలో నిజామాబాద్‌కు చెందిన ఓ కార్మికురాలు ఆవేదన వ్యక్తం చేసిన వీడియోను హరీశ్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పిల్లలకు భోజనం పెడుతున్నామని ఆమె అందులో ఆరోపించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ.. బిల్లులు, జీతాల కోసం మధ్యాహ్న భోజన కార్మికులు ఆందోళనకు దిగే పరిస్థితి రావడం కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీసీవర్గాలకు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశచరిత్రలో ఇతర ప్రభుత్వాలేవీ చేపట్టిన దాఖలాల్లేవని హరీశ్‌రావు అన్నారు. కులవృత్తులకు సహకారం అందించడంతోపాటు విద్యా సంస్థల ఏర్పాటు వరకు కేసీఆర్ చేసిన మేలు బీసీవర్గాలు మర్చిపోలేదని, వారంతా ఆయన వెంటే ఉన్నారని తెలిపారు.

రాజ్యసభలో ప్రైవేటు బిల్లు పెడతాం: బీఆర్ఎస్ నేతలు

బీసీ రిజర్వేషన్ల విషయంలో మాటలు మార్చి చివరకు మొండిచేయిచూపిన సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ సమాధి తప్పదని బీఆర్ఎస్ బీసీ నేతలు హెచ్చరించారు. ఆ పార్టీ నేతలు వి.శ్రీనివాస్‌గౌడ్, బండప్రకాష్, మధుసూదనాచారి, వద్దిరాజు రవిచంద్ర, జోగురామన్న సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుల ద్వారా రాజ్యసభలో ప్రైవేటు బిల్లుకు ప్రతిపాదిస్తామనివారు తెలిపారు.

నల్లమలసాగర్‌పై ఏపీ ముందడుగు

» డీపీఆర్ తయారీకి టెండర్ల ఆహ్వానం

» జనవరి నెలాఖరుకల్లా టెండర్లు ఖరారు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకంపై మరో ముందడుగుపడింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు ఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తూ సోమవారం గుంటూరు జల వనరుల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ టెండర్లు పిలిచారు. ఇందులో డీపీఆర్ తయారీకి రూ.9.10 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ధరావతు కింద రూ.7,68,334 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 11వ తేదీలోపు బిడ్లు సమర్పించాలి. పోలవరం-బనకచర్ల అనుసంధానం స్థానంలో పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన ప్రక్రియను రూ.58,700 కోట్లతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి నెలాఖరునాటికి బిడ్లను ఖరారు చేస్తారు. తయారుచేసిన డీపీఆర్‌ను కేంద్ర జలసంఘం పరిశీలన, ఆమోదానికి పంపి.. మార్చి నెలాఖరులోగా దాని పరిధిలోని సాంకేతిక సలహా కమిటీ ఆమోదం పొందాలని.. ఏప్రిల్ నెలాఖరులోగా కేంద్ర జలశక్తి, అటవీ పర్యావరణ శాఖల ఆమోదం కూడా తీసుకోవాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. పోలవరం కుడి కాలువ నుంచి 175.40 కిలోమీటర్ల అటవీయేతర భూముల ద్వారా ఇప్పటికే నిర్మించిన ఓపెన్ కెనాల్ ద్వారా నీటిని తరలిస్తారు. ఈ జలాలను గోదావరి ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం వద్ద అక్విడెక్టును నిర్మించి నాగార్జునసాగర్ కుడి కాలువలో ఎత్తిపోయాలని మొదట భావించారు. ఇలా అక్విడెక్టును నిర్మిస్తే రూ.1,500 కోట్లు అదనపు వ్యయమవుతుందని అక్విడెక్టు ద్వారా కాకుండా బుడమేరు కాలువ ద్వారా పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదిలోకి పంపితే గోదావరి ట్రిబ్యునల్ ఆదేశాలు వర్తించే ఆస్కారంలేదని నిపుణులు సూచించారు. దీంతో.. అక్విడెక్టును నిర్మించకుండానే కృష్ణా నదిలోకి రోజుకు 2టీఎంసీల చొప్పున తరలించాలని నిర్ణయించారు.

వర్కింగ్ జర్నలిస్టుల చట్టాల రద్దు అప్రజాస్వామికం

» కేంద్రం లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

» జర్నలిస్టు సంఘాల ధర్నా

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను రద్దు చేయడం అప్రజాస్వామికమని జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునేంతవరకు కార్మికులు, జర్నలిస్టులు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈమేరకు హైదరాబాద్ విద్యానగర్‌లోని కేంద్ర కార్మికశాఖ కార్యాలయం ముందు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో జర్నలిస్టులు హాజరయ్యారు. ధర్నాకు ఫెడరేషన్ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ పి.రాంచందర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ... కార్మికులను గాలికొదిలేసి కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ.. రెండు వర్కింగ్ జర్నలిస్ట్‌ల చట్టాలను రద్దు చేయడాన్ని ఖండించారు. ఇప్పటికే అనేక సమస్యలతో జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ కొత్త లేబర్ కోడ్‌లతో సమస్యలు మరింత జటిలమవుతాయని తెలిపారు. అనంతరం లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కేంద్ర డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ బిశ్వభూషణ్‌కి ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఆయకట్టు అభివృద్ధి పథకం కింద దరఖాస్తు చేసుకోండి: కేంద్ర జలశక్తి శాఖ లేఖ

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టు అభివృద్ధి, నీటి నిర్వహణ పథకం(క్యాడ్‌వాం) కింద రాష్ట్రం నుంచి ఒక్క ప్రతిపాదన కూడా రాలేదని కేంద్ర జలశక్తి శాఖ గుర్తుచేసింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కె.ఎల్.కాంతారావు ఈ నెల 17న లేఖ రాశారు. 2025-26 సంవత్సరంలో దేశవ్యాప్తంగా రూ.1600 కోట్లతో ప్రయోగాత్మకంగా ఆయకట్టు అభివృద్ధి, నీటి నిర్వహణ పథకాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ పథకంలో ఇప్పటిదాకా 23 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు చేరాయని, ఆయా రాష్ట్రాల నుంచి 34 చోట్ల క్లస్టర్/ప్రాజెక్టులను పథకం కింద ఎంపిక చేసినట్లు గుర్తుచేశారు. కనీసం ఒక్క ప్రాజెక్టునైనా ఈ పథకంలో చేర్చాలని రాష్ట్రానికి సూచించారు.

యూజీసీ నిబంధనల ఉల్లంఘన

» సన్ డిగ్రీ కళాశాలలకు రూ. 8 లక్షల జరిమానా

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాంనగర్, మియాపూర్, లింగంపల్లిలో ఉన్న సన్ డిగ్రీ కళాశాలలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం భారీ జరిమానా విధించింది. డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు అనుమతి తీసుకున్న ఈ కళాశాల యూజీసీ, విశ్వవిద్యాలయ నిబంధనలు ఉల్లంఘించి ఢిల్లీలోని లింగయ్య విద్యాపీఠ్ నుంచి డిగ్రీ, ఎంబీయే రెగ్యులర్ కోర్సులు, ఇతర డిప్లొమా కోర్సులు నిర్వహిస్తోంది. ఈ విషయంపై గత జూలైలో మాసారం ప్రేమ్ కుమార్ ఫిర్యాదు చేయడంతో ఉస్మానియా ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరిపి రెండుసార్లు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం రూ. 8 లక్షల జరిమానా విధించారు. మళ్లీ పునరావృతం అయితే గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ కేసులను కూడా నమోదు చేయవచ్చని అఫిడవిట్ తీసుకున్నారు.

'నగదు' విరాళాలను అడ్డుకోండి

» ఇది ఎన్నికల పవిత్రతకు భంగకరం : పిటిషనర్

» కేంద్రం, ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 24 : రాజకీయ పార్టీలు నగదు రూపంలో విరాళాలు స్వీకరించేందుకు అనుమతిస్తున్న ఆదాయ పన్ను చట్టంలోని నిబంధనను మార్పు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం, జాతీయ ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీచేసింది. 2వేలు కంటే తక్కువ మొత్తంలోని విరాళాలను నగదు రూపంలో దాతల నుంచి 'ఎంతైనా' తీసుకోవడాన్ని ఆదాయ పన్ను చట్టంలోని క్లాజ్ (డి) సెక్షన్ 13ఏ అనుమతిస్తుంది. అయితే, రాజకీయ నిధులకు సంబంధించిన కీలక సమాచారం, వాటిని ఇచ్చిన దాత ఉద్దేశం ఏమిటనేది ఓటర్లకు తెలియకుండా ఈ నిబంధన నిరోధిస్తోందని పిటిషనర్ ఖేమ్ సింగ్ భాటీ తెలిపారు. దీనివల్ల పారదర్శకత కొరవడి ఎన్నికల ప్రక్రియలోని పవిత్రత దెబ్బ తింటుందని పేర్కొన్నారు. పూర్తి అవగాహన, హేతుబద్ధతతో ఓటరు వ్యవహరించాల్సి ఉంటుందని, ఈ హక్కును తీసేస్తున్న సదరు నిబంధనను సవరించాలని అభ్యర్థించారు. నగదు రూపంలో విరాళాలు స్వీకరించరాదనే షరతుపైనే రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్, ఎన్నికల గుర్తు కేటాయించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ నాలుగువారాలకు వాయిదా వేసింది.

కోకాపేటలో మళ్లీ కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం 4 గంటల వరకు సాగిన వేలంలో పదికి పైగా ప్రముఖ జాతీయ, స్థానిక డెవలపర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు పోటీపడ్డాయి. ఇందులో మొదటగా 5.31 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 18వ నంబర్ ప్లాట్‌ను ఎకరం రూ.137.25 కోట్ల చొప్పున ఎంఎస్ఎన్ అర్బన వెంచర్స్ ఎల్ఎల్‌పీ అనే సంస్థ సొంతం చేసుకుంది. 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 17వ నంబర్ ప్లాట్‌ను ఎకరం రూ.136.50 కోట్ల చొప్పున వజ్ర హౌసింగ్ ప్రాజెక్ట్స్ ఎల్ఎల్‌పీ అనే సంస్థ దక్కించుకుంది. మొత్తం 9.90 ఎకరాల విస్తీర్ణంలోని ఈ రెండు ప్లాట్ల వేలం ద్వారా హెచ్ఎండీఏకు రూ.1,356 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెల 28న నియోపోలీస్ లేఅవుట్‌లోని 15, 16 నంబర్ ప్లాట్లను, డిసెంబర్ 3న 19, 20 నంబర్ ప్లాట్లను వేలం వేయనున్నారు.

సగటు ధరలో 87 శాతం వృద్ధి

రెండేళ్ల క్రితం కోకాపేటలో ఎకరానికి పలికిన సగటు ధరతో పోల్చితే ప్రస్తుతం 87 శాతం పెరుగుదల నమోదుకావటం గమనార్హం. నాడు నియోపోలీస్ లేఅవుట్‌లోనే అత్యధికంగా ఎకరం రూ.100.75 కోట్లు, అత్యల్పంగా రూ.67.25 కోట్లు పలికింది. ఎకరానికి రూ.35 కోట్లు కనీస ధరను హెచ్ఎండీఏ నిర్ణయిస్తే.. సగటున రూ.73.23 కోట్లు ఖరారైంది. తాజాగా ఎకరం సగటు ధర రూ.136.75 కోట్లు పలకటంతో 87 శాతం వృద్ధి నమోదైనట్లు అయ్యింది. భూములకు భారీ ధర పలకటంపై రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపర్లు, నిర్మాణ సంస్థల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఒడిదుడుకులు లేకుండా దేశంలో అత్యంత చురుకుగా పురోగమిస్తున్న మార్కెట్‌లో ఒకటిగా హైదరాబాద్ నిలుస్తోందని చెబుతున్నారు. 18వ ప్లాట్‌ను కొనుగోలు చేసిన ఎంఎస్ఎన్ సంస్థ గతంలో ఇదే లేఅవుట్‌లో ఎకరం రూ.73 కోట్ల చొప్పున ఏడు ఎకరాలను రూ.511 కోట్లకు కొనుగోలు చేసింది. అందులో ఆ సంస్థ కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు ప్రణాళిక వేస్తోంది. తాజాగా 5.31 ఎకరాలను రూ.728 కోట్లకు కొనుగోలు చేసింది. ప్లాట్లను కొనుగోలు చేసిన సంస్థలు డిపాజిట్ సొమ్ము రూ.5 కోట్లు మినహాయించి స్థలం ఖరీదులో కనీసం 25 శాతం మొదటి విడతగా ఏడు రోజుల్లో చెల్లించాలి. చివరి విడతగా మిగతా 75 శాతాన్ని డిపాజిట్ సొమ్మును కలుపుకొని చెల్లించాలి. వారం రోజుల్లో మొదటి విడత చెల్లించలేకపోతే సదరు సంస్థకు నోటీసులిచ్చి వేలాన్ని రద్దు చేస్తారు. డిపాజిట్ సొమ్ము తిరిగిచ్చేది ఉండదు.

అయ్యప్ప దీక్షలో ట్రాన్స్‌జెండర్లు


అయ్యప్పమాల వేసుకుంటున్న ట్రాన్స్‌జెండర్లు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు సోమవారం అయ్యప్ప మాల ధారణ చేశారు. కఠిన నియమ నిబంధనలు పాటిస్తూ 41 రోజుల పాటు పూజించే అయ్యప్ప దీక్షను.. జిల్లాలోని అయ్యప్ప దేవాలయంలో ప్రజ్ఞ, ప్రియ ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు స్వీకరించారు. ఆలయ అర్చకులు రమేష్ శర్మ వీరికి అయ్యప్ప మాలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలోనూ పలు దీక్షలు స్వీకరించి నియమ నిష్ఠలతో కొలిచామని, ఇప్పుడు అయ్యప్ప దీక్షను స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు.

రికార్డు స్థాయిలో టెట్ దరఖాస్తులు

1.26 లక్షలకు దరఖాస్తులు.. 29 వరకు గడువు

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కోసం ఈసారి రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. ఇంకా 5 రోజుల గడువు ఉండగానే టెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 1,26,085లకు చేరుకుందని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ సోమవారం తెలిపారు. ప్రాథమిక ఉపాధ్యాయుల పేపర్-1 కోసం 46,954, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాసే పేపర్-2 కోసం 79, 131 దరఖాస్తులు వచ్చాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సారి టెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 29 వరకూ గడువు ఉంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 25 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ లోపు వాటిని సవరించుకునే (ఎడిట్ ఆప్షన్) అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారు తప్పనిసరిగా టెట్ అర్హత సాధించాలని, రెండేళ్ల లోపు అర్హత సాధించకుంటే ఉద్యోగం నుంచి తొలగించాలని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో ఈదఫా టెట్ దరఖాస్తులు గణనీయంగా పెరగడం గమనార్హం. ప్రతిఏటా రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ 2 సార్లు నిర్వహిస్తున్న టెట్ పరీక్షకు ప్రతిసారీ సగటున 30 వేల దరఖాస్తులు వచ్చేవి.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య


షేక్ మూసా

- మైనార్టీ గురుకులంలో ఉరి వేసుకుని బలవన్మరణం

మోస్రా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా చందూర్ మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, పాఠశాల ప్రిన్సిపాల్ వివరాల ప్రకారం.. నిజామాబాద్‌లోని ధర్మపురి హిల్స్ కాలనీకి చెందిన షేక్ మూసా(16) పదో తరగతి చదువుతున్నాడు. ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ఇంటికి వెళ్లి, ఆదివారం సాయంత్రం వసతి గృహానికి చేరుకున్నాడు. రాత్రి ఎప్పటిలాగే తోటి విద్యార్థులతో కలిసి గదిలో పడుకున్న విద్యార్థి.. ఉదయాని కల్లా ఉరి వేసుకుని కనిపించాడు. ఇంట్లో కలహాలు, ప్రేమ వ్యవహారంలో ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపానికి గురయ్యాడని.. మూసా స్నేహితుల వద్ద చెప్పినట్లు తెలిసింది. సమాచారం అందుకుని హాస్టల్‌కు చేరుకున్న విద్యార్థి తల్లిదండ్రులు.. అన్యాయంగా తమ కుమారుడిని పొట్టన పెట్టుకున్నారంటూ పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థి ఆత్మహత్యకు ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు వసతి గృహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఘటనా స్థలానికి చేరుకున్న రుద్రూర్ సీఐ కృష్ణ, బోధన్ ఏసీపీ శ్రీనివాసులు తల్లిదండ్రులను సముదాయించి.. విద్యార్థి మృతిపై దర్యాప్తు ప్రారంభించారు.

మీరొక రబ్బర్ స్టాంప్ అధ్యక్షుడు!

- మల్లికార్జున ఖర్గేపై జేడీఎస్, నెటిజన్ల విమర్శలు

బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి మల్లికార్జున ఖర్గే ఓ రబ్బర్ స్టాంపు అధ్యక్షుడు అని జేడీఎస్ ఎద్దేవా చేసింది. 'ఏఐసీసీ అధ్యక్షుడు ఇక్కడే ఉన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఇక్కడే ఉన్నారు. అయినా సీఎం పదవి మార్పు అంశంపై బృందాలుగా విడిపోయి ఢిల్లీకి వెళుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి స్థానంలో ఉన్నా ఖర్గే ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేరు' అని ఆయనపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన రెండున్నరేళ్లు దాటిన నేపథ్యంలో సీఎం మార్పు అంశంపై తలెత్తిన అంతర్గత విభేధాలు తారస్థాయికి చేరాయి. దీనిపై బెంగళూరులో ఆదివారం మల్లికార్జున ఖర్గే స్పందించారు. ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని, అధిష్ఠానానిదే తుది నిర్ణయమని అన్నారు. పార్టీ అత్యున్నత పదవిలో ఉన్న ఖర్గే 'అధిష్ఠానం నిర్ణయం' అనడం ఏమిటని నెటిజన్లు ఆయనపై విరుచుకుపడుతున్నారు. ఈ పరిణామాలపై జేడీఎస్ స్పందిస్తూ, ఖర్గే కాంగ్రెస్ గులాంగిరీ ప్రపంచానికి తెలిసిందేనని ఎద్దేవా చేసింది. రబ్బర్ స్టాంప్ అధ్యక్షుడు అని విమర్శలు గుప్పించింది.

ఫ్లై ఓవర్‌పై నుంచి కిందపడ్డ కారు

- నలుగురు చెన్నైవాసులు దుర్మరణం

బంగారపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శబరిమలైకు కారులో వెళుతున్న నలుగురు అయ్యప్ప భక్తులు కోలారు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతులను చెన్నైకి చెందిన గోపి(38), గౌతం రమేశ్(29), హరిహరన్(27), జయంత్(30)గా గుర్తించారు. సోమవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న కారు బెంగళూరు-చెన్నై హైవేపై కోలారు జిల్లా మాలూరు తాలూకా అబ్బేనహళ్లి వద్ద అదుపు తప్పి ఫ్లై ఓవర్ పై నుంచి కింద పడింది. తీవ్రంగా గాయపడిన బాధితులను కోలారు ఆర్ఎల్ జాలప్ప ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నలుగురూ మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మాలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతులు నలుగురూ స్నేహితులని పోలీసులు తెలిపారు. నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

హేమావతి కాల్వలో

దంపతుల గల్లంతు

- భర్త మృతదేహం లభ్యం.. భార్య కోసం గాలింపు

బెంగళూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లా నంబిహళ్లి గ్రామ సమీపంలోని హేమావతి కాలువలో దంపతులు ప్రమాదవశాత్తూ కొట్టుకుపోయారు. దుస్తులు ఉతికేందుకు దీపు(24), గోపాల్(27) ఆదివారం కాల్వకు వెళ్లారు. దీపు కాలుజారి కొట్టుకుపోతుండగా, రక్షించేందుకు ప్రయత్నించిన గోపాల్ కూడా నీటిలో గల్లంతయ్యాడని భావిస్తున్నారు. ఉదయం వెళ్లిన వారు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కాల్వ వద్దకు వెళ్లి పరిశీలించారు. దుస్తులు కాలువ గట్టుపై కనిపించడంతో ఇద్దరూ నీటిలో కొట్టుకుపోయినట్టు అనుమానించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక దళం సోమవారం రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టి గోపాల్ మృతదేహాన్ని వెలికితీశారు. దీపు కోసం గాలింపు కొనసాగుతోంది. చన్నరాయపట్టణ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




లిఫ్ట్ కూలిపోయిన ప్రాంతం ఇదే.. గాయపడిన రఘుపతిని చికిత్స కోసం తరలిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఓపెన్ లిఫ్ట్ కూలి.. ఒకరి మృతి

ఇద్దరి పరిస్థితి విషమం.. ఆరో అంతస్తు నుంచి గ్రానైట్ రాళ్లు కిందకు తెస్తుండగా తెగిపడిన లిఫ్ట్

- సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ఘటన
- ప్రమాద ఘటన బాధాకరం
- వైద్యశాఖ మంత్రి రాజనర్సింహ

అమీర్‌పేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ఘోర ప్రమాదం జరిగింది. బోధనాస్పత్రి మరమ్మతు పనుల్లో భాగంగా గోడలకు ఉన్న గ్రానైట్ టైల్స్‌ను తొలగించి కిందకు తీసుకొస్తున్న ఓపెన్ లిఫ్ట్ ఆరో అంతస్తు నుంచి తెగి కిందపడింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి డీన్ శిరీష్‌కుమార్ వెల్లడించారు. ఈఎస్ఐ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న బోధనాస్పత్రి గోడలకు ఉన్న పాత టైల్స్ తొలగించి కొత్తవి అమర్చే పనులను ఈఎస్ఐ కార్పొరేషన్‌కు చెందిన సీసీ డబ్ల్యూ విభాగం చేస్తోంది. ఈ పనుల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం 3.45 గంటల ప్రాంతంలో బోధనాస్పత్రి ఆరో అంతస్తు గోడలకున్న టైల్స్‌ను తొలగించి ఓపెన్ లిఫ్ట్ ద్వారా కిందకు తీసుకొస్తుండగా ప్రమాదం జరిగింది. లిఫ్ట్ తీగలు తెగిపోయి ఒక్కసారిగా కింద పడిపోయింది. ఆ సమయంలో లిఫ్ట్ సూపర్‌వైజర్ భానుచందర్(24) దానిపై ఉండగా.. కింద రఘుపతి, మోహన్, మల్లేశ్, మైసయ్య అనే కార్మికులు ఉన్నారు. భానుచందర్‌పై గ్రానైట్ రాళ్లు పడడంతో అక్కడికక్కడే మరణించాడు. నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉన్న మోహన్, రఘుపతిలకు ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరికి అత్యవసర విభాగంలో చికిత్స చేస్తున్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని డీన్ శిరీష్‌కుమార్ వెల్లడించారు. క్షతగాత్రుల పరిస్థితిపై ఇప్పుడే ఏమీ చెప్పలేమని.. వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

మెరుగైన చికిత్స అందించండి: రాజనర్సింహ

ప్రమాద ఘటన అత్యంత బాధాకరమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని మంత్రి ఆదేశించారు.

భర్తను కడతేర్చిన భార్యలు

- పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య
- నిజామాబాద్ జిల్లా దేవక్కపేట్‌లో ఘటన


మోహన్(ఫైల్)

భీమ్‌గల్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో క్షణికావేశంతో భర్త మాలవత్ మోహన్(40)ను ఆయన ఇద్దరు భార్యలు పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారు. ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని దేవక్కపేట్ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మోహన్ మొదటి భార్య మాలవత్ కవిత, రెండో భార్య సంగీత ఒకే ఇంట్లో ఉంటున్నారు. ప్రతీ రోజు మద్యం తాగి భార్యలను వేధింపులకు గురి చేస్తుండటంతో తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి మద్యం తాగి వచ్చిన మోహన్ తన ఇద్దరు భార్యలను ఒక గదిలో బంధించాడు. దీంతో మోహన్‌ను హత్య చేయాలని ఇద్దరు నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు మోహన్ రెండో భార్య సంగీత గ్రామంలోని కిరాణ దుకాణం నుంచి పెట్రోల్ తీసుకువచ్చింది. ఆ సమయంలో ఇంటి వరండాలో మద్యం మత్తులో కుర్చీలో నిద్రపోతున్న మోహన్‌పై ఇద్దరు భార్యలు పెట్రోల్ పోశారు. పక్కనే ఉన్న పొయ్యిలో మండుతున్న కట్టెతో నిప్పంటించారు. మంటలు అంటుకుని మోహన్ అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు భార్యలు పరారయ్యారు. మృతుడి బంధువు మాలవత్ రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి మొదటి భార్యకు ముగ్గురు కూతుళ్లు, రెండో భార్యకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఇద్దరు రైల్వే కానిస్టేబుళ్ల సస్పెన్షన్

- ప్రయాణికుడి నుంచి 60 లక్షల దోపిడీ వ్యవహారంలో చర్యలు

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో ఓ యువకుడి నుంచి రూ.60 లక్షలు దోచుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండయ్యారు. చెన్నైలోని ఓ ఐజీ వద్ద పనిచేస్తున్న ఆరోగ్య జాన్ కెనడీ (32) గత అక్టోబర్ 30న ఓ భూమిని కొనుగోలు కోసం రూ.60 లక్షలతో తిరుచ్చి వెళ్లారు. తాము ఏసీబీ అధికారులమంటూ ఇద్దరు వ్యక్తులు తిరుచ్చి రైల్వే స్టేషన్‌లో కెనడీ బ్యాగును తనిఖీ చేశారు. అందులో ఉన్న నగదుకు సంబంధించిన రశీదులు అడిగారు. కెనడీ తన వద్ద లేవని చెప్పడంతో.. తాము త్వరలోనే సమన్లు పంపిస్తామని, ఆ తర్వాత ఆ నగదుకు సంబంధించిన రశీదులతో కార్యాలయానికి రావాలని కొన్ని పత్రాలు ఇచ్చి వెళ్లిపోయారు. ఇప్పటి వరకూ తమకు ఎలాంటి సమన్లు రాకపోవడంతో కెనడీ తిరుచ్చి ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించారు. అయితే అక్టోబరు 30న తాము ఎక్కడా తనిఖీలు చేపట్టలేదని వారు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. రైల్వే కానిస్టేబుళ్లు జాన్సన్ క్రిస్టో కుమార్, దీనదయాళ్‌ను శనివారం అరెస్టు చేశారు. వారిద్దరినీ సస్పెండ్ చేస్తున్నట్టు తిరుచ్చి రైల్వే ఎస్పీ రాజన్ ప్రకటించారు.

రూ.4 కోట్ల విలువ చేసే గంజాయి స్వాధీనం

చెన్నై, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి విమానాశ్రయంలో రూ.4 కోట్ల విలువ చేసే గంజాయిని ఎయిర్‌పోర్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి థాయిలాండ్ నుంచి వచ్చిన అబ్దుల్ అమీర్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. కౌలాలంపూర్ నుంచి తిరుచ్చికి రెండు రోజుల క్రితం ఎయిర్ ఏషియా విమానం రాగా, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓ బ్యాగులో హైడ్రో ఫోనిక్ అనే మేలు రకం గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.4 కోట్లు ఉంటుందని ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. థాయిలాండ్ నుంచి కౌలాలంపూర్ మీదుగా తిరుచ్చికి స్మగ్లింగ్ చేసినట్టు గుర్తించారు. దీన్ని తీసుకొచ్చిన తంజావూరు చెందిన అబ్దుల్ అమీర్ అనే ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. అదే విధంగా సింగపూర్ నుంచి తిరుచ్చికి వచ్చిన మరో విమానంలో 2,477 తాబేలు పిల్లలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ఇంతకీ ఎవరా బ్లాక్ షీప్?

- జీవో విడుదలకు ముందే ప్రతిపక్ష నేత చేతికి ప్రతులు
- పాత దోస్తానమే కారణమా?
- లీకువీరులపై చర్యలకు రంగం సిద్ధం

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అంతర్గత సమాచారం, ముఖ్య నిర్ణయాలు గోప్యంగా ఉండాల్సిన దశలోనే ప్రతిపక్ష నేతలకు చేరుతుండడం తెలంగాణ సచివాలయంలో కలకలం రేపుతోంది. 'ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడు' అన్నట్లుగా, కొందరు సీనియర్ అధికారులే ఈ లీకేజీలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం అనుమానిస్తోంది. చర్చల దశలోనే ఉన్న ఒక ముఖ్యమైన పాలసీకి సంబంధించిన జీవో విడుదల కాక ముందే, ఆ వివరాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల 21న ప్రెస్ మీట్‌లో బహిర్గతం చేశారు. జీవోలో ఉన్న ప్రతి అంశాన్ని ఆయన పూసగుచ్చినట్లు విమర్శించారు. ప్రతిపక్ష నేత విమర్శలకు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కౌంటరిస్తూ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత రోజు (ఈనెల 22) ప్రభుత్వం అధికారికంగా జీవోను విడుదల చేసింది. గత ప్రభుత్వ నేతలతో ఉన్న పాత పరిచయాల కారణంగానే కొంతమంది అధికారులు కీలక సమాచారాన్ని లీక్ చేస్తున్నారని రాజకీయ వర్గాలు తీవ్రంగా చర్చించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే, ఈ లీకేజీల వెనుక ఉన్న 'బ్లాక్ షీప్' (నమ్మక ద్రోహులైన) అధికారులను గుర్తించే పనిలో భాగంగా ఇంటెలిజెన్స్ వర్గాలు విచారణను ప్రారంభించాయి. సచివాలయం నుంచే లీకులు జరుగుతున్నాయా? లేక రాజకీయ నాయకుల నుంచి జరుగుతున్నాయా? అనే స్పష్టత లేకపోవడంతో దర్యాప్తు మరింత సవాలుగా మారింది. అయితే డాక్యుమెంట్లు, నిర్ణయాల లీకులను అరికట్టేందుకు సెక్యూరిటీ వ్యవస్థ పట్టు బిగిస్తోందని సమాచారం. త్వరలోనే ఈ వ్యవహారంపై స్పష్టత రావొచ్చని, లీకేజీలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తప్పవని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

27 ఏళ్ల తర్వాత తల్లి చెంతకు

- 1988లో మావోయిస్టుల్లో చేరిన పోలెపాక సునీల్
- ఇటీవలే లొంగుబాటు.. త్వరలోనే ఇంటికి.. పోలీసుల తీపి కబురు
- ఆనందంతో తల్లి సులోచన కన్నీటి పర్యంతం


సునిల్ తల్లి సులోచన, సోదరుడు నవీన్‌కుమార్

ఖిలా వరంగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన 15-16 ఏళ్ల వయస్సులో ఇంటినుంచి వెళ్లిన కన్న కొడుకు కాన రాలేదు. ఐదేళ్ల క్రితం తండ్రి చనిపోయినప్పుడైనా వస్తాడనుకున్న ఆ తల్లి ఆశలు వదిలేసుకున్నారు. కన్నవారూ, మనుమలు, ముని మనుమల పలకరింపులతో జీవనం సాగించే ముదిమి వయస్సులో ఉన్న ఆ కన్నతల్లి.. తన కొడుకు ఇంటికి వస్తున్నాడన్న వార్త తెలిసి భావోద్వేగానికి గురయ్యారు. ఆనందంతో ఉక్కిరి బిక్కిరైన కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె పేరు పోలెపాక సులోచన (80). ఆమె కొడుకు పేరు పోలెపాక సునీల్. 'ఆపరేషన్ కగార్' ప్రభావంతో జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని నిర్ణయించుకుని పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టుల్లో ఆయన ఒకరు. 27 ఏళ్ల క్రితం ఇంటర్‌లో చేరిన 1988లో ఒకరోజు కాలేజీకెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు, సోదరులు.. బంధువులు, స్నేహితులు, తెలిసిన చోటల్లా వెదికారు కానీ ఫలితం లభించలేదు. తర్వాత కొన్ని రోజులకు ఇంటికొచ్చిన పోలీసులు 'మీ కొడుకు మావోయిస్టుల్లో కలిశాడు' అని చెప్పి, సోదాలు చేసి వెళ్లారు. తర్వాత కూడా అప్పుడప్పుడు పోలీసులు వచ్చి 'మీ కొడుకు వచ్చాడా..?, ఎప్పుడు వచ్చాడు' అని చెప్పి తనిఖీలు చేసి వెళ్లిపోయే వారని సునీల్ తల్లి, ఇతర కుటుంబ సభ్యులు చెప్పేవారు. ఇదంతా గతం.. ఇప్పుడు వారం క్రితం హైదరాబాద్ పోలీసుల నుంచి సునీల్ తల్లికి ఫోన్ కాల్ వచ్చింది. వరంగల్ పోలీసులూ ఇంటికొచ్చారు. అటు హైదరాబాద్, ఇటు వరంగల్ పోలీసులు చెప్పింది ఒక్కటే మాట.. 'ఛత్తీస్‌గఢ్‌లో మీ కొడుకు పోలీసులకు లొంగిపోయాడు. ప్రస్తుతం జైలులో ఉన్నాడు. త్వరలో ఇంటికొస్తాడు' అని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని బల్లార్‌పూర్ ప్రాంత దళ కమాండర్‌గా ఉన్న సునీల్ ఈ నెల 6న పోలీసులకు లొంగిపోయాడని పోలీసులు చెప్పారు. ఈ వార్త సులోచన ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అతడి సోదరులు సైతం సునీల్ రాక కోసం వేయి కన్నులతో వేచి చూస్తున్నారు. క్రిస్టియన్ కాలనీలోని అతడి స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెళ్లయినా దాచి.. మళ్లీ పెళ్లి..

- 8.5 తులాల బంగారంతో పరారీ
- అప్పటికే వివాహమై కుమార్తె కూడా ఉన్న మహిళ
- మ్యారేజి బ్యూరో మాటలు నమ్మి నట్టేట మునిగిన వరుడు
- నలుగురిపై కేసు నమోదు


నిమిషకవి ఇందిర

పర్వతగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆమెకు ఇదివరకే పెళ్లయింది.. ఓ కుమార్తె కూడా ఉంది. కానీ ఆ విషయాన్ని దాచి మ్యారేజి బ్యూరో ద్వారా ఓ యువకుడిని పెళ్లి చేసుకుంది. రెండు రోజులకే విషయం బయటపడటంతో బంగారం, నగదుతో పరారైంది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చౌటపల్లిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా సోమవారం బయటికి వచ్చింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. చౌటపల్లి గ్రామానికి చెందిన 31 ఏళ్ల మట్టపల్లి దేవేందర్‌రావు వ్యవసాయదారు. ఆయన పెళ్లి సంబంధాల కోసం వరంగల్‌లో మ్యారేజి బ్యూరో నడుపుతున్న కోడిపెల్లి అరుణ, రామారావు దంపతులను సంప్రదించారు. వారు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నిమిషకవి ఇందిర (30) ప్రొఫైల్ చూపించారు. ఆమె నచ్చడంతో మ్యారేజీ బ్యూరో ద్వారా సంప్రదింపులు జరిపారు. గత నెల 24న వరంగల్ మామూనూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో రూ.4 లక్షలకుపైగా ఖర్చుపెట్టి ఘనంగా వివాహం చేసుకున్నారు. అయితే పెళ్లి సమయంలో ఇందిర తల్లి తప్ప ఆమె తరఫు బంధువులు, కుటుంబసభ్యులు, స్నేహితులెవరూ హాజరుకాలేదు. అందుకు ఏదో కారణం చెప్పారు. ఇక దేవేందర్‌రావు పెళ్లి సందర్భంగా ఇందిరకు 8.5 తులాల బంగారు ఆభరణాలు పెట్టారు. కానీ పెళ్లయిన రెండు రోజులకే ఆమె ప్రవర్తనపై అనుమానం రావడంతో దేవేందర్ ఆమె ఫోన్‌ను చెక్ చేశారు. ఆమెకు అప్పటికే పెళ్లయి, కుమార్తె కూడా ఉందని గుర్తించారు. దీనిపై ఇందిరను నిలదీయగా.. పెళ్లి జరిగిన మాట వాస్తవమేనని, కానీ విడాకులు తీసుకున్నానని చెప్పింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అయితే తెల్లవారేసరికల్లా ఇందిర ఎవరికీ చెప్పాపెట్టకుండా ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలు తీసుకుని వెళ్లిపోయింది. పరువు పోతుందని దేవేందర్‌రావు ఈ విషయం బయటికి చెప్పలేదు. చివరికి సోమవారం నిమిషకవి ఇందిర, ఆమె తల్లి లక్ష్మి, మ్యారేజి బ్యూరో నిర్వాహకులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై ప్రవీణ్‌ను వివరణ కోరగా.. ఇందిర గతంలోనూ ఇలా ఒకరిద్దరిని మోసం చేసిందనే ఆరోపణలు వస్తున్నాయని, దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

సిరిసిల్ల పురపాలక సంఘ కార్యాలయం
రాజన్న సిరిసిల్ల జిల్లా

No. E1/358/3/3rd Party QC/2025 — ఆసక్తి వ్యక్తీకరణ (EOI) — తేది:22.11.2025

సిరిసిల్ల పురపాలక సంఘం వారు చేపట్టే అన్ని రకాల సివిల్ పనులు మరియు ఇతర పనుల కొరకు థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ కన్సల్టెంట్లుగా పేరొందిన కన్సల్టెంట్ల నుండి జీఎస్టీ, సిరిసిల్ల పురపాలక సంఘం వారు ఆసక్తి వ్యక్తీకరణ కోరుచున్నారు. ఆసక్తిగల ఏజెన్సీలు/కన్సల్టెంట్లు తమ ఆసక్తి వ్యక్తీకరణను అర్హత ఆఫర్‌తో పాటు పంపవలెను మరియు అవసరమైన డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో మరియు ఈ కార్యాలయానికి 24.11.2025న సా.04.00 గం.ల నుండి 01.12.2025న సా.04.00 గం.ల వరకు దాఖలు చేయాలని అభ్యర్థించడమైనది. టెక్నికల్ బిడ్ 01.12.2025న సా.04.30 గం.లకు తెరవబడును. కన్సల్టెంట్లు www.tender.telangana.gov.in లో బిడ్ డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసి దాఖలు చేయవలెను.

సం/- కమిషనర్, సిరిసిల్ల పురపాలక సంఘం

DIPR RO No.11266-PP/CL/ADVT/1/2025-26, Dt.24.11.2025

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, PR రీజియన్, వరంగల్

టెండరు ప్రకటన తేది: 24.11.2025

MRR, CDP, CRR SCP, MPP ZPP నిధులు మరియు NHM గ్రాంట్ల క్రింద మంజూరైనట్టి రూ.9.71 కోట్ల అంచనావ్యయంతో 20 NIT లు కలిగిన టెండరు ప్రకటనలో చూపిన పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండర్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై SE PR వరంగల్ ద్వారా అప్‌లోడ్ చేయబడే అవకాశం ఉన్నది. ఒక్కో NIT 25.11.2025 నుండి ప్రచురణ తేదీ నుండి 14 పని రోజుల కాలానికి వెల్లుబాటుతో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. ఇతర వివరాలు https://tender.telangana.gov.inలో ఆన్‌లైన్‌లో చూడవచ్చును మరియు SE PR రీజియన్ వరంగల్ నుండి కూడా పొందవచ్చును. ఇమెయిల్ ఐడి seprwglmrr2022@gmail.com

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పిఆర్ రీజియన్, వరంగల్

DIPR RO No.11307-PP/CL/ADVT/1/2025-26, Dt:24.11.2025

జిల్లా కలెక్టర్ మరియు ఛైర్మన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (ఇ.జి.యస్) విభాగము, జనగాం

పత్రిక ప్రకటన

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (ఇ.జి.యస్) విభాగము గారు 2025-26 సంవత్సరమునకు గాను ప్రతి గ్రామములో నర్సరీ పెంచుట కొరకు పాలిథిన్ సంచులు (Bags) కొనుగోలుకై గుర్తింపు పొందిన Manufacturers Companiese నుండి రేటు నిర్ధారణ కొరకు షార్ట్ టెండర్ కోరడమైనది. అట్టి టెండరు షెడ్యూల్‌ని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం, జనగాం గారి నుండి దరఖాస్తు తీసుకొను తేది: 25.11.2025, సమయం: ఉదయం 10.30ని.ల నుండి 27.11.2025 మధ్యాహ్నం 04.00 గం.ల వరకు టెండరు షెడ్యూల్ పొంది తేది: 27.11.2025 సమయం సాయంత్రం 04.00 గం.ల లోపు (టెండర్ షెడ్యూల్ ఒక్కంటికి ఇ.యం.డి, డిమాండ్ డ్రాఫ్ట్ రూపాయలు 7,000/- (రూపాయలు ఏడు వేల రూపాయలు మాత్రమే), DRDO DRDA JANGAON గారి పేరు మీద తీసి, టెండరు ఫారంతో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జనగాం కార్యాలయంలో సీల్ కవర్ టెండర్లను సమర్పించగలరు. మరియు అట్టి సీల్ టెండర్లను శ్రీయుత అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జనగాం గారి అధ్యక్షంలో తేది: 27.11.2025 సమయం సాయంత్రం 05.00 గం.లకు తెరువబడును.

సం./- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జనగాం జిల్లా

DIPR RO No.11336-PP/CL/ADVT/1/2025-26, Dt:24.11.2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ - తెలంగాణ ప్రభుత్వం
శ్రీ పర్వతి ఆంజనేయ స్వామి దేవస్థానం
మద్దిమడుగు గ్రామం, పదర మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

Rc.No.86/SAPSD — తేది: 23.11.2025 (1వ పిలుపు)

దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి: వివరాలు:- క్ర.సం: 1) హనుమాన్ సదన్, 12 రూముల టయిలెట్స్ ఫ్లోరింగ్ వాష్ ఏరియాలు, వెదర్ ప్రూఫ్ కోర్స్ గర్భాలయం, మండపం మరమ్మతులు మరియు టాయిలెట్ టైల్స్ వేయుట మరియు ద్వారాల మరమ్మతులు. మొత్తం: రూ.08.00 లక్షలు. క్ర.సం: 2) వివిధ అభివృద్ధి పనులు అనగా పాకశాల, యాగశాల, మూడు (3) అంతస్తుల రాజగోపురం, శ్రీ స్వయంభు మైసమ్మ దేవాలయ ప్రాకారం గోడ సలహారంతో మరియు దేవాలయ ఆవరణలో ఓపెన్ డ్రైనేజ్ లైన్ ఏర్పాటు చేయుట. మొత్తం: రూ.131.00 లక్షలు. మరింత సమాచారం కొరకు దర్శించండి: https://tender.telangana.gov.in. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 25.11.2025. బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేది (దాఖలు): 09.12.2025.

సం/- ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సెల్ నం: 9676619532

DIPR RO No.11252-PP/CL/ADVT/1/2025-26, Dt: 24.11.2025

GOVERNMENT OF ANDHRAPRADESH
Swachha Bharat Mission (Urban)
MA & UD Department
Swachha Andhra Corporation

e-Procurement Tender Notice

S. No.	NIT No.	Name of Work
1.	NIT No. 49 to 57/ SAC/SBM (U)/ CE/SWM/2025-26, Dt. 25.11.2025	Establishment of processing facilities for Wet & Dry Garbage waste in various municipalities under Package 01 to 09 in Andhra Pradesh (9 works)

The above bid can be downloaded on "ap e-procurement" portal from 25.11.2025 at 5.00 PM to and due date submission of Bid 15.12.2025 is on upto 5.00 PM. Bid opening on 15.12.2025 at 05.30 PM. Please refer to www.apeprocurement.gov.in for details.

Sd/- Managing Director, SAC, Vijayawada

DIPR R.O. No.4594PP/CL/ADVT/1/1/2021-22, Dt:24.11.2025

THE ANDHRA PRADESH MINERAL DEVELOPMENT CORPORATION LIMITED
Door No. 294/1D, 100 feet Road (Tadigadapa to Enikepadu Road), Kanuru, Vijayawada-521137.
Andhra Pradesh, India
Tel:+91-866-2429999, Fax: +91-866-2429977 Email:contracts-ho@apmdc.in

NOTICE INVITING TENDER

Tender No. : APMDC/HO/Supply of Manpower on Outsource basis at APMDC Head Office and project offices/2025-26, Dt. 25.11.2025

APMDC invites E-tender from reputed Agencies for **"Selection of Agency for providing Manpower on Outsource Basis at APMDC Ltd., Head Office and other Project Offices of APMDC".** For more information on the eligibility criteria, tender fees, timelines and other details, please visit e-procurement website of GoAP www.tender.apeprocurement.gov.in) or APMDC website (www.apmdc.ap.gov.in). The Tender document is available for downloading from **25.11.2025** and the last date for bid submission is **16.12.2025** by 17:00 Hrs.

Place: Vijayawada — Sd/- Managing Director,
Date: 25.11.2025 — The A.P. Mineral Development Corporation Limited

DIPR R.O. No.4596PP/CL/ADVT/1/1/2021-22, Dt:24.11.2025

TELANGANA POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA :: HYDERABAD-82.

T.No.Rfs-No.25/HPC&HP/BESS/TGGENCO/2025-26

Selection of Battery Energy Storage System Developers for setting up of 1500 MWH (375MW x 4 Hrs) Standalone Battery Energy Storage Systems at Vacant lands of 2 Nos Maheswaram 750MWH(187.5MWx4 Hrs) & Choutuppal 750MWH (187.5MWx4 Hrs) 400KC/220KV TGTRANSCO Substations in Telangana under Tariff-based Global Competitive Bidding with VGF with PSDF support in B-O-O model with 15 years tenure. **Schedule Available Date: 24.11.2025 at 17:00 Hrs.**
Last date of submission of bids: 27.12.2025 at 17:00 Hrs.

The tender documents under Operational Guidelines for "Selection of Viability Gap Funding" for development of Battery Energy Storage System, dt.09.08.2025, issued by the Ministry of Power, Government of India along with the guidelines for procurement and utilisation of Battery Energy Storage Systems as a part of Generations, Transmission and Distribution assets, along with Ancillary services as notified in Gazette Notification CG-DL-E-11032022-234077, dt. 10th March, 2022 as amended from time to time issued by the Ministry of Power.

For further Details: "https://www.bharat-electronictender.com & www.tggenco.com

DIPR R.O.No.11270-PP/CL/ADVT/1/2025-26, Dt.24.11.2025

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అవని ఆర్తి

'మన శీతోష్ణస్థితి మారుతోంది. మన ధరిత్రి సంక్షోభంలో ఉన్నది. భవిష్యత్తు భయం గొల్పుతోంది, అనిశ్చితంగా ఉంది. అయినా ఈ మహా అస్తవ్యస్తత నడుమ భావిని ముందే సూచించే శక్తిని కనుగొన్నాను. తుఫానులు ప్రచండమవుతున్నవేళ రక్షణనిస్తుందది. ఈ ప్రపంచాన్ని మరింత మెరుగ్గా రూపొందించే స్థిరమైన, నిరంతర కృషితోనే అది మనకు సురక్షిత ప్రదేశంగా ఉంటుంది'– 2007లో నోబెల్ శాంతి పురస్కారాన్ని పొందిన ఐపీసీసీ నివేదిక ప్రధాన రచయిత, వాతావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జగదీష్ శుక్లా తన జీవిత కథకు ముక్తాయింపుగా అన్న ఆ మాటలు ఆవశ్యక ఫలితాలను సాధించడంలో విఫలమవుతున్నప్పటికీ వాతావరణ మార్పుపై ఐక్యరాజ్యసమితి వార్షిక సదస్సులు కొనసాగవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పుతున్నాయి. శనివారంనాడు, బ్రెజిల్‌లో అమెజాన్ మహారణ్యం ముంగిట ఉన్న బెలెమ్ నగరంలో ముగిసిన కాప్ 30 సదస్సు సైతం ఆ వార్షిక చర్చల ప్రధాన లక్ష్యాన్ని సాధించడంలో విఫలమయింది.

కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) సదస్సులుగా ప్రసిద్ధి పొందిన ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ సదస్సులు మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమయినప్పుడు, వాతావరణంలో కర్బన ఉద్గారాల సాంద్రత 360.67 పార్ట్స్ పర్ మిలియన్‌గా ఉండగా ఇప్పుడు అది, శాస్త్రవేత్తలు చెప్పిన భద్రమైన పరిమితి (350 పీపీఎమ్) కంటే చాలా అధికంగా 426.68 పిపిఎమ్‌గా ఉన్నది! వాతావరణ మార్పుకు కారణ మవుతున్న కర్బన ఉద్గారాలకు ప్రధాన వనరు అయిన శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశల వారీగా తగ్గించేందుకు ఒక మార్గదర్శక ప్రణాళికను రూపొందించడం కాప్ 30 అజెండాలో ప్రధానాంశంగా ఉన్నది.

పారిశ్రామిక విప్లవకాలంలో రికార్డయిన గరిష్ఠ ఉష్ణోగ్రతకు మించి 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేయాలని పారిస్ కాప్ సదస్సు నిర్దేశించింది. చారిత్రకంగా శిలాజ ఇంధనాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పుడు తమ అభివృద్ధికి వాటిపై ప్రధానంగా ఆధారపడి ఉన్న దేశాలకు, పునర్వినియోగ ఇంధన వనరులకు మళ్లేందుకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ఉదాసీనత చూపుతున్నాయి. ఆర్థిక సహాయం, అధునాతన సాంకేతికతల బదిలీ లేకుండా వర్ధమాన దేశాలు శిలాజ ఇంధనాల వినియోగాన్ని త్యజించడమనేది అసాధ్యం. ఇది జరగనంతవరకు కర్బన ఉద్గారాలు భారీ స్థాయిలో కొనసాగుతూ వాతావరణ మార్పు తీవ్రమవుతూనే ఉంటుంది. వాతావరణ మార్పును నిరోధించాలనే ఉమ్మడి లక్ష్యం కంటే సంపన్న దేశాలు తమ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్య మిస్తున్నంతవరకు శిలాజ ఇంధనాల వినియోగం దశల వారీ తగ్గింపుపై ప్రతిష్టంభన కొనసాగడం ఖాయం. కాప్ 30 'ది కాప్ ఆఫ్ ట్రూత్' అని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా అభివర్ణించారు. సత్య సదస్సు! నిజమే, అవని ఆర్తరావాన్ని ప్రతిధ్వనించింది. అంతే.

మానవాళిని మనుగడ ముప్పు నుంచి కాపాడేందుకు ఉద్దేశించిన కాప్ సదస్సులు 'వార్షిక వాతావరణ ప్రహసనాలు' అని ఒక విజ్ఞులు అసహనం వ్యక్తం చేశారు. మరొకరు 'వాతావరణ సంత' అని చిరాకు పడ్డారు. ఈ అభియోగాలు పూర్తిగా అసత్యాలు కావు. ఈ కారణంగానే వాతావరణ మార్పుతో మానవాళి మనుగడకు ముంచుకువస్తున్న ముప్పుపై ఆందోళన చెందుతున్న దేశ దేశాల వైజ్ఞానికులు, మేధావులు కొత్త ఆలోచనలు చేస్తున్నారు. ఏటా ఒక దేశంలో నిర్వ హించడానికి బదులుగా (ప్రతి ప్రధాన ఖండానికి ఒక్కొటి చొప్పున) ఐదు శాశ్వత వేదికలుగా రూపొందించాలని ఇటాలియన్ సామాజిక శాస్త్రవేత్త ఫ్రాన్సెస్కో గ్రిల్లో ప్రతిపాదించారు. క్లైమేట్ అడాప్టేషన్, క్లైమేట్ మిటిగేషన్, గవర్నెన్స్ ఆఫ్ ప్లేసెస్ (మహాసముద్రాలు, ఆర్కిటిక్, అంటార్కిటిక్) ఏఐ అండ్ క్లైమేట్, జియో ఇంజినీరింగ్ అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కార బాధ్యతలను ఆ ఐదు వేదికలకు అప్పగించాలని గ్రిల్లో సూచించారు. వాతావరణ మార్పు వైపరీత్యాలను అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్న సామాన్యులలో పర్యావరణ సమస్యల పరిష్కారంపై అవగాహనను పెంపొందిం చేందుకు కాప్ చర్చల గురించి సమగ్రంగా తెలియజేయవలసిన అవసరమున్నది. ఇందులో భాగంగా గతంలో గాంధీ విజ్ఞాన పరిషత్ రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ పర్యావరణ పరిస్థితి : ప్రజానివేదిక–1990' లాంటి నివేదికలను ఏటా వెలువరించేందుకు తెలుగు రాష్ట్రాల లోని పర్యావరణ ఉద్యమకారులు పూనుకోవాలి.

కులాల లెక్కలతో జాతి నిర్మాణమా!?





■ రాహుల్ కుమార్

కఠోర వాస్తవాలకు అక్షర రూపాలుగా, సిద్ధాంతాలుగా నిలిచినవి ఒకపట్టాన అంతరించిపోవు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదాలు ఫ్రెంచ్ విప్లవంతో హోరెత్తాయి. అవి సాకారం కావాలన్న తపన మనుషుల్లో బలంగా ఉండబట్టే ఇప్పటికీ అవి మారుమోగుతున్నాయి. మనుషులను తట్టిలేపుతూనే ఉన్నాయి. కడలి ఆటు పోటుల్లా కొంతకాలం వాటికి ప్రాబల్యం పెరగొచ్చు. తరగొచ్చు. పూర్తిగా సమసిపోవటమంటూ ఉండదు. సోషలిజం పేరుతో ఏర్పాటైన రాజ్యాలన్నీ కుప్పకూలిన తర్వాత మార్క్సిజం ప్రపంచం నుంచే అంతరించి పోతుందనే భావన కలిగింది. మానవమేధపై 150 ఏళ్ల మార్క్సిస్టు భావాల నియంతృత్వం తొలగిపోయిందని ఘనంగా ప్రకటనలూ వెలువడ్డాయి. ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభాలు కుదిపివేస్తున్నప్పుడూ, పర్యావరణం ప్రమాద స్థాయికి చేరుతోందన్న హెచ్చరికలు ప్రబలుతున్నప్పుడూ పరిష్కారాల అన్వేషణలో ఆ భావాలకు ప్రాధాన్యం ఏదో విధంగా వస్తూనే ఉంది. వాటిల్లో కొన్ని ఇప్పటి పరిస్థితులకు సరిపోకపోవచ్చు. కొన్నిటిని పరిపుష్టం చేయాల్సి రావొచ్చు, కొన్నిటిని వదులుకోవాల్సీ రావొచ్చు. కానీ అన్నిటినీ పూర్తిగా పక్కకుపెట్టే స్థాయికి మానవ సమాజం ఇంకా ఎదగలేదు. సంపద పంపిణీలో న్యాయబద్ధత ఉండాలనే మనుషుల యుగయుగాల తపనకు అక్షరరూపం ఇవ్వబట్టే అవి అంతరించటం లేదు. అలాగే మన చేతల్లో, చేతనలో, మంచిచెడుల అంచనాల్లో, ఎక్కువ తక్కువ కొలతల్లో కులదృష్టి ప్రబలంగా ఉన్నంతవరకూ 90 ఏళ్ల క్రితం అంబేడ్కర్ వ్యక్తంచేసిన భావాలకూ కాలదోషం పట్టదు. 'కులం పునాదులపై మీరు దేన్నీ నిర్మించలేరు. ఆ పునాదిపై జాతిని నిర్మించలేరు. ఆ పునాదిపై నైతికతను స్థాపించలేరు. ఆ పునాదిపై దేన్ని నిర్మించినా అది పగుళ్లు వారుతుంది. అసంపూర్ణంగా మిగిలిపోతుంది' అని అంబేడ్కర్ ఆనాడు చేసిన హెచ్చరికలో ఎంతో ప్రగాఢత, కఠోర సత్యం ఉన్నప్పటికీ సమకాలీన భారతం అందుకు వ్యతిరేక దిశలోనే వెళుతోంది.

కులాలవారీగా మనుషులను లెక్కించి ఆ మేరకు పదవులూ, ఉద్యోగాలూ, విద్యా సీట్లనూ పంచాలన్న విధానాన్ని ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఎంచుకుంటే.. బీజేపీ కూడా తన సిద్ధాంతాలను సవరించుకుని పరుగు పందెంలో రెండడుగులు ముందుకే వేసి అందరినీ ఆశ్చర్య పరచింది. లోక్‌సభ ఎన్నికల ప్రణాళికలో కులగణన గురించి ఒక్క ప్రస్తావన కూడా లేకుండా జాగ్రత్తపడిన బీజేపీ, బిహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునో, కాంగ్రెస్‌కు గట్టి రాజకీయ ప్రచారాస్త్రం లేకుండా చేయాలనో దానికి అను కూలంగా నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది చివర నుంచి ప్రారంభమయ్యే జనాభాగణనలో కులాలను లెక్కించ టానికి మంత్రివర్గం ఆమోదముద్ర కూడా వేసేసింది.

కులాలకు సంబంధించి ఏ సమాచారాన్ని సేకరిస్తారన్న దాని గురించి ఇప్పటికింకా అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడి కాలేదు. కులాల వారీగా తలలెక్కలు తేల్చినంత మాత్రాన సామాజిక, ఆర్థికస్థితిగతులపై కొత్త వెలుగులేవీ ప్రసరించవు. ఎస్సీ, ఎస్టీల గణనకు సంబంధించి ఇప్పటి వరకూ అనుసరిస్తున్న పద్ధతులను మాత్రమే ఇతర కులాల తలలెక్కల విషయంలో అనుసరిస్తే ఎవరు ఎక్కడ ఉన్నారో తెలియటం చాలా కష్టం. సంపదల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాపరంగా ఒక కులం ముందంజలో ఉందా? బాగా వెనుకబడి ఉందా? అన్నది తెలుసుకోలేం. జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలు కులాల వారీగా ఎంతమంది ఉన్నారో తెలుస్తుంది. వారి అక్షరాస్యతా శాతాన్ని సులువుగా తెలుసుకోవచ్చు. పట్టణ, గ్రామీణాల్లో నివసించే శాతాలనూ గ్రహించొచ్చు. ఇంకాస్త కష్టపడి కూడికలు వేయగలిగితే విద్యా స్థాయిలనూ లెక్కించవచ్చు. వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగంలో ఎంతమంది పనిచేస్తున్నారో కూడా తెలుసుకో వచ్చు. ఇంతకుమించి సమాచారాన్ని తెలుసుకోలేం.

కులంతో పాటు ఆర్థిక, ఉద్యోగ, విద్యా పరిస్థితులపై సర్వే చేపడితేనే కొంత సమగ్ర చిత్రం వస్తుంది. ఆస్తులు, సంపదల గురించి ప్రజలు పూర్తి సమాచారం వెల్లడించరు. అందుకే అది పరిమిత చిత్రంగానే ఉంటుంది. ఈ పరిమితి ఉన్నా బిహార్‌లో చేపట్టిన కుల సర్వేలోనే కొన్ని అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటిని బహిరంగపరచారు. మిగతా సర్వేల విషయంలో అదీ జరగటం లేదు. తెలంగాణలో చేపట్టిన సర్వేలో తేలిన కీలక విషయాలను ఇప్పటికీ వెల్లడించలేదు. కర్ణాటకలోనూ అదే చేశారు. రాజకీయంగా సున్నితమనుకున్న సమా చారాన్ని తొక్కిపట్టటం ఒక అలవాటుగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో బీసీల రిజర్వే షన్లను వర్గీకరించటానికి ఏర్పాటు చేసిన జస్టిస్ రోహిణీ కమిషన్ ఇచ్చిన నివేదికను బహిర్గతం చేయలేదు. అయిదున్నర ఏళ్ల కసరత్తు చేసి రూపొందించిన నివేదికను వెల్ల డించటానికి రాజకీయ అవసరం ఇంకా రాలేదు. అనధికారికంగా వెల్లడైన సమాచారం ప్రకారం కేంద్ర జాబితాలో 2,633 బీసీ కులాలు ఉంటే అందులో కేవలం 40 కులాలు.. మొత్తం రిజర్వేష న్లలో 50 శాతాన్ని దక్కించుకున్నాయి. 994 కులాలు ఒక్క ఉద్యోగాన్నీ, ఒక్క విద్యా సీటునూ పొందలేదు. 1400 కులాలకు 1 శాతం కంటే తక్కువ ప్రాతినిధ్యం లభించింది. బిహార్ కుల సర్వేలో వెల్లడైన విషయాలను పరిశీలించినా తేలేది అదే. అక్కడ ప్రభుత్వ ఉద్యోగాలు 20,49,370 ఉంటే 6,21,481 ఉద్యోగాల్లో ఓబీసీలు (జనాభాలో 27శాతం) ఉన్నారు. ఓబీసీల కంటే జనాభాలో ఎక్కువ ఉన్న ఈబీసీలకు (36శాతం) 4,61,725 ఉద్యోగాలు మాత్రమే దక్కాయి. మొత్తంగా చూస్తే బీసీలకు ఉద్యోగాల్లో 52శాతం వరకూ ప్రాతినిధ్యం లభించినా విడివిడి కులాల పరంగా లెక్కిస్తే నాలుగైదు కులాల ఆధిపత్యమే కనపడుతుంది.

జనాభా సేకరణలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు సంబం ధించి లభ్యమైన సమాచారాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా ప్రజలముందు పెట్టటం లేదు. ఆ వర్గాలకు సంబంధించి విద్యా, ఉద్యోగ విషయాలతో పాటు ఇళ్లకూ, ఇతర సౌకర్యాలకు సంబంధించిన (వాహనాలు, ఫోన్, టీవీ తదితరాలు) కులాలవారీ సమాచారాన్ని కావాలను కుంటే కేంద్ర ప్రభుత్వం తయారుచేయగలదు. కానీ దానికీ పూనుకోలేదు. కులాల మధ్య అవాంఛిత పోటీ పెరుగు తుందనీ, వర్గీకరణ డిమాండ్లు ఊపందుకుంటాయనే మిషతో వాటికి దూరంగా ఉంది. దేశవ్యాప్తంగా అన్ని కులాల జనాభాను లెక్కించాలన్న నిర్ణయంతో భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వానికి ఆ వెసులుబాటు ఉండకపోవచ్చు. మొట్టమొదటిసారిగా 75శాతం పైగా జనాభాకు సంబం ధించి కులాలవారీ లెక్కల వెల్లడితో ఎన్నో రూపాల్లో వర్గీకరణ డిమాండ్లు ఊపందుకుంటాయి. ఇక రాజకీయ డిమాండ్లు కూడా ఒక పట్టాన పరిష్కరించలేని సమస్య లుగా మారతాయి. కులలెక్కలతో ప్రతి సమస్యనూ ఆ కోణంలో చూసే దృక్పథం పెరిగిపోయే ప్రమాదమూ ఉంటుంది. రాజకీయ కారణాలతో బహిరంగపర్చని సమాచారాన్ని వెల్లడించాలనే ఒత్తిళ్లూ ఎక్కువవుతాయి.

కులలెక్కలతో ప్రభుత్వరంగంతో పాటు ప్రైవేటురంగంలో కూడా ఎవరు ఎక్కడ ఉన్నారో తేల్చాలనే డిమాండ్లు ఊపందుకుంటాయి. అతితక్కువ ప్రాతినిధ్యం ఉన్న కులాలు ఎక్కువగా దాన్ని సాధించటానికి కొత్త మార్గాలను అన్వేషిస్తాయి. మూడు నాలుగు వర్గీకరణలు ఉన్నచోట పది వర్గీకరణలు కావాలనే డిమాండ్లు మొదలవుతాయి. ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు పరిమితం అయిపోతున్న నేపథ్యంలో ప్రైవేటురంగంలో చోటు కల్పించాలనే ఒత్తిడి పెరుగుతుంది. ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వటంలోనూ సంక్లిష్ట తలు తలెత్తుతాయి. రెండుమూడు కులాలు జట్టుకట్టి ఫలితాలను శాసించటానికి పూనుకోవచ్చు. మరో రెండు మూడు కులాలు ప్రత్యర్థి శిబిరంగా మారి వ్యవహారాలు నడపొచ్చు. కులాల లెక్కలు జిల్లాల స్థాయిల్లో లభ్యమైన తర్వాత తలెత్తే రాజకీయ పెనుగులాటలు ఏ విధంగా ఉంటాయో స్పష్టంగా ఇప్పటికిప్పుడు అంచనా వేయలేక పోయినా కులదృక్పథాలను అవి విపరీతంగా పెంచుతాయి. ఇక ప్రతి పదేళ్లకూ కులలెక్కలు తీయటం సర్వసాధారణ మైతే తలెత్తే పరిస్థితి మన ఆలోచనలను మరింతగా కులమయం చేస్తుంది.

రాజకీయ ప్రయోజనాన్ని ఆశించకుండా ఏ విధానాన్నీ ఏ పార్టీ తలకెత్తుకోదు. కులాలు ఆధారంగా ప్రత్యేక గుర్తింపూ, రాజకీయ డిమాండ్లూ తలెత్తకుండా చూడాలన్నది హిందూత్వ సాంస్కృతిక జాతీయవాదంలో ప్రధానంగా ఉంటుంది. కులగణనతో పెరిగే కులచైతన్యానికి ఆ సాంస్కృతిక జాతీయవాదానికి ఒకపట్టాన పొసగదు. ఈ సమస్య పొంచి ఉన్నా హిందూత్వ అజెండాగా ఉన్న బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం కులగణనకు మొగ్గు చూపింది. ఎందుకిలా చేసిందని ప్రశ్నిం చుకుంటే కులగణనతో లభ్యమయ్యే సమాచారాన్ని తన ప్రయోజనాలకు అనుగుణంగా వెల్లడించే చాకచక్యం తనకుందన్న భావన కారణం కావొచ్చు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ అజెండా లేకుండా చేయాలన్న లక్ష్యం ఎలాగూ ఉండనే ఉంది. హిందూత్వకు అడ్డంకి అనుకుంటే కుల గణన సమాచారాన్ని ఓసీలు ఇంతమంది.. బీసీలు ఇంత మంది.. అన్నదానికే పరిమితం చేసి (విడివిడి కులాలవారీ కాకుండా) జాతి సమైక్యత పేరుతో మిగతా సమాచారాన్ని వెల్లడించకుండా ఉండే అవకాశాన్నీ కొట్టేయలేం. 2011లో 5000 కోట్ల రూపాయలకు పైగా ఖర్చుపెట్టి చేపట్టిన సామాజిక, ఆర్థిక, కులగణన సర్వేలో సేకరించిన కుల లెక్కలను పనికిరానివిగా తేల్చి మూలనపడేయటమే ఇందుకు నిదర్శనం. నిజానికి అప్పటి కులలెక్కల్లో తలెత్తిన చిక్కుముడులను విప్పి సమాచారాన్ని అందుబాటులో ఉంచటం అసాధ్యమేమీ కాదు. రాజకీయ సంకల్పం లేకపోవటంతో అది పరిష్కరించలేని చిక్కుముడిగా మారిపోయింది. దేశవ్యాప్తంగా ఆనాటి సర్వేలో 45 లక్షల కులాలు నమోదవ్వటం అసంబద్ధమని అన్నారే గానీ దానికి కారణం ఎవరనే విషయంపై మౌనం దాల్చారు.

కొన్ని కులాలు అంతర్గతంగా అతితక్కువ ఆర్థిక అంతరాలతో మొత్తంగా వెనుకబడి ఉన్న పరిస్థితి ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. కానీ అన్ని కులాలకు అది వర్తించదు. బీసీ కేటగిరిలో ఉన్న కులాలన్నీ ఆ పరిస్థితుల్లో లేవు. ఎన్నో కులాల్లో విపరీతమైన ఆర్థిక అంతరాలూ నెలకొన్నాయి. వివిధచోట్ల ఆధిపత్య స్థానాల్లోనూ ఉన్నాయి. అందుకే ఆర్థిక పరిస్థితులనూ పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లను కల్పించాలనే డిమాండ్లు బలం పుంజు కుంటున్నాయి. ఎస్సీ, ఎస్టీల్లో కూడా సంపన్న శ్రేణులను మినహాయించి రిజర్వేషన్లను వర్తింపచేయాలనే సూచనలు గట్టిగా వస్తున్నాయి. కులగణనతో రాజకీయ ప్రయోజనం కలగొచ్చు. కానీ కులదృష్టి పెరిగిపోతే అంబేడ్కర్ హెచ్చరించినట్లు ఆ పునాదిపై స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వాల ప్రాతిపదికన జాతిని (నేషన్) ఎన్నటికీ నిర్మించలేం. ఇప్పటికే అంబేడ్కర్ ఆశించిన కులనిర్మూలనలూ కులరహితాలూ రాజకీయ రంగాన అప్రాధాన్యతలైపోయి అంతటా కులసహితాలూ, కులసమ్మోహనాలూ, కులసమ్మేళనాలూ ఉరకలేస్తున్నాయి. ఆ ఉరకల ఉధృతికి ప్రజాస్వామ్య విలువలే పలచనై పోతున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

> **కులాల లెక్కలు జిల్లాల స్థాయిల్లో లభ్యమైన తర్వాత తలెత్తే రాజకీయ పెనుగులాటలు ఏ విధంగా ఉంటాయో స్పష్టంగా ఇప్పటికిప్పుడు అంచనా వేయలేకపోయినా కులదృక్పథాలను అవి విపరీతంగా పెంచుతాయి. ఇక ప్రతి పదేళ్లకూ కులలెక్కలు తీయటం సర్వసాధారణమైతే తలెత్తే పరిస్థితి మన ఆలోచనలను మరింతగా కులమయం చేస్తుంది.**

> **కులగణనతో రాజకీయ ప్రయోజనం కలగొచ్చు. కానీ కులదృష్టి పెరిగిపోతే అంబేడ్కర్ హెచ్చరించినట్లు ఆ పునాదిపై స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సమానత్వాల ప్రాతిపదికన జాతిని (నేషన్) ఎన్నటికీ నిర్మించలేం. ఇప్పటికే అంబేడ్కర్ ఆశించిన కులనిర్మూలనలూ కులరహితాలూ రాజకీయ రంగాన అప్రాధాన్యతలైపోయి అంతటా కులసహితాలూ, కులసమ్మోహనాలూ, కులసమ్మేళనాలూ ఉరకలేస్తున్నాయి. ఆ ఉరకల ఉధృతికి ప్రజాస్వామ్య విలువలే పలచనైపోతున్నాయి.**

మనకు ప్రపంచస్థాయి గ్రంథాలయం అవసరం

మనకు స్వాతంత్ర్యం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు కావొస్తున్నా ఇంత వరకూ తెలుగు భాషా సాహిత్యాల పరిరక్షణకు అవసరమైన ఒక ప్రపంచ స్థాయి గ్రంథాలయాన్ని స్థాపించుకోలేకపోయాం. ఉస్మానియా విశ్వవిద్యా లయంలో 'జ్ఞానసౌధ' పేరిట 'తెలంగాణ ప్రజా గ్రంథాలయం' (తెప్రగ్రం) నిర్మించుకోవాల్సిన అవసరముంది. అప్పటి వరకూ 'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం' నాంపల్లి ప్రాంగణాన్ని ఈ గ్రంథాలయానికి అంకితం చేస్తే తెలుగు భాషా సాహిత్యాలకు ఎంతో మేలు జరుగుతుంది.

తెప్రగ్రం ముఖ్య ఉద్దేశ్యాలు మూడు: 1) తెలుగులో ఇప్పటివరకూ ప్రచురితమైన ప్రతి తెలుగు పుస్తకం, పత్రికను సేకరించి భద్రపరచటం, దానిని సదా అందరికీ అందుబాటులో ఉంచటం. 2) పాఠకుడు ఏ తెలుగు పుస్తకం, పత్రిక అడిగినా దానిని 30 నిమిషాల్లోపు అందించటం. ఒకవేళ తెప్రగ్రంలో అది లేకపోతే, ఎక్కడ లభ్యమవు తుందో తెలియజేయటం. 3) తెప్రగ్రం నిక్షేప (డిపాజిటరీ) గ్రంథాలయంగా పనిచేస్తూ, తెలుగు సహా ఇతర భాషలలో ప్రచురితమైన గ్రంథాలను సేకరించి, అవసరమైన ఇతర గ్రంథాలయాలకు చేర్చడం.



ఈ తెప్రగ్రం కనీసం పది అంతస్తుల హరిత భవనంలో ఉండాలి. అందులో ముఖ్యంగా పౌర గ్రంథాలయాల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్; తెలుగు పుస్తకాల ప్రపంచ నిక్షేపణస్థానం (డిపాజి టరీ); తెలుగు పత్రికల, వార్తా పత్రికల ప్రపంచ నిక్షేపణస్థానం, పరిశోధక విద్యార్థుల సమావేశ ప్రదేశం, తెలంగాణ అమర వీరుల స్మృతి పఠనాలయం, సమావేశ మందిరం వంటివి ఉండాలి. తెప్రగ్రం ప్రాజెక్ట్ ప్రణాళిక తయారీకి గ్రంథాలయ సమాచార శాస్త్ర, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నిపుణులు, సాహితీవే త్తలు మొదలైన వారితో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేయాలి.

తొలి, మలి తెలంగాణ ఉద్యమాలకు సంబంధించిన చారిత్రక మూలా ధారాలను భద్రపరచాలి. ఎటువంటి రాజకీయ పార్టీల ప్రమేయం, ఒత్తిడి, పక్షపాతం లేకుండా సాక్ష్యాధారిత పండిత తెలంగాణ చరిత్ర రాయడానికి తెప్రగ్రం ప్రథమ వనరుగా సేవలందించాలి. ఆచార్య జయశంకర్, గద్దర్, అందెశ్రీ వంటి ఉద్యమకారుల ముద్రిత, అముద్రిత రచనలు, రాతప్రతులు వంటి వాటిని కూడా తెప్రగ్రం ద్వారా మనం సంరక్షించుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం తెప్రగ్రం స్థాపనకు ఆదాయపన్ను రాయితీతో 'సీఎం జ్ఞాన నిధి'ని ఏర్పాటు చేయాలి.

జీహెచ్ఎంసీ 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,038.42 కోట్లు ఆస్తి పన్ను రూపేణా సేకరించింది. చట్ట ప్రకారం దీనిలో 8 శాతం, అంటే రూ.163 కోట్లు, లైబ్రరీ సెస్‌గా ప్రజలు చెల్లించారు. ఈ నిధులను తెప్రగ్రం స్థాపనలో ప్రారంభ పనులకు ఉపయోగించుకోవచ్చు. కొన్ని దశాబ్దాలుగా అన్ని ప్రభుత్వాలూ రూ. వేల కోట్ల లైబ్రరీ సెస్ నిధులను గ్రంథాలయాలకు బదిలీ చేయడం లేదు. మన పౌర గ్రంథాలయ వ్యవస్థ పతనానికి ఇది కూడా ఒక ముఖ్య కారణం. అందుకే ఆ నిధులను గ్రంథాలయాల అభివృద్ధికే కేటాయించాలి. అప్పుడే తెలంగాణ ప్రజల సాహితీ సాంస్కృతిక స్మృతిగా తెప్రగ్రం భాసించగలదు.

– ఆచార్య సర్గు సుదర్శన్‌రావు
గ్రంథాలయ సమాచారశాస్త్ర పూర్వ ఆచార్యులు, ఓయూ

టి.వి. ప్రఫుల్ల చంద్ర
పూర్వ ప్రొఫెషనల్ అసిస్టెంట్, ఇఫ్లూ

రాష్ట్రం తెలిసిన గవర్నర్లు రావాలి!

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా ఇప్పటివరకు ఈ రాష్ట్రానికి గవర్నర్‌గా తెలంగాణ వాస్తవ్యులు నియమితులు కాకపోవటం విచారకరం. చట్టసభల నిర్ణయాలకు అవరోధాలు ఏర్పడటానికి ఇదే ప్రధాన కారణం. బిల్లుల ఆమోదం, అత్యవసర పరిస్థితులు, మంత్రివర్గ నియామకాల్లో గవర్నర్ కీలక పాత్ర పోషిస్తారు. అందుకే ఈ పదవిని నిర్వహించేవారు రాష్ట్ర స్థానిక సందర్భాలపై అవగాహన ఉన్నవారై ఉండాలి.

బాహ్య ప్రాంతాల నుండి గవర్నర్లుగా వచ్చినవారికి ఇక్కడి సామాజిక వాస్తవాల పట్ల అవగాహన ఉండటం లేదు. తెలంగాణ ప్రాంత చరిత్ర గురించి – అంటే ఇక్కడి వలస పాలన, చేతి వృత్తులు, వ్యవసాయరంగం, ఫ్యూడల్ వ్యవస్థ, విద్యా వెనుకబాటు, కుల ఆధారిత వివక్ష... వీటి గురించి – బయటి నాయకులకు పూర్తిగా తెలియదు. తెలంగాణ సాంస్కృతిక ప్రత్యేకతలు వారికి అర్థం కావు. ఈ అర్థం కాకపోవటం అనేది విధానాల పరిశీలనలో లోపాలకు దారితీస్తుంది. చట్టసభ నిర్ణయాలకు అనవసరమైన అడ్డంకులను సృష్టిస్తుంది.

2018లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) 42శాతం బీసీ బిల్‌ను గవర్నర్ తమిళిసై సుదీర్ఘంగా పెండింగులో పెట్టారు. 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పంపగా, ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం ఇవ్వకుండా రాష్ట్రపతికి పంపారు. ఈ బిల్లు ఆమోదం పొందకపోవడంతో స్థానిక సంస్థల వ్యవస్థలు ధ్వంసం అవుతున్నాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్రలో స్థానిక నేపథ్యం గలవారు గవర్నర్లుగా ఉన్నప్పుడు ఇలాంటి బిల్లులు వేగంగా క్లియర్ అయ్యాయి.

ఉత్తర భారతదేశానికి చెందినవారు గవర్నర్లుగా వచ్చినప్పుడు వారు తెలుగు భాషలో అసెంబ్లీ ప్రసంగాలు చదవడానికి ఇబ్బంది పడిన సందర్భాలు ఉన్నాయి. స్థానిక యాస తెలియని గవర్నర్‌కు తెలంగాణ గెజిట్ నోటిఫికేషన్లు, ప్రజా ఫిర్యాదులు అర్థమవుతాయా? గవర్నర్లు ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం ఇవ్వడం, ప్రాంతీయ భావజాలాన్ని, సామాజిక కుల వ్యవస్థ లక్షణాలను అర్థం చేసుకోవడం అవసరం. వారు ఇవి అర్థం చేసుకుని చట్టసభ నిర్ణయాలకు గౌరవం ఇచ్చినప్పుడే రాజ్యాంగ వ్యవస్థ సాఫీగా నడుస్తుంది.

తెలంగాణ రాష్ట్రానికి తెలంగాణకు చెందినవారే గవర్నర్లుగా వచ్చినప్పుడు– తెలంగాణ చరిత్ర, సమాజం, ఆర్థిక వెనుకబాటుతనం గురించి వారికి లోతైన అవగాహన ఉంటుంది. బీసీ ఉపకులాల మధ్య రిజర్వేషన్ పంపకం వంటి రాజకీయ సంక్లిష్టతలు వారికి అర్థమవుతాయి. బిల్లులు త్వరగా క్లియర్ అవుతాయి. కేంద్ర–రాష్ట్ర సంబంధాల్లో అనవసరమైన ఘర్షణ తగ్గుతుంది. గవర్నర్‌లను నియమించేవారు ఏ పార్టీ అన్నది సమస్య కాదు. రాజ్యాంగం పట్ల, తెలంగాణ ప్రజల సమస్యల పట్ల, ఇక్కడి భాషా భావజాలం పట్ల అవగాహన ఉన్న విద్యావేత్త అయినా, ఉన్నత స్థాయి పరిపాలన అనుభవం ఉన్న సేవాధికారి ఐనా, లేదా తెలంగాణ సామాజిక ఉద్యమాల దార్శనిక నాయకుడు ఐనా.. ఇలాంటివారి నుంచి గవర్నర్లు రావటం వల్ల ఈ పదవి పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుంది.

– పాపని నాగరాజు

అవినీతి జాడ్యం వదిలేదెన్నడో!

ఈ రోజుల్లో అవినీతి అనే మాట మనకు పత్రికల్లో, టీవీ వార్తల్లో, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా కనిపిస్తోంది, వినిపిస్తోంది. కానీ దురదృష్ట మేమిటంటే, చాలామంది ప్రజలు దీన్ని పెద్ద సమస్యగా చూడటం లేదు! 'ఇది మన సమాజంలో సాధారణమైన విషయం' అని భావిస్తున్నారు. అవినీతి అంటే.. 'ఎవరికైనా అప్పగించిన అధికారాన్ని లేదా బాధ్యతను తమ సొంత లాభం కోసం వాడుకోవడం.' ఇది న్యాయం, సమానత్వం, విశ్వాసం వంటి విలువలను నాశనం చేస్తుంది. ఇది కేవలం డబ్బు తీసుకోవడం మాత్రమే కాదు, బంధుప్రీతి ఆధారంగా పనిచేయించడం లేదా నిబంధనలను తారుమారు చేయడం కూడా అవినీతికి ప్రతిరూపాలే. ఏదైనా వృత్తిలో అనైతికంగా వ్యవహ రించడం కూడా ఒక రకమైన అవినీతే.

అవినీతి ఎన్నో రూపాల్లో ఉంటుంది. అందులో ముఖ్యమైనవి: లంచం– పని సులభంగా చేయించుకోవడానికి డబ్బు ఇవ్వడం; దుర్వినియోగం– ప్రభుత్వ నిధులను తమ వ్యక్తిగత పనులకు మళ్లించడం; మోసం– తప్పుడు బిల్లులు, తప్పుడు రికార్డులు చూపించి లాభం పొందడం; దోపిడీ– అధికారం వాడుకుని భయపెట్టి డబ్బు దోచుకోవడం; నెపోటిజం, క్రోనిజం– అర్హుల కంటే తమవారికి ఉద్యోగాలు, కాంట్రాక్టులు ఇవ్వడం; రాజకీయ అవినీతి– ప్రజా వనరులను పార్టీ ప్రయోజనాల కోసం వాడుకోవడం; స్పీడ్ మనీ– సాధారణ సేవలు త్వరగా చేయించుకోవడానికి ఇచ్చే చిన్న లంచాలు; స్టేట్ క్యాప్చర్– పెద్ద వ్యాపారులు, రాజకీయ నాయకులు కలిసి ప్రభుత్వ విధానాలను తమకు అనుకూలంగా మలచుకోవడం; ప్రొక్యూర్‌మెంట్ అవినీతి– టెండర్లు, కాంట్రాక్టులు తమవారికి ఇచ్చే విధంగా సర్దుబాటు చేయడం.

అవినీతి మూడు స్థాయిల్లో కనిపిస్తుంది: చిన్న అవినీతి (రోజువారీ లంచాలు), పెద్ద అవినీతి (కోట్ల రూపాయల మోసాలు), వ్యవస్థాగత అవినీతి (సమాజం మొత్తం అవినీతి పద్ధతిలో పనిచేయడం)! ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అవినీతి ఇప్పుడు ప్రజల చర్చలో ముఖ్యాంశం. చిన్న లంచాల నుంచి కోట్ల రూపాయల కుంభకోణాల వరకూ జరిగిన అవినీతితో రెండు రాష్ట్రాలూ అనేక రకాలుగా నష్టపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో రవాణా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లో 'స్పీడ్ మనీ' సాధారణమైంది. ఏసీబీ తరచూ దాడులు చేస్తోంది, కానీ పెద్దగా మార్పు కనిపించడం లేదు. తెలంగాణలో ఇంజనీర్లు, మునిసిపల్ అధి కారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కోట్ల రూపాయల విలువైన అక్రమ ఆస్తులతో పట్టుబడుతున్నారు. కానీ కేసులు కోర్టుల్లో సంవత్సరాల తరబడి ఉండిపోతు న్నాయి. శిక్షలు మాత్రం అరుదుగా పడుతున్నాయి.

ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భారీగా అవినీతి కేసులు బయటపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో: గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్ కోట్ల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అవేగాక– అసలు మద్యం, కల్తీ మద్యం, తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదంలో వాడిన నెయ్యి... లాంటి ఎన్నో విషయాల్లో అవినీతి ఆరోపణలు, వివిధ దర్యాప్తులు వంటి వార్తలు రోజూ చదువుతూనే ఉన్నాం. తెలంగాణలో: గొర్రెల పంపిణీ పథకంలో, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆ ప్రాజెక్టులో పని చేసిన ఇద్దరు సీనియర్ ఇంజనీర్లు తమ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని ఏసీబీ కూడా తేల్చింది.


'ఏసీబీ తరచుగా దాడులు చేసినా అవినీతి ఎందుకు తగ్గడం లేదు?' దీనికి ప్రధాన కారణాలు అయిదు: రాజకీయ జోక్యం– ఏసీబీ స్వతంత్రంగా పనిచేయలేకపోవడం; చట్టపరమైన లోపాలు– నోటిఫికేషన్‌లు సరిగ్గా లేక కేసులు రద్దు కావడం; శిక్షణ లోపం– సాంకేతిక, ఆర్థిక విచారణలపై అవగాహన లేక ఆధారాలు బల హీనపడడం; పరస్పర మైత్రి– కాంట్రాక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకులు కలిసి వ్యవస్థగా పనిచేయడం; టెక్నాలజీ దుర్వినియోగం– 'సర్వర్ డౌన్' అని చెబుతూ డిజిటల్ సేవల్లో కొత్త రకాల లంచాలు వసూలు చేయడం. ఇది కేవలం చట్టపరమైన లోపం మాత్రమే కాదు, రాజకీయ–ఆర్థిక వ్యవస్థలో లోపం కూడా. చిన్న లంచాలను కూడా సాధారణంగా చూడడం ఇప్పుడు సంస్కృతిలో భాగమైంది. 'ఇలా లేకపోతే పని జరగదు' అన్న భావన బలపడింది. అవినీతిని తగ్గించాలంటే మాటలతో కాదు, సంస్థాగత మార్పులు చేయడం అవసరం. అందుకు ముఖ్యంగా చేయాల్సినవి: ఏసీబీకి స్వతంత్రత– స్వతంత్ర బడ్జెట్, నియామకాలు; చట్టాన్ని బలపరచడం– అన్ని ఏసీబీ కార్యాలయాలను పోలీస్ స్టేషన్‌లుగా ప్రకటించడం, ప్రత్యేక కోర్టుల ఏర్పాటు; ఆస్తుల వెల్లడి– ఉన్నతాధి కారులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించడం; పారదర్శక టెక్నాలజీ– ప్రాజెక్టు వివరాలు ఆన్‌లైన్‌లో ప్రజలకందుబాటులో ఉంచడం; దోచుకున్న ఆస్తుల స్వాధీనం– లంచం కేసుల్లో కేవలం అరెస్టులు కాకుండా ఆస్తులు తిరిగి ప్రభుత్వానికి ఇప్పించడం.

అవినీతి నిరోధక సంస్థలను రాజకీయ ప్రభావం నుంచి ప్రభుత్వం బయటకు తేవాలి. విజిల్ బ్లోవర్ల రక్షణ, ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలు, ఆర్టీఐ ద్వారా సమా చారం విడుదల తప్పనిసరిగా ఉండాలి. ప్రజలూ మారాలి. లంచాలు ఇవ్వకుండా అధికారులను నిలదీయాలి. డిజిటల్ రసీదులు తీసుకోవాలి. ఫిర్యాదు చేయడానికి భయపడకూడదు. మీడియా, సామాజిక సంస్థలు అవినీతి కేసులను బహిర్గతం చేయాలి. ప్రతి అవినీతి కేసూ సామాన్య ప్రజల విశ్వాసానికి గాయమే అని గుర్తుపెట్టుకోవాలి. ఏసీబీని రాజకీయ ఆయుధం కాకుండా ప్రజల రక్షకసంస్థగా మార్చడం ప్రభుత్వం చేతుల్లోనే ఉంది. చట్టం అందరికీ సమానంగా పనిచేసే రోజు వచ్చినప్పుడు మాత్రమే, అవినీతి జాడ్యం తగ్గుతుంది. 'మితిమీరిన ప్రజాస్వామ్యం కూడా ఒక రకంగా ఈ అవినీతి మహమ్మారి వృద్ధికి దోహదం చేస్తున్నది' అనే భావన కూడా ఉంది. మన దేశం, రాష్ట్రాల పురోభివృద్ధి గురించి సామాన్య ప్రజలు కంటున్న కలలు ఎండమావులు కాకూడదంటే అవినీతిని కూకటి వేళ్లతో పీకివేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

■ ప్రొ. అప్పారావు పొదిలె
పూర్వ ఉపకులపతి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం

> **అవినీతి నిరోధక సంస్థలను రాజకీయ ప్రభావం నుంచి ప్రభుత్వం బయటకు తేవాలి. విజిల్ బ్లోవర్ల రక్షణ, ఆన్‌లైన్ ఫిర్యాదు వ్యవస్థలు, ఆర్టీఐ ద్వారా సమాచారం విడుదల తప్పనిసరిగా ఉండాలి. ప్రజలూ మారాలి. లంచాలు ఇవ్వకుండా అధికారులను నిలదీయాలి. డిజిటల్ రసీదులు తీసుకోవాలి. ఫిర్యాదు చేయడానికి భయపడకూడదు.**



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
మంగళవారం 25 నవంబరు 2025


4, 5, 6 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులకు డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌ను నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో ఎ.వెంకట్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో నిర్వహించే సైన్స్ ఫెయిర్ హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలలు సంసిద్ధం కావాలని కోరారు.


హసన్‌పర్తిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు తీసుకున్న దుర్గాభవానితో ఎమ్మెల్యే నాగరాజు, ఎక్సైజ్ ఉన్నతాధికారులు

హసన్‌పర్తిలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్

- ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యమని స్పష్టం

హసన్‌పర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలో నూతన ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ప్రారంభమైంది. సంస్కృతి విహార్ టీటీడీసీ ఆవరణలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన దుర్గాభవానికి ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోకి హసన్‌పర్తి మండలంలోని వంగపహాడ్, సిద్ధాపూర్, భైరాన్‌పల్లి, హరిశ్చంద్రనాయక్ తండా, అర్వపల్లి, సూదన్‌పల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాలతోపాటు పెగడపల్లి, కేయూ మొదటిగేట్ ప్రాంతం, గ్రేటర్‌లోని 4వ డివిజన్ నుంచి 10వరకు, 49 డివిజన్‌లోని జులైవాడ, 50, 54వ డివిజన్లతో పాటు కమలాపూర్ మండలం వస్తుందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో గల వైన్‌షాపులు, బార్ షాపులలో అక్రమ మద్యం విక్రయాలతో పాటు ప్రభుత్వ అనుమతులు లేని మద్యం అమ్మకాల నిరోధానికి అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ వరంగల్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, ఎక్సైజ్ డీపీవో వరంగల్ అర్బన్ చంద్రశేఖర్, ఎస్సై వెంకన్న, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రామనర్సింహారెడ్డి, ఆత్మకూరు వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, పోరెడ్డి మహేందర్‌రెడ్డి ఆరెల్లి వెంకటస్వామి పాల్గొన్నారు.

రాజయ్య గోకుడు, గీకుడు నిజమే..

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య గోకింది.. గీకింది వాస్తవమేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తాను అబద్ధాలు మాట్లాడనని, ఆయన గోకుడు, గీకుడుపై మీడియాలో వచ్చిన కథనాలు అందరికీ తెలిసిందేనని అన్నారు. కాజీపేటలో సోమవారం మీడియాతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. తనకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అంటే గౌరవమని, రైట్ పర్సన్ రాంగ్ పార్టీలో ఉన్నారని చెప్పానన్నారు. తాను చేసిన ఆరోపణలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానన్నారు. తనపై ప్రెస్‌మీట్‌లు పెట్టి తిడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. తనను అనవసరంగా గెలికితే అందరి బండారాలు బయట పెట్టేస్తానన్నారు. 'నన్ను తిడితే తప్పులేదు. కానీ నేను తిడితే తప్పా.' అని అన్నారు. దళితులు పునరాలోచించాలని కోరారు.



- సర్పంచ్ స్థానాల్లో 94, వార్డుల్లో 871 రిజర్వు
- జనరల్ స్థానాల్లోనూ పోటీకి అవకాశం
- విడుదలైన పంచాయతీ రిజర్వేషన్ల జాబితా
- అధికారికంగా గెజిట్‌లో ప్రకటన
- గ్రామాల్లో పెరిగిన ఎన్నికల సందడి
- సర్పంచ్ అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యేల బిజీ

అతివలదే హవా

సర్పంచ్ స్థానాల్లో అత్యధికం వారికే రిజర్వు

హనుమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో అతివలకే అందలం దక్కింది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల్లో వారికి రిజర్వు అయిన స్థానాలే ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 210 సర్పంచ్ స్థానాల్లో మహిళలకు 94 రిజర్వు కాగా, మొత్తం 1,986 వార్డు స్థానాల్లో 871 రిజర్వు అయ్యాయి. ఇవి కాగా మహిళలు, పురుషులకు కలిపి రిజర్వు చేసిన జనరల్ స్థానాల్లో సైతం వారు పోటీ చేసే అవకాశం ఉన్నందువల్ల ఇందులో గెలిస్తే వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

గత పర్యాయం జిల్లాలో అత్యధిక సంఖ్యలో సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులతో సహా చైర్‌పర్సన్ వరకు మహిళల శాతమే అధికంగా ఉండగా ఈసారి ఆదే రీతిలో అవకాశాలను ఆశిస్తున్నారు. జిల్లాలో ఓటర్ల సంఖ్యాపరంగా మహిళలే అధికంగా ఉండగా పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు.

వార్డు సభ్యుల రిజర్వేషన్లు

జిల్లాలో మొత్తం 210 గ్రామ పంచాయతీలు, 1,986 వార్డు స్థానాలు ఉన్నాయి. వార్డు సభ్యుల రిజర్వేషన్లలో 100 శాతం ఎస్టీ జనాబా ఉన్న గ్రామ పంచాయతీల్లో మహిళలకు 19, మహిళలు, పురుషులకు 19 వార్డు స్థానాలను రిజర్వు చేశారు. ఎస్టీలలలో మహిళలకు 10, మహిళలు, పురుషులకు 23, ఎస్సీలలో మహిళలకు 182, మహిళలు, పురుషులకు 253 స్థానాలు, బీసీలలో మహిళలకు 212, మహిళలు, పురుషులకు 286, అన్ రిజర్వుడు స్థానాల్లో మహిళలకు 448, మహిళలు, పురుషులకు 534 వార్డులు రిజర్వు అయ్యాయి.

స్వశక్తి సంఘాల కీలక పాత్ర

అన్నిగ్రామాల్లో పదివేలకు పైగా స్వశక్తి సంఘాలు, వీటిలో

(మిగతా 8లో)

విడుదలైన రిజర్వేషన్ల జాబితా

సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఖరారైన రిజర్వేషన్ల జాబితాను సోమవారం అధికారికంగా కలెక్టర్ స్నేహ శబరీష్ విడుదల చేశారు. రెండు రోజులుగా సాగిన రిజర్వేషన్ల ప్రక్రియ ఆదివారం రాత్రి ముగిసిన తర్వాత తుది జాబితాను కలెక్టర్ పరిశీలించి పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపారు. ఆమోదం అనంతరం సోమవారం కలెక్టర్ గెజిట్‌లో ప్రకటించారు. జిల్లాలో 210 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. హనుమకొండ జిల్లాలో షెడ్యూల్ ఏరియా లేదు కనుక ఈ కేటగిరిలో ఎలాంటి రిజర్వేషన్లు లేవు. 100 శాతం ఎస్టీ జనాభా కలిగిన గ్రామపంచాయతీలు 5 ఉండడంతో ఇందులో రెండింటినీ మహిళలకు, మిగతా మూడింటిని మహిళలు, పురుషులకు రిజర్వు చేశారు. ఎస్టీ జనాభా అధికంగా ఉన్న గ్రామ పంచాయతీలు 3 ఉండగా, ఇందులో మహిళలకు 1, మహిళలు, పురుషులకు 2 రిజర్వు చేశారు. ఎస్సీలకు మొత్తం 52 పంచాయతీలు రిజర్వు కాగా, ఇందులో మహిళలకు 23, మహిళలు, పురుషులకు 29 రిజర్వు అయ్యాయి. కాగా, బీసీలకు 45 పంచాయతీలు రిజర్వు కాగా, ఇందులో మహిళలకు 19, మహిళలు, పురుషులకు 26 రిజర్వు అయ్యాయి. 105 అన్ రిజర్వుడు (జనరల్) పంచాయతీల్లో 49 మహిళలకు, మహిళలు, పురుషులకు కలిపి 56 రిజర్వు అయ్యాయి.

సర్పంచ్‌ల రిజర్వేషన్ వివరాలు

మండలం	జీపీలు	ఎస్టీ జీపీలు		ఎస్టీ		ఎస్సీ		బీసీ		అ.రి.	
		మ	జ	మ	జ	మ	జ	మ	జ	మ	జ
ఆత్మకూరు	16	0	0	0	0	2	2	2	2	4	4
భీమదేవరపల్లి	25	0	0	1	1	2	3	2	3	6	7
దామెర	14	0	0	0	0	2	2	1	2	3	4
ధర్మసాగర్	19	0	0	0	0	2	3	2	2	5	5
ఎల్కతుర్తి	20	0	0	0	0	3	3	2	2	5	5
హసన్‌పర్తి	15	0	0	0	1	2	2	1	2	3	4
ఐనవోలు	17	0	0	0	0	2	3	1	2	4	5
కమలాపూర్	24	0	0	0	0	2	3	3	4	6	6
నడికుడ	14	0	0	0	0	2	2	1	2	2	4
పరకాల	10	0	0	0	0	1	2	1	1	2	3
శాయంపేట	24	1	0	0	0	1	2	1	1	2	3
వేలేరు	12	1	2	0	0	1	1	1	1	2	3
మొత్తం	**210**	**2**	**3**	**1**	**2**	**23**	**29**	**19**	**26**	**49**	**56**

మ = మహిళలు జ = జనరల్ అ.రి.- అన్ రిజర్వుడు


దుర్గాప్రసాద్ (ఫైల్)

సీటు బెల్ట్ తెరుచుకోక..

- కారులో మంటలు చెలరేగి వ్యక్తి సజీవ దహనం
- మృతుడు జయగిరి వాసి
- శామిర్‌పేట్ ఓఆర్‌ఆర్‌పై ఘటన

6


మంటల్లో కాలుతున్న కారు

మిల్లర్ల దోపిడీ

- తేమ పేరుతో ధాన్యం కోత
- క్వింటాల్‌కు 5 కిలోల వరకు తగ్గింపు లెక్కలు
- అన్యాయానికి గురవుతున్న రైతులు
- పట్టింపేలేని పౌర సరఫరాల శాఖ అధికారులు
- ధాన్యం సరఫరాకు ట్రాన్స్‌పోర్టు కరువు
- రెండు విధాలా రైతన్న నెత్తిన భారం

హనుమకొండ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మిల్లర్లు తేమ పేరుతో రైతన్న కష్టాన్ని దిగమింగుతున్నారు. క్వింటాల్‌కు 3 నుంచి 5కిలోల వరకు ధాన్యాన్ని తక్కువగా చూపుతున్నారు. కొనుగోలు కేంద్రంలో క్వింటా తూకం పడిందంటూ ఆధారాలు చూపినా.. మిల్లర్లు మాత్రం అదంతా తమకు తెలియదంటున్నారు. తేమను సాకుగా చూపి బస్తాకు 5కిలోల కోత పెట్టి దగా చేస్తున్నారు. మిల్లుకు ధాన్యం తరలగా చేసేదేమీ లేక రైతులు ఆవేదనతో అంగీకరిస్తున్నారు.ఈ బాగోతం జిల్లా ఉన్నతాధికారులు, పౌర సరఫరాల శాఖ దృష్టికి వెళ్లినా మిన్నకుంటున్నారు. మిల్లర్లకు వత్తాసు పలుకుతూ దోపిడీకి పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్రాల్లో తూకం సరి.. మిల్లర్లు మాత్రం ససేమిరా..

రైతుల నుంచి ధాన్యం సేకరణ నిమిత్తం ప్రభుత్వం డీఆర్‌డీవో ఆధ్వర్యంలోని ఐకేపీతో పాటు పీఏసీఎస్‌లతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యం విక్రయ నిమిత్తం రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో బస్తా తూకం క్వింటాల్‌గా ఉందనే లెక్కలు వేస్తున్నారు. ప్రభుత్వం కొంతమేర సడలించిన నిబంధనల మేరకు రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కేంద్రాలకు తరలించడం, తేమ లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో క్వింటా లెక్క పక్కాగా లెక్కిస్తున్నారు. ఇక్కడి వరకు రైతుల్లో



ఆనందం నెలకొంది. అయితే కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు చేరాక మాత్రం మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. తేమ ఉందంటూ రైతులకు తెగేసి చెప్పడంతో రైతులు అవాక్కవుతున్నారు. చేసేది లేక రైతులు 5 కిలోల తగ్గింపును అంగీకరిస్తున్నారు. ఇలా మిల్లర్లు బస్తాకు 3 నుంచి 5 కిలోల వరకు ధాన్యం లెక్కను తగ్గించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టింపేలేని పౌర సరఫరాల శాఖ

జిల్లా ఉన్నతాధికారులు, పౌర సరఫరాల శాఖ మిల్లర్ల దోపిడీ తతంగాన్ని పట్టించుకోవడం లేదు. కొంత మంది రైతులు దోపిడీ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తేమ ఉంటే మిల్లర్లు ఎలా తీసుకుంటారనే ప్రశ్నలు వేస్తుండడంతో రైతులు విస్తుపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అభ్యంతరాలు ఏమీ పెట్టలేదని రైతులు చెప్పినా.. అధికారులు మాత్రం చూస్తామంటూ దాట వేస్తున్నారు. చేసేదేమీ లేక రైతులు దగా పడుతున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి చేతులు దులుపేసుకుంటున్నారు. ఇక కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాల తరలింపు ట్రాన్స్‌పోర్టు విషయంలో కూడా రైతుల నుంచి వక్రమార్గంలో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో ధాన్యంలో కోత, ట్రాన్స్‌పోర్టు భారాన్ని కూడా రైతుల అన్యాయంగా భరించాల్సి వస్తుందనే విమర్శలు పెల్లుబికుతున్నాయి.

కొనుగోలు కేంద్రాల్లో అరకొర వసతులే..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కూడా అరకొరగానే ఉండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్రాల్లో తాగునీరు సౌకర్యమే కరువైన పరిస్థితి. ఇక కేంద్రాలను ప్రారంభించిన అధికారులు టార్పాలిన్లు కూడా సరిపడా తరలించలేదు. గన్నీ బ్యాగులు భద్రపరిచే పరిస్థితులు కరువయ్యాయి. ఇటీవలే కొద్ది రోజులుగా మళ్లీ వర్షాలు, తుఫాన్ ఉందంటూవాతావరణ శాఖ ప్రకటనలతో రైతులు బెంబేలెత్తుతున్నారు.

తిరుగు టపా



- డైట్, సీటీఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతల నుంచి అబ్దుల్ హై తొలగింపు
- ఒరిజినల్ స్థానమైన ఆదిలాబాద్‌కు తిరిగి బదిలీ
- కొన్నాళ్లుగా వెంటాడుతున్న పలు అవినీతి ఆరోపణలు
- ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన డీఎస్ఈ నవీన్ నికోలస్

హనుమకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ డైట్, సీటీఈ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అబ్దుల్ హైకి ఎట్టకేలకు స్థాన చలనం కలిగింది. ఆయన ఒరిజినల్ పోస్టు అయిన అదిలాబాద్ డైట్ లెక్చరర్‌గా బదిలీ అయ్యారు. అబ్దుల్ హై స్థానంలో పాఠశాలవిద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) కె.సత్యనారాయణ రెడ్డి పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. పాఠశాల విద్య డైరెక్టర్ (డీఎస్ఈ) నవీన్ నికోలస్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదిలాబాద్ డైట్‌లో లెక్చరర్ అయిన అబ్దుల్ హై డిప్యుటేషన్‌పై ఇక్కడి వచ్చారు. సుదీర్ఘ కాలంగా ఇక్కడే వివిధ హోదాల్లో పని చేశారు. హనుమకొండ జిల్లాతో పాటు భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించారు. హనుమకొండ డీఈవోగా ఉన్నప్పుడే డైట్‌కు బదిలీ అయ్యారు. ఆయనపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా స్థాన చలనం కలిగించినట్లు తెలుస్తోంది. సీటీఈలో ఇతర ప్రాంతాల్లో పని చేస్తున్న అధ్యాపకులను డిప్యుటేషన్‌పై తీసుకోవలసిన అవసరం లేకున్నా తమకు అనుకూలమైన వారికి రెడ్‌కార్పెట్ వేసి మరీ స్వాగతం పలికినట్లు పలు అధ్యాపక సంఘాలు ఉన్నతాధికారులకు (మిగతా 6వ పేజీలో)

పోటెత్తిన వరి ధాన్యం

కేసముద్రం మార్కెట్‌కు 13వేల బస్తాలు రాక

కేసముద్రం, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేస ముద్రం వ్యవసాయ మార్కెట్‌కు రికార్డు స్థాయిలో సోమవారం 13,607 బస్తాల ధాన్యాన్ని రైతులు విక్రయించేందుకు తీసుకువచ్చారు. మార్కెట్లో ఈ ధాన్యం సీజన్ ఆరంభమైన 15రోజుల్లో ఇదే అత్యధిక రాబడులు కావడం విశేషం. క్రితం రోజు శుక్రవారం మార్కెట్‌కు 6,598 బస్తాల ధాన్యం రాగా తాజాగా అంతకు రెట్టింపుగా 13,607 బస్తాల రాబడులు పెరిగాయి. మార్కెట్లోని మూడు కవర్‌షె డ్లు పూర్తిగా వడ్ల కుప్పలతో నిండి కార్యాలయం వెనుక, ముందు ప్రాంతంలోని ఓపెన్ యార్డు కూడా ధాన్యం రాశులతో కళకళలాడింది. మార్కెట్‌కు వచ్చిన సరుకులో జైశ్రీరాం రకం ధాన్యం 40మంది రైతులు 1630 బస్తాలు, ఆర్ఎన్ఆర్ రకం 196 మంది 9292 బస్తాలు, హెచ్ఎంటీ రకం ధాన్యాన్ని 72 మంది 2684 బస్తాలు విక్రయించేందుకు తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో జైశ్రీరాం రకం క్వింటాకు గరిష్ఠంగా రూ.2885, కనిష్ఠంగా రూ.2321,సగటున రూ.2829, ఆర్ఎన్ఆర్ రకం గరిష్ఠంగా రూ.2789, కనిష్ఠంగా రూ.2222, సగటున రూ.2545, హెచ్ఎంటీ రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.2579,కనిష్ఠంగా రూ.2289, సగటున రూ.2545 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. శుక్రవారంనాటి మార్కెట్‌లో ఆర్ఎన్ఆర్ సగటు ధర రూ.2589 ఉండగా తాజాగా సప్లై పెరగడంతో క్వింటాకు రూ.50ల చొప్పున తగ్గి రూ.2545కు చేరింది.


కేసముద్రం మార్కెట్‌లో సోమవారం కనిపించిన ధాన్యం రాశులు

లేడు.. రాడనుకున్నారు!

- 27 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన పోలెపాక సునిల్
- ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయాడని చెప్పిన పోలీసులు
- వారం రోజుల్లో ఇంటికి చేరుస్తామని వెల్లడి
- ఆనందంలో కుటుంబసభ్యులు, బంధువులు

ఖిలావరంగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇరవై ఏడేళ్ల క్రితం కళాశాలకు వెళ్ళిన యువకుడు సాయంత్రం ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు, తెలిసినచోటల్లా వెదికారు. అయినా ఫలితం లభించలేదు. కొన్ని రోజుల తర్వాత పోలీసులు వచ్చి మీ కుమారుడు మావోయిస్టులలో కలిశాడు అని చెప్పి ఇంట్లో సోదాలు జరిపి వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అతడి గురించి ఎలాంటి సమాచారం లేదు. తండ్రి చనిపోయినప్పుడు కూడా రాక పోవడంతో ఇక వారు ఆశలు వదిలేసుకున్నారు. కట్ చేస్తే.. వారం రోజుల క్రితం హైదరాబాద్ పోలీసుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. పోలీసులు ఇంటికి వచ్చారు. ఇద్దరు చెప్పింది ఒకటే. "మీకుమారుడు చత్తీస్‌గఢ్‌లో పోలీసులకు లొంగిపోయాడు. ప్రస్తుతం జైలులో ఉన్నాడు. త్వరలో ఇంటికి వస్తాడు" అని. చత్తీస్‌గఢ్ బల్లార్‌పూర్ రాష్ట్రంలో దళ కమాండర్‌గా ఉంటూ ఈ నెల 6వ తేదీన ప్రభుత్వానికి లొంగిపోయినట్లు వివరించారు. దీంతో సునిల్ తల్లి 80 ఏళ్ళ వృద్ధురాలు సులోచన సంతోషంతో కన్నీళ్ళపర్యంతం అయింది.

క్రిస్టియన్ కాలనీనుంచి..

పోలెపాక సునిల్ స్వస్థలం క్రిస్టియన్ కాలనీ. తల్లిదండ్రులు పోలె పాక సులోచన జయానందం. వారికి ఐదుగురు కుమారులు పోలెపాక నవీన్‌కుమార్, నోయల్, రాజు, సునిల్, అశోక్ ఉన్నారు. నాలుగోవాడైన సునిల్ మట్టెవాడ పాఠశాలలో 10వ తరగతి వరకు చదివాడు. 1998లో హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాడు.


సునిల్ తల్లి సులోచన, సోదరుడు నవీన్‌కుమార్

అనే సంవత్సరం ఓ రోజు కళాశాలకు వెళ్ళి తిరిగి రాలేదు. ఎంత వెతికినా జాడ తెలియలేదు. ఆ తర్వాత పోలీసులు వచ్చి మీ కుమారుడు మావోయిస్టులలో చేరాడు.. ఇంటికి వస్తున్నాడా, ఎప్పుడు వచ్చాడు, అంటూ అనేక మార్లు ఇంట్లో సోదాలు చేసి వెళ్లారు. కాని ఏ రోజూ సునిల్ ఇంటికి రాలేదు. ఐదేళ్ల క్రితం తండ్రి జయానందం మృతి చెందినప్పుడు కూడా ఇంటికి రాలేదు. పలుమార్లు అప్పటి మిల్స్‌కాలనీ సీఐ పుల్లా శోభన్‌కుమార్, అధికారులు వచ్చి నిత్యావసరాలను అందించారని తల్లి సులోచన తెలిపారు. ఎట్టకేలకు 27 ఏళ్ల తర్వాత కొడుకు ఇంటికి వస్తున్నాడని తెలిసి తల్లి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఏకభుక్తం.. భూతల శయనం..

- అనుక్షణం అయ్యప్ప నామస్మరణం
- భక్తిభావంలో ఓలలాడుతున్న భక్తులు

7

మేడారంలో ఎస్పీ పర్యటన

జాతర పరిసరాలు, రహదారుల పరిశీలన

7

జీపీవోలు ఎక్కడ?

- ప్రశ్నార్థకంగా మారిన జీపీవోల పనితీరు
- పేరుకే గ్రామ పాలన.. సేవలు ఎక్కడ?

7

తిరుగు టపా

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశాయి. అలాగే వరంగల్ రైల్వేగేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పని చేస్తున్న సదయ్యను సీటీఈలో సైకాలజీ లెక్చరర్‌గా డిప్యుటేషన్‌పై తీసుకురావడం వెనుక, ఆయన డిప్యుటేషన్ కాల పరిమితిని పొడిగించాలని ప్రయత్నాలు చేయడం వెనుక అబ్దుల్ హై కీలక భూమిక పోషించాడన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. డిప్యుటేషన్‌ను పొడిగించక పోవడంతో సదయ్య తన మాతృస్థానానికి తిరిగి బదిలీ అయ్యారు.

అలాగే ఛాత్రోపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో విచక్షణారహితంగా చెట్ల నరికివేతపై ఆయనపై ఫిర్యాదులు వెళ్లాయి. డైట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాల్లో తనకు అనుకూలమైన వారికి పెద్ద పీట వేసినట్టు విమర్శలు వెల్లువెత్తాయి. బాధితులు అబ్దుల్ హైకి వ్యతిరేకంగా కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఎక్కడా లేని విధంగా గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాల్లో వయోపరిమితి నిబంధన విధించి అర్హులకు అన్యాయం చేశాడని, స్కూల్ అసిస్టెంట్ కరన్‌కు విచారణ లేకుండా ఆరు ఇంక్రిమెంట్లకు సర్వీస్‌ను క్లియర్ చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. నయీం పాషాను డైట్‌కు డిప్యుటేషన్‌పై కూడా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అబ్దుల్ హైపై వచ్చిన అనేక ఆరోపణలపై విచారణకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్

● ప్రజావాణిలో 89 దరఖాస్తులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్ ద్వారా వచ్చే ఫిర్యాదులకు ప్రాముఖ్యత ఇవ్వాలని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) అదనపు కమిషనర్ చంద్రశేఖర్ వింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల వింగ్ అధికారులకు అదనపు కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నగరంలో ప్రధానంగా శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలపై ఫిర్యాదులు అందుతున్నాయని, సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. విలీన గ్రామాలలో దోమలు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని మలేరియా విభాగం అధికారులను ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి మొత్తం 89 ఫిర్యాదులు స్వీకరించగా అందులో ఇంజనీరింగ్ - 23,హెల్త్, శానిటేషన్ - 08,ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 08, టౌన్‌ప్లానింగ్ - 44, మంచి నీటి సరాఫరా - 04, హార్టికల్చర్ - 02 ఉన్నాయని అదనపు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, హార్టికల్చర్ అధికారి పాలస రమేష్, ఇన్‌చార్జి సీపీ రవీందర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, సమ్మయ్య, హెచ్‌వో లక్ష్మారెడ్డితో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు ఇలా..

● గ్రేటర్ 40వ డివిజన్ ఉప్పరోనికుంట ప్రాంతంలో డ్రైన్ బాక్స్ నిర్మాణం కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వని కారణంగా కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపి వేశాడు. పనులు పూర్తి చేయకపోవడం వల్ల ఉర్సు శ్మశానవాటికకు వెళ్లడం చాలా ఇబ్బందిగా మారిందని స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి స్థానిక ప్రజలతో కలిసి ఫిర్యాదు చేశాడు.

● వరంగల్ దేశాయిపేట ప్రధాన రహదారిపై ఉన్న చికెన్ సెంటర్ నిర్వాహకులు వ్యర్థాలను రోడ్లపై, డ్రైనేజీలలో వేయడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై సదరు యజమానిని మందలించే ప్రయత్నం చేయగా ప్రజలపై దాడికి పాల్పడ్డాడని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

● హనుమకొండ బొక్కలగడ్డ ప్రాంతంలోని డ్రైనేజీపై ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. అతడు డ్రైనేజీ కాల్వను కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టడంవల్ల మురికి నీరు ఇండ్లలోకి వస్తూ దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై గతంలో కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు.

● కాజీపేట మెయిన్‌రోడ్డుపై ఉన్న తన షాపును రోడ్డు వెడల్పు పేరుతో మునిసిపల్ అధికారులు 6 ఏళ్ల కిందట కూల్చివేశారు. తనకు నష్టపరిహారం కట్టిస్తామని చెప్పి ఇప్పటివరకు స్పందన లేదు. తన సమస్యలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని అబ్దుల్ సలీం అనే బాధితులు ఫిర్యాదు చేశారు.



WANTED

★ To Teach Maths Science (I-V) Standard High School, Kashibugga, Warangal Cont: 8522077799, 8522066699, 7680873344

AJW-6664

WANTED

★ నాచురల్ ఫార్మింగ్ ఆర్గనైజేషన్లో రిసెప్షనిస్ట్ మరియు అసిస్టెంట్‌గా చేయుటకు డిగ్రీ పూర్తిచేసిన యువతి కావలెను. హనుమకొండ. సం॥ప్ర॥ 9160210555

AJW-257166

WANTED

★ హన్మకొండ వరంగల్, ఆరెపల్లి అయ్యప్ప గుడి దగ్గర పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ కావలెను. జీతం : 11,000 నుండి 15,000. సం॥ప్ర॥ 9000120690

AJW-257209

LEASE / RENT

★ పెట్రోల్ బంక్ కోసం (లీజ్/కొనుగోలు) భూమి కావాలి (1/2 ఎకరం) వరంగల్ ఔటర్ రింగ్ రోడ్ నుండి కరీంనగర్ బైపాస్ రోడ్ దగ్గర ఉన్న ఏ ప్రాంతమైనా. సం॥ప్ర॥ 9849642213 / 9346137764

AJW-18006

LAND FOR SALE

★ Warangal Urban, J.B. Nagar చంద్రవదన్ కాలనీ చింతాల్ 275 గజలు స్థలానికి ఇరువైపుల సీసీ రోడ్డు కలదు, అమ్మబడును. సంప్రదించాడి : 9391396683, 9160550330

AJW 257207

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

3+2 స్కీం కలదు

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి

హన్మకొండ 9985400013 8978510273 9985411677

వరంగల్ 9949638376 9985408173

జనగామ 9866431354

మహబూబాబాద్ 9985418040

తొర్రూర్ 9985418040

నర్సంపేట 9949638376

భూపాలపల్లి 9985401232

పరకాల 9985401232

మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌లతో కలిసి ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీలేని రుణాల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నేడు(మంగళవారం) అన్ని సెగ్మెంట్లలో వడ్డీలేని రుణాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి 12 మండలాలకు చెందిన 9,046 మహిళా సంఘాలకు రూ.6 కోట్ల 51లక్షల వడ్డీలేని రుణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో మేన శ్రీను, గృహ నిర్మాణశాఖ పీడీ హరికృష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల పంపిణీకి ఏర్పాట్లు చేయండి

వరంగల్ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ సచివాలయం నుంచి మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌లతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీలేని రుణాల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 25న అన్ని సెగ్మెంట్లలో వడ్డీలేని రుణాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని వారికి ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లోని 10 వేల 357 స్వయం సహాయక సంఘాలకు రూ. 6 కోట్ల 52 లక్షలు వడ్డీలేని రుణాలను పంపిణీ చేస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో చేపట్టే కార్యక్రమంలో మండల, గ్రామ మహిళా సమాఖ్య ప్రతినిధులు అందరూ హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్‌డీవో రామిరెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు ఉమా, రాధిక, ఐకేపీ అధికారులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

ప్రజావాణి సమస్యలపై అలసత్వం చేయొద్దు

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలపై అధికారులు అలసత్వం చేయకుండా సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలపై 159 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా హౌసింగ్ పీడీకి 35 వినతులు రాగా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి 21 వినతులు వచ్చాయి. హనుమకొండ ఆర్‌డీఓ కార్యాల యానికి 18వినతులు రాగా మిగతా వినతులు వివిధ సమస్యలపై వచ్చాయి. కలెక్టర్ స్నేహ శబరీష్ స్వయంగా బాధితుల వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్‌డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె.నారాయణతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ స్నేహ శబరీష్

పీఏసీఎస్‌లో అవినీతిపై విచారణ జరిపించాలి

పెగడపల్లి పీఏసీఎస్‌లో జరిగిన రూ.కోట్ల అవినీతిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు రావు పద్మ రైతులతో కలిసి సోమవారం కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై జిల్లా యంత్రాంగం స్పందించకపోతే రైతుల పక్షాన పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఆ వినతిపత్రంలో బీజేపీ నాయకులు పేర్కొన్నారు.



ఉత్సవమూర్తులను ఊరేగించే మయూర వాహనం

మహిమాన్వితుడు సుబ్రహ్మణ్యేశ్వరుడు

● రేపు నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

గీసుగొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన మహిమాన్విత నాగసుబ్రహ్మణ్యస్వామి, వల్లీదేవి, దేవాసేనాదేవిల కల్యాణోత్సవం ఈ నెల 26న అంగరంగా వైభవంగా జరుగనుంది. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గీసుగొండ మండలం ఊకల్‌లో గల నాగసుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తిలకించి పులకించిపోతారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు నాగేంద్రుడి నామస్మరణంతో పరవశించిపోతారు. 3 దశాబ్దాల కిందట స్వామివారు ఇక్కడ స్వయంభూగా పుట్టలో వెలిసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష తెలిపారు.

ప్రతి ఏటా ఇక్కడ నిర్వహించే వల్లీదేవి, దేవాసేనాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా కొనసాగుతుంది. ఉదయం 8 గంటలకు ఉత్సవ మూర్తులకు మయూర వాహన సేవ, ఎదుర్కోళ్లు, ఊరేగింపుతో ఆలయంలోని కల్యాణమండపానికి తీసుకువస్తారు. అందంగా పూలతో అలంకరించిన కల్యాణమండపంలో 11.43 నిమిషాలకు వివాహ క్రతువు మొదలై సాయంత్రం వరకు కొనసాగుతుంది. ఈ సారి జరిగే ఉత్సవానికి ఉత్సవమూర్తులను మయూర వాహనంపై తీసుకురావటం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ నెమలి వాహనాన్ని కందకట్ల శ్యాంప్రసాద్, శ్రీవాణి దంపతులు సుమారు రూ.5లక్షలతో తయారు చేయించారు. కాగా, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వర్‌రావు, కార్యదర్శి కొత్తగట్టు రాజు తెలిపారు.

నగరంలో బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నరంలో కొద్దిరోజుల్లో బయో మిథనైజేషన్‌తో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఆధునీకరిస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం ఢిల్లీలో క్లైమెట్ ప్రాజెక్ట్ ప్రిపరేషన్ ఫెసిలిటీ వర్క్‌షాప్‌లో వరంగల్ మునిసిపల్ కమిషనర్ హాజరై మాట్లాడారు. గోబల్ మిథెన్‌హబ్, లోకల్ గవర్నమెంట్ ఫర్ సస్టెబిలిటీ, డబ్ల్యూఆర్‌ఐ ఇండియా సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో కమిషనర్ పాల్గొని వరంగల్ జీడబ్ల్యూఎంసీలో అమలవుతున్న అభివృద్ధి పనులను విశ్లేసించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హడ్కో) మెమోరాండం ఆఫ్ సాండింగ్ కుర్చుకుందన్నారు. బల్దియాను అభివృద్ధి చేయడానికి కొన్ని ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లు వచ్చాయన్నారు. నగరానికి బయో మిథనైజేషన్ ప్లాంట్ వస్తే జరిగే లాభాల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పట్టణాభివృద్ధి గృహనిర్మాణ మంత్రిత్రశాఖ జాయింట్ సెక్రెటరీ ఇషా కాళియా, సిటీ ఎంగేజ్‌మెంట్ లీడ్ అనితా భట్రాఘర్, హడ్కో సీఎండీ సంజయ్‌కుల శ్రేష్ఠ, ఎన్‌ఐయూఏ డైరెక్టర్ డాక్టర్ డెబోలినా కుందులు పాల్గొన్నారు.



ఢిల్లీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

జిల్లా స్థాయి అండర్-14 బాలుర క్రికెట్ జట్లు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26నుంచి జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ జిలా కేంద్రాల్లో నిర్వహించనున్న అంతర్ జిల్లాల అండర్-14 బాలుర క్రికెట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం వంగపల్లిలోని డబ్ల్యూడీసీఏ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అండర్-14బాలుర విభాగంలో నిర్వహించిన క్రికెట్ ఎంపిక పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొన్నారని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఇక్కడ నిర్వహించిన ఎంపిక పోటీల్లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఒక్కో జిల్లా నుంచి ఒక్కో జట్టుగా ఎంపిక చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 6జిల్లాలకు 6జట్లను ఎంపిక చేసి ఆ జట్ల మధ్య లీగ్ కం నాకౌట్ పద్ధతిన పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఒక జట్టును ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంపిక చేయడంతో పాటు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-14 హెచ్‌సీఏ లీగ్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తామని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్, అసోసియేషన్ జిల్లా సంయుక్త బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షులు తోట రాము, సభ్యులు అభినవ వినయ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి అండర్-14 బాలుర క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

సెంట్రల్ జోన్ డీసీపీగా దార కవిత బాధ్యతలు

వరంగల్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ నూతన డీసీపీగా దార కవిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ పరిధిలోని ఏసీపీ, సీఐ, ఎస్సైలు డీసీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కవిత

సీటు బెల్ట్ తెరుచుకోక..

● కారులో మంటలు చెలరేగి వ్యక్తి సజీవ దహనం

● మృతుడు జయగిరి వాసి

● శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్‌పై ఘటన

హసన్‌పర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఓఆర్‌ఆర్‌పై సోమవారం ఉదయం జరిగిన కారు ప్రమాదంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరికి చెందిన తాళ్లపెల్లి దుర్గాప్రసాద్ (29) సజీవదహనమైన ఘటన విషాదాన్ని నింపింది. శామీర్‌పేట్ నుంచి కీసర మీదుగా హనుమకొండకు వస్తున్న క్రమంలో రోడ్డు పక్కనే కారును నిలిపి సేద తీరేందుకు ప్రయత్నించగా కారులో ఏసీ లీక్ అయ్యి ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలిసింది. అయితే కారు డ్రైవింగ్ సీటుకు ఉన్న బెల్టు రాకపోవడంతో కారు నడుపుతున్న దుర్గాప్రసాద్ కాలి బూడిదయ్యాడు.

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరికి చెందిన తాళ్లపల్లి ప్రభాకర్, ప్రమీల దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సురేష్ లండన్‌లో స్థిరపడగా చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ (29) యూట్యూబ్ చానెల్‌లో పార్ట్‌నర్‌గా పనిచేసేవాడు. ఇతను అవివాహితుడు. తండ్రి ప్రభాకర్ ఆర్‌టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవలే రిటైర్ అయ్యారు. 15 సంవత్సరాల క్రితమే ప్రభాకర్ కుటుంబం హనుమకొండలో స్థిరపడగా వారి పుట్టినిల్లు జయగిరిలో ఉండగా వస్తూపోతూ ఉండేవారు.

ఈ క్రమంలోనే దుర్గాప్రసాద్ రెండు రోజుల క్రితం తన కారులో హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని సోమవారం తెల్లవారు ఝామునే మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ పైనుండి కీసరవైపు వస్తున్నాడు. డ్రైవింగ్ చేస్తున్న దుర్గాప్రసాద్‌కు నిద్ర వస్తున్నట్లు అనిపించడంతో కారు పక్కకు తీసుకొని కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగానే ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగడంతో సజీవదహనమైనట్లు తెలిసింది. కారులో ఏసీ లీకై మంటలు చెలరేగగా, ఆ సమయంలో సీటు బెల్టు లాక్ కావడంతో బయటికి రాలేక మంటల్లోనే చిక్కుకొని సజీవదహనమైనట్లు తెలిసింది. కాగా, దుర్గాప్రసాద్ పార్థివదేహం సోమవారం రాత్రి జయగిరికి చేరుకుంది. అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

హనుమకొండ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ రిజిస్ట్రేషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బోడ మధు (35) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ పెద్దమ్మగడ్డకు చెందిన బోడ మోహన్ - సక్కుబాయి దంపతులకు ముగ్గు రు కుమారులు ఉన్నారు.



మధు (ఫైల్)

ముగ్గురిలో బోడ మధు హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో రెండేళ్లుగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఉదయం జిమ్‌కు వెళ్లి ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురై గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మధు మృతదేహాన్ని ఎంపీ కడియం కావ్య, బీజేపీ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సందర్శించి నివాళులర్పించారు. ఇంకా నివాళులర్పించిన వారిలో వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, జోరిక రమేష్, కంజర్ల మనోజ్, పోలెపల్లి రాంమూర్తి, మసూద్ తదితరులు ఉన్నారు.

వచ్చే నెల 1న బల్దియా కౌన్సిల్ సమావేశం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ సర్వసభ్య (కౌన్సిల్) సమావేశం వచ్చే డిసెంబరు 1వ తేదీ న జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కాగా అ కౌన్సిల్ సమావేశంలో వరంగల్ నగర అభివృద్ధి ఎజెండా అంశాలు, ప్రతిపాదనలు, ఆమోదం వంటి విషయాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్‌అఫిషియో మెంబర్లు, కార్పొరేటర్లు విధిగా హాజరు కావాలని చంద్రశేఖర్ కోరారు.

బాలికను హత్య చేసిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తోందని మూ డేళ్ల బాలికను హత్య చేసిన కేసులో ఇద్దరికి యా వజ్జీవ కారాగార శిక్ష, రూ.2500 జరిమానా విధి స్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి వీబీ నిర్మలగీతాంబ సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రంగశాయిపేట ప్రాంతానికి చెందిన ఎం.డి. ఖాసిం కొన్నేళ్లుగా వ్యాపారం చేసుకొని జీవిస్తున్నాడు. షాపులో పనిచేయడం కోసం ఒకరు కావాలని అదే ప్రాంతానికి చెందిన ఎస్‌కే అబ్బాస్‌కు తెలుపగా సయ్యద్ యూసుఫ్‌ను పరిచయం చేశాడు. యూసుఫ్ పనిలో చేరేటప్పుడు తనకు భార్య హజీరా బేగం, మూడేళ్ల కూతురు సబా ఉందని చెప్పాడు.

ఇదిలా ఉండగా, 2022 ఏప్రిల్ 24న ఉదయం 8 గంటలకు పాప లేవడం లేదని యూసుఫ్ ఏడ్చుకుంటూ ఖాసింకు ఫోన్ చేసి చెప్పగా పాప ను ఎంజీఎంకు తరలించారు. అప్పటికే ఆమె చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో యూసుఫ్ ప్రవర్తనపై అనుమానం రావడంతో ఖాసీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేయగా యూసుఫ్, హజీరాబేగం భార్యాభర్తలు కాదని, చనిపోయిన పాప హజీరాబేగం కూతురని తేల్చారు. తమ వివాహేతర బంధానికి అడ్డుగా వస్తోందని హత్య చేసినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. దీంతో నిందితులు యూసుఫ్, హజీరా బేగంలపై హత్యానేరం నమో దు చేసి మిల్స్‌కాలనీ పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితులకు జీవిత ఖైదు విధి స్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ జి. శ్రీనివాస్, సీహెచ్.రాజు సాక్షులను ప్రవేశపెట్టగా హరికృష్ణ లైజన్‌అధికారిగా వ్యవహరించారు. దర్యాప్తు అధికారులుగా సీఐలు ముష్క శ్రీనివాస్, బొల్లం రమేష్‌లు వ్యవహరించారు.అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.



బాస్కెట్‌బాల్ ఎంపికలపై తోటబడి వద్ద నిర్వాహకులతో క్రీడాకారుల వాగ్వాదం దృశ్యం

బాస్కెట్‌బాల్ ఎంపికల్లో గందరగోళం

- అనుమతులు లేకుండా ఎంపిక ప్రక్రియ
- తోట బడి వద్ద పలువురి ఆందోళన
- నిర్వాహకులతో వాగ్వాదం.. పోలీసుల రంగప్రవేశం

హనుమకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా బాస్కెట్‌బాల్ ఎంపిక ప్రక్రియ జరుపుతున్నారంటూ పలువురు క్రీడాకారులు ఆందోళనకు దిగడంతో హనుమకొండ సెయింట్ జోసఫ్(తోటబడి) వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. వివరాల్లోకి వెళితే...

రెండు బాస్కెట్ బాల్ అసోసియేషన్ల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. పంచాయతీ కోర్టు వరకు వెళ్లింది. ఈ క్రమంలో గుర్తింపు లేనిదిగా చెబుతున్న అసోసియేషన్ బాస్కెట్‌బాల్ ఎంపికలను చేపట్టింది. మొదట హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించాలని భావించినప్పటికీ వివాదం నేపథ్యంలో డీఎస్‌వో అనుమతి ఇవ్వకపోవడంతో వేదికను హనుమకొండలోని తోట బడికి మార్చారు. సోమవారం ఎంపిక పోటీలు జరగనుండగా అక్కడికి వచ్చిన కొందరు ఆటగాళ్లు దీనికి అడ్డుకునే ప్రయత్నం చేశారు. నకిలీ పత్రాలతో సెలక్షన్ కమిటీ పేరిట ఆటగాళ్ల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. బాస్కెట్ బాల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధిగా కూడా కొనసాగుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. నిజానిజాలు తేలే వరకు ఈ సెలక్షన్స్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీనితో నిర్వాహకులకు, ఆటగాళ్లకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకొని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అయితే ఎలాంటి విచారణ చేపట్టకుండానే ఇరువురిని కాకుండా సాగర్ అనే ఆటగాడిని పోలీసు స్టేషన్‌లో నిర్బంధించి మిగతా వారిని పోలీసులు బయటకు పంపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏకభుక్తం.. భూతల శయనం..

- అనుక్షణం అయ్యప్ప నామస్మరణం
- భక్తిభావంలో ఓలలాడుతున్న భక్తులు
- జిల్లాలో మార్మోగుతున్న అయ్యప్ప శరణుఘోష



జనగామలోని అయ్యప్ప ఆలయంలో పడిపూజలో పాల్గొన్న భక్తులు

లింగాలఘణపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప నామస్మరణతో పల్లె, పట్టణాలు మార్మోగుతున్నాయి. అయ్యప్ప మాలదారులు భక్తిశ్రద్ధలతో నిష్ఠతో దీక్షను కొనసాగిస్తున్నారు. ఎముకలు కొరికే చలిలో కఠోర దీక్షలకు సిద్ధమైన అయ్యప్ప భక్తులు భక్తిభావంతో ముందుకు సాగుతున్నారు. ఒంటి పూట మాత్రమే సాత్వికంగా భోజనం చేస్తూ, నేలపై శయనిస్తూ మాలదారులు మండల పూజలు చేస్తున్నారు. దీక్ష స్వీకరించిన వారు మండల కాలం(41 రోజులు) కఠోర దీక్షతో స్వామిని కొలుస్తుంటారు. ఒక్కపూట శాఖాహారంతో మాత్రమే భోజనాన్ని స్వీకరిస్తూ, ఆహార నియమాలను పాటిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత తిరిగి ఎలాంటి ఆహారం తీసుకోకుండా మళ్లీ రాత్రి పడుకునే ముందు పాలు, పండ్లు లేక సాత్వికమైన అల్పాహారం తీసుకుంటూ నిత్యం ఆధ్యాత్మిక చింతనలో మునిగి తేలుతున్నారు. కామోత్రేరకాలను కలిగించే అల్లం వెల్లుల్లి లాంటి వాటిని పూర్తిగా దూరంగా ఉంచడం విశే షం. వేకువ జామునే లేచి చన్నీటి శిరస్నానం చేసి బ్రహ్మముహూర్తంలో స్వామి వారికి పూజలు చేస్తున్నారు. ఎదురుగా వచ్చే ఎవ్వరినైనా వారి పేర్లతో కాకుండా అయ్యప్పస్వామి పేరుతో పలకరిస్తూ అనుక్షణం అయ్యప్ప నామస్మరణం చేస్తుంటారు.

యోగాసనం.. పూజా విధానం..



అయ్యప్ప మాల వేస్తున్న గురుస్వామి రాజేశ్వరాచార్యులు

అయ్యప్ప దీక్ష తీసుకున్న ప్రతీ భక్తుడు తనకు తెలియకుండానే ప్రతీరోజు ఉదయం సాయంత్రం యోగాసనం చేస్తుంటారు. అయ్యప్ప స్వామి పూజను మొదలు చేసినప్పటి నుంచి తను చేసే ప్రతీ కదలిక శరీరంలోని ప్రతీ భాగం యోగాసనం చేస్తుంది. పూజ క్రతువులో చేతులు, చేతి వేళ్ల నిర్విరామంగా క్రమపద్ధతిలో పనిచేయడం, రెండు కాళ్లను ముడుచుకుని కూర్చోవడం, అంగపూజ చేస్తున్నప్పుడు పుష్పార్చన చేయడం, అష్టోత్తర శతనామావళి చేస్తున్నప్పుడు అక్షింతలు వేయడం లాంటివి యోగాసనంలో భాగమే అవుతుంటాయి. అదేవిధంగా నమస్కారం శ్లోకం పఠిస్తున్న సమయంలో నిటారుగా నిల్చుని తిరిగి నడుము ను కిందికి వంచడం, భూమాతకు వంద నం చేయడం, సాష్టాంగ ప్రణామం చేస్తున్నప్పుడు మోకాళ్లు నేలకు ఆనకుండా కాలి బొటన వేళ్ల సాయంతో బోర్లాపడుకుని స్వామిని ప్రార్థించడం లాంటి చర్యలు యోగాసనంలో భాగంగా మారిపోతాయి.



ఆలయంలో పడిని వెలిగిస్తున్న అయ్యప్ప భక్తులు

ఉదయాన్నే పూజ ముగిసిన అనంతరం సమీప దేవాలయంలో ప్రదక్షిణలు చేస్తుండటం కూడా మార్నింగ్ వాక్‌గా ఉపకరిస్తుంది. అన్నింటి కంటే ప్రధానమైన అంశం 108 సార్లు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘోషించే శరణు ఘోష శ్వాసను నిలువరిస్తూ శరీరాన్ని, మనసును పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం కూడా యోగాసనంలో భాగంగానే మారిపోతాయి.

మహిళలపై మాతృభావం..

అయ్యప్ప దీక్షలో ప్రధానంగా ప్రతీ మహిళను తల్లి సమానంగా భావిస్తారు. భార్యను సైతం మండలకాలం పాటు 41 రోజులు మాతృమూర్తిగా భావించి మాతాస్వామిగా పలకరిస్తూ అయ్యప్పస్వామిని కొలుస్తుంటారు. దీక్ష స్వీకరణ చేసిన ప్రతీ భక్తుడు తనలో అహాన్ని విడిచి తనతోటి వారంతా తనతో సమానమనే భావనను కలిగి ఉండటంతో పాటు పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత పెద్ద చిన్నా, ధనిక పేద తారతమ్యం లేకుండా ప్రతీ ఒక్కరివి పాదపూజ(కాళ్లమొక్కడం)చేసుకోవడం సమానత్వానికి అయ్యప్ప దీక్షా నియమాలు ప్రతీకగా నిలుస్తున్నాయి.



బాణాపురంలో కలశ పూజలు చేస్తున్న అర్చకుడు

5వేల మంది మాలదారులు

కాసోజు రాజేశ్వరాచార్యులు, ప్రధానార్చకులు, అయ్యప్ప దేవాలయం(బాణాపురం) జనగామ



జనగామ జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల పైచిలుకు మంది అయ్యప్ప దీక్షను స్వీకరించారు. గతంతో పోల్చితే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉరుకుల పరుగుల జీవితాలతో బతుకుపోరాటంతో నిత్యం కుస్తీపడుతున్న ఎంతో మంది మండలకాలం పాటు దీక్షా స్వీకరణ చేయడంతో ఆధ్యాత్మికత భావం రెట్టింపు కావడంతో పాటుగా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

ప్రశాంత జీవనం అలవడుతుంది..

ధర్మపురి శ్రీనివాస్ - (13వ పాదం) జనగామ



ఉరుకులు పరుగుల మధ్య బిజీబీజీగా కొనసాగుతున్న వర్తమాన పరిస్థితుల్లో కనీసం కుటుంబ సభ్యులతో తీరికగా గడపలేక పోతున్నాం. దీక్ష చేపట్టి మండలకాలం పాటు నిత్య పూజలు చేస్తూ ఆధ్యాత్మికతలో మునిగితేలుతుంటే ఎంతో హాయిగా ఉంటుంది. గత 13 ఏళ్లుగా దీక్షను చేపడుతూ ప్రతీ ఏటా అయ్యప్ప స్వామిని దర్శించుకుని వస్తుంటాను. మాలధారణ చేపట్టడంతో నాకు మానసిక ప్రశాంతతతో పాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అలవడుతోంది.



పాకాల ఆయకట్టులో తారిపోతున్న వరి పొలాలు

తారిపోతున్న వరి పొలాలు

- వరికోత యంత్రాల కొరత
- ఆందోళనలో పాకాల ఆయకట్టు రైతులు

ఖానాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో కూలీల కొరత ప్రధాన సమస్యగా మారింది. సాగులో కూలీల కొరతను అధిగమించేందుకు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు గిట్టుబాటు కాకనో.. అవగాహన లేకనో.. ఇప్పటికీ ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసుకోవడంలో వెనుక బడుతున్నారు. కూలీలు దొరక్క, ఆధునిక యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో సాగు అదను దాటిపోవడం మూలంగా దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణంలో వరి పంటను సాగు చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన పాకాల ఆయకట్టులో రైతుల అవసరాలకు సరిపడా వరికోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో కోత దశకు చేరుకున్న పంట తారిపోతోంది. పాకాల ఆయకట్టులో వానాకాలం సీజన్‌లో 30వేల ఎకరాల్లో వరిరి సాగు చేశారు. ఎక్కువ విస్తీర్ణంలో సన్న ధాన్యాన్ని సాగుచేశారు. దీంతో 80 శాతం పంట కోత దశకు చేరుకుంది. కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాల పైనే(హార్వెస్టర్లు) ఆధారపడ్డారు. ప్రతి ఏటా ఇతర జిల్లాల నుంచి పెద్దఎత్తున పాకాల ఆయకట్టులోకి వరికోత యంత్రాలు వచ్చేవి. ఈ ఏడాది ఇప్పటివరకు రాకపోవడంతో పొలాలు తారిపోయి ఎటుచూసినా ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే వరుస తుఫాన్‌ల తాకిడి కారణంగా పంటలన్నీ దెబ్బతిని నేల వాలడంతో రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. కొద్దో గొప్పో పండిన పంటను నూర్పిడి చేసుకుందామంటే వరికోత యంత్రాలు లేక అవస్థలు పడుతున్నారు.

సాగు ముందుకు..

పాకాల ఆయకట్టులో ప్రతి ఏటా సాగు ఆలస్యంగా ప్రారంభమయ్యేది. దీంతో రైతులు స్టేట్ షెడ్యూల్‌కు నెల రోజుల వెనుకబడి ఉండేవారు. దీని కారణంగా యాసంగి సాగు సైతం ఆలస్యమయ్యేది. ఈ నేపథ్యంలో అధికారులు స్టేట్ షెడ్యూల్‌కు అనుగుణంగా పాకాల ఆయకట్టు రైతులు సాగు పనులు చేపట్టాలని అవగాహన కల్పించారు. ఈ ఏడాది వానాకాలంలో సాగు పనులను ముందుగా ప్రారంభించారు. గతంలో ఆయకట్టు రైతులు సాగు పనులను ఆలస్యంగా చేపట్టడంతో ఇతర జిల్లాల్లో వరికోతలు పూర్తి కాగానే వరికోత యంత్రాలు పాకాలకు వచ్చేవి. ఈ ఏడాది ఇతర జిల్లాల్లో సైతం ఇదే సమయంలో కోతలు నడుస్తుండడంతో పాకాల ఆయకట్టుకు వరికోత యంత్రాలు రాలేని పరిస్థితి దాపురించింది.

యంత్రాల కొనుగోలులో వెనుకబాటు

వరికోత యంత్రాల కొనుగోలులో పాకాల ఆయకట్టు రైతులు వెనుక బడిపోయారు. ఆయకట్టులో 30వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగైంది. పం ట నూర్పిడికి 80నుంచి 120 వరికోత యంత్రాలు అవసరమవుతాయని వ్యవసాయాధికారులు తెలిపారు. కానీ, ఆయకట్టు రైతుల చేతిలో 20 వరికోత యంత్రాలకు మించి లేవు. దీంతో సూర్యాపేట, నల్గొండ, కోదాడ, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ వంటి ప్రాంతాల నుంచి ప్రతీ వానాకాలం సీజన్‌లో పాకాల ఆయకట్టుకు 100 నుంచి 120 వరికోత యంత్రాలు వస్తుంటాయి. ఒక్కో మిషన్ రోజుకు 8 నుంచి 10 ఎకరాల వరకు నూర్పిడి చేస్తుంది. దీంతో 20 రోజుల్లో కోతలు ముగిసేవి. ఈ వానాకాలం సీజన్‌లో ఇతర ప్రాంతాల నుంచి వరికోత యంత్రాలు రాకపోవడంతో ఇక్కడి రైతుల వద్ద వరికోత యంత్రాలు లేకపోవడం వలన పొలాలు తారిపోతున్నాయి. ప్రస్తుతం ప్రతీ రైతు యంత్రాల కోసం ఎదురుచూస్తున్నాడు. ఇతర ప్రాంతాల నుంచి పాకాల ఆయకట్టుకు వరికోత యంత్రాలు వస్తే మంచి గిరాకీ ఉంటుందని రైతులు అంటున్నారు. పాకాల ఆయకట్టు రైతులు సైతం రాబోయే రోజుల్లో అవసరాలకు సరిపడా వరికోత యంత్రాలను కొనుగోలు చేసుకోవాలని, తద్వారా సాగు అదను మించిపోకుండా చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

బిషప్ జాన్‌మార్కండేయ సేవలు అభినందనీయం

- బ్రదర్ అనిల్‌కుమార్
- ముగిసిన ఆశీర్వాద పండుగలు

కాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బిషప్ జాన్ మార్కండేయ 40 ఏళ్లుగా పేదల కోసం, దైవ పరంగా చేసిన సేవలు అభినందనీయమని, ఆయనకు దేవుడి ఆశీర్వాదం నిత్యం ఉంటుందని బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. కాజీపేట చౌరస్తా స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహించిన ఆశీర్వాద పండుగలు సోమవారంతో ముగిశాయి. ఈ ఆశీర్వాద పండుగలకు ముఖ్య అతిథిగా బ్రదర్ అనిల్‌కుమార్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హజ్ కమిటీ చైర్మన్, దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషా హాజరై ప్రసంగించారు. పేదల కోసం నిత్యం సేవలందిస్తున్న బిషప్ జాన్ మార్కండేయకు ప్రభుత్వం పరంగా సహకారం అందిస్తుందన్నారు. అనంతరం బ్రదర్ అనిల్ పలు క్రైస్తవ గీతాలు ఆలపించారు. తన రాజకీయ గురువు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అల్లుడు బ్రదర్ అనిల్ ఈ పండుగలకు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఎమ్మెల్యే నాయిని అన్నారు. క్రైస్తవులంతా కాంగ్రెస్ వైపే ఉంటారన్నారు. ఈ పండగలకు వేలాదిగా హాజరైన క్రైస్తవులను కలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం బిషప్ జాన్ మార్కండేయ దంపతులను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ డైరెక్టర్ నిఖిల్ జాన్, రోజ్‌మేరీ, బైబిల్ మిషన్ వ్యవస్థాపకుడు జీవరత్నం, పాస్టర్‌లు చంద్రమౌళి, కృష్ణతోపాటు క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



బ్రదర్ అనిల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

మేడారంలో ఎస్పీ పర్యటన



మేడారంలో బైక్‌పై వెళ్తూ రహదారులను పరిశీలిస్తున్న ఎస్పీ



పోలీస్ మెస్ స్థలాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జాతర పరిసరాలు, రహదారుల పరిశీలన

తాడ్వాయి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ సోమవారం పర్యటించారు. కొత్తగా బదిలీపై వచ్చిన ఆయన మేడారం పరిసరాలు, రహదారులను పరిశీలించారు. ఇతర పోలీసు అధికారులతో కలిసి బైక్‌పై కలియ తిరిగారు. మహా జాతర నేపథ్యంలో భక్తులకు ఎదురయ్యే సమస్యలపై అధికారులతో చర్చించారు. 2026 మహా జాతరకు 3 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారుల అంచనాలకు అనుగుణంగా భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందులో భాగంగా మేడారం పరిసరాలతో పాటుగా కాల్వపల్లి, బయ్యక్కపేట, నార్లాపూర్, కొత్తూరు, ఊరట్టం, కన్నెపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. రోడ్ల విస్తరణ పనులు, మరమ్మతులు, పార్కింగ్ స్థలాలు, వంతెనలు, కాజ్‌వేలు, జాతరలో పోలీసుల అకామిడేషన్ స్థలాలు తదితర పరిశీలించారు. అనంతరం వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ వెంట ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, డీఎస్పీ రవీందర్, సీఐ దయాకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ మెస్, అకామిడేషన్ స్థలాల గుర్తింపు

మేడారం మహా జాతరలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి మెస్ అండ్ అకామిడేషన్ కోసం ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మేడారం,కొత్తూరు, కన్నె పల్లి, నార్లాపూర్, వెంగళాపూర్, రెడ్డిగూడెం, ఊరట్టం గ్రామాల్లో పోలీస్ సిబ్బం ది 11 స్థలాలను గుర్తించారు.వాటిని చదు ను చేసి సిద్ధంగా ఉంచారు. ఈ స్థలాల్లో మహా జాతరలో వసతి, భోజనాల సౌకర్యా లు ఏర్పాటు చేయనున్నారు.

ప్రముఖుల ప్రత్యేక పూజలు

వనదేవతలను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరితో పాటు పలువురు ఇతర ప్రముఖులు దర్శించుకున్నారు. పూలు,పండ్లు, పసుపు, కుంకుమ, చీర సారెలు, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించారు. పూజారులు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ప్రసాదాలు అందించారు.

ఒక్క క్లిక్‌తో మీసేవ..

- వాట్సాప్‌లో సర్వీసులు ప్రారంభం
- పౌర సేవలు మరింత సులభతరం

తొర్రూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మీసేవ సర్వీసులు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వం పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ డిజిటల్ సేవలను ఈనెల 18వ తేదీన రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఇకపై ఒక్క క్లిక్‌తో 20కి పైగా మీసేవ సర్వీసులు సులభంగా పొందవచ్చు. దీనికిగాను ప్రభుత్వం ఒక ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. వాట్సాప్‌లో 8096958096 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే వెంటనే రిప్లేలో మెనూ వస్తుంది. కావాల్సిన సేవలను ఎంచుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడు అప్‌డేట్‌తో పాటు ఆమోదం పొందిన సర్టిఫికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు. విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సులభంగా వేగంగా అందుతాయని అధికారులు అంటున్నారు.

అప్లై.. డౌన్‌లోడ్..

అధికారిక నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే నమస్కారం. తెలంగాణ మీసేవకు స్వాగతం మీకు ఎలాంటి సేవలు కావాలంటూ రిప్లైలో అందుబాటులోకి వస్తుంది. అందులో మనం ఎంచుకున్న సేవలకు దరఖాస్తు పూరించి అవసరమైన డాక్యుమెంట్‌లు, ఫోటోలు స్కాన్ చేయాల్సి ఉంటుంది. సూచించిన యూపీఐ ద్వారా ఫీజును సురక్షితంగా చెల్లించుకోవచ్చు. ఆతర్వాత దరఖాస్తు స్టేటస్, అప్‌డేట్, అన్ని వాట్సాప్‌లోనే మెసేజ్ రూపంలో వస్తాయి. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తులను అధికారులు ధృవీకరణ పత్రాలను పరిశీలించి అర్హత మేరకు డొంగల్ ద్వారా జారీ చేస్తారు. సర్టిఫికెట్ సిద్ధం కాగానే డౌన్‌లోడ్ లింక్ ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దానిని క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసి పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవచ్చు. ఇదేకాక మరో 500 రకాల సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి వస్తాయని ప్రస్తుతం సర్టిఫికెట్‌లు పొందడానికి అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జీపీవోలు ఎక్కడ..?

- ప్రశ్నార్థకంగా మారిన జీపీవోల పనితీరు
- పేరుకే గ్రామ పాలన.. సేవలు ఎక్కడ..!
- గ్రామాల్లో జీపీవో ఎవరో తెలియని పరిస్థితి
- సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకే వస్తున్న ప్రజలు
- సాదాబైనామాల పనిలోనే ఉన్నారంటున్న అధికారులు


వర్ధన్నపేట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్‌వో) వ్యవస్థను తీసివేసి, వారిని ఇతర శాఖల్లోకి పంపించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ఆ వ్యవస్థను పునరుద్ధరించి, కొత్తగా గ్రామ పాలన అధికారి (జీపీవో)గా నామకరణం చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు మాసం నుంచి వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జీపీవోలు విధుల్లో చేరారు. గతంలో వీఆర్వోలు పనిచేసే పనులనే మళ్లీ అప్పగించి, గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రజలకు చేరువలో ఉండేలా చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు వెయ్యికి పైగా రెవెన్యూ గ్రామాలు ఉండగా, అన్ని చోట్ల జీపీవోలను నియమించారు. కానీ, జీపీవోల పనితీరు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. జీపీవోలు ఎలా ఉంటారో కూడా తెలియదని గ్రామాల ప్రజలు చెపుతుండడంతో విడ్డూరంగా మారింది.

జీపీవోల పనితీరుపై గందరగోళం

వీఆర్వో వ్యవస్థ ఉన్న సమయంలో గ్రామాల ప్రజలు నేరుగా వారి పనిపై వెళ్లేవారు. కానీ, ఇప్పుడు వచ్చిన జీపీవో వ్యవస్థలో ఏం పనులు చేసుకోవాలో అర్థం కావడంలేదని గందరగోళానికి గురవుతున్నారు. దీనికి తోడు జీపీవో గ్రామాల్లో కనిపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో గ్రామాల్లో జరిగే పనుల కోసం ఇప్పటికీ మండల కేంద్రంలోని కార్యాలయానికి వస్తున్నారు. జీపీవోలు గ్రామీణస్థాయిలో ఉండే ప్రజలకు కులం, ఆదాయం, నివాసం, రేషన్ కార్డు, భూ సమస్యలు, భూ వివరాలు, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం, ఉపాధి సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రం, పేదరిక ధ్రువీకరణ, రెవెన్యూ కేసుల్లో సహకారం, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రెవెన్యూ వ్యవస్థలోని పనులన్నింటీని జీపీవో స్థాయి నుంచి చేయాల్సి ఉంటుంది.

కార్యాలయాల్లోనే జీపీవోలు

గ్రామ పాలన అధికారులు భూ భారతి కార్యక్రమంలోని సాదాబైనామాకు సంబంధించిన దరకాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామీణస్థాయిలో అందించాల్సిన పాలనకు పంగనామాలు పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉండాల్సిన అధికారులు కనిపించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజంతా కార్యాలయంలో కూర్చుంటే గ్రామ సమస్యలు ఎలా తెలుస్తాయని వాపోతున్నారు. సర్టిఫికెట్ల కోసం వారాల తరబడి తిగాల్సి వస్తోందని చెపుతున్నారు. జీపీవో ఎంత మంది ఏ గ్రామాల్లో ఎవరెవరు పనిచేస్తున్నారు? నెల వారీ సమీక్షలు లేకపోవడంతో రెండు నెలలు గడిచినా జీపీవో జాడ కనిపించడం లేదు. జీపీవో సంతకానికి గ్రామం నుంచి మండల కేంద్రంలోని కార్యాలయంలో వచ్చి అడగాల్సిన పరిస్థితి దాపరించింది.



వర్ధన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లను చూస్తున్న జీపీవోలు

గ్రామ పాలనలో బాధ్యతలు లేకపోతే ఎలా..

గ్రామస్థాయి పాలన అంటే ప్రజలకు దగ్గరగా ఉండే పరిపాలన. అక్కడే అధికారుల హాజరుకాకపోతే, ఫీల్డ్ పరిశీలన లేకపోతే, ఫిర్యాదు పరిష్కారం లేకపోతే పాలన పేరు మాత్రమే మిగులుతుంది. జీపీవోల హాజరుతో మండల అధికారుల దృష్టి సన్నగిల్లినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజువారీ కాకున్నా, వారానికోసారైన సమీక్ష లేకపోవడంతో కొత్త జీపీవోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. గ్రామానికి వారంలో కనీసం 3 రోజుల పాటు అందుబాటులో ఉండాలనే నిబంధన తుంగలో తొక్కారు. జీపీవోలు వచ్చినా కులం, ఆదాయం సర్టిఫికెట్ల జారీలో వారాల తరబడి తిరగాల్సి వస్తోంది. దీంతో న్యాయం కావాలంటూ ప్రజలు ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. జీపీవో సంతకం చేయనిదే పై అధికారుల టేబుల్ వరకు ఫైల్ కదలడం లేదు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం..

జీపీవోల పనితీరు పట్ల ఉన్నతాధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాల పై అధికారులతో మాట్లాడాల్సిన జీపీవోలు కార్యాలయాల్లో సాదాబైనామా, భూ భారతి పేరుతో ఫైళ్లను ముందట వేసుకుని కూర్చుంటున్నారు. వీటిని గమనించాల్సిన తహసీల్దార్లు కుర్చీకే పరిమితమై కార్యాలయ వివిధ విభాగాల్లో ఏం జరుగుతుందో కనీసం చూడడం లేదు. వారి కార్యాలయాల్లో ఉన్న విభాగాల్లో పరిస్థితిని నేరుగా కూడా చూడకపోవడంతో, ఇక మండలంలోని ఆయా గ్రామాలపై ఎలాంటి శ్రద్ధ ఉంటుందని మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీవో వ్యవస్థను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి విధులను గుర్తుచేస్తూ ప్రజల సమస్యలను ఏకరువు పెట్టడంతో, ఉన్నతాధికారులు కూడా నిర్లక్ష్యం వహిస్తే ప్రజలు మరింత ఆగ్రహం వ్యక్తం చేసే అవకాశం ఉంది.

'టెట్ నుంచి మినహాయింపునివ్వాలి'

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ యాట సదయ్య డిమాండ్ చేశారు. నరేంద్రనగర్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సదయ్య మాట్లాడుతూ... దీర్ఘకాలిక బోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాయాలనడం సరికాదన్నారు. ప్రభుత్వం చొరవ చూపి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలన్నారు. ఉపాధ్యాయులు టీవీరావు, శ్రీధర్, మహేంద్రనాథ్, వంశీ, దేవరాజ్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, అశోక్, మణిమాల, సంధ్యశ్రీ, సుధ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

వాటర్ ఫిల్టర్ల అందజేత

వరంగల్ మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో పట్టణ కేంద్రాలను సందర్శించి పేషెంట్లకు, సిబ్బందికి అవసరమైన మంచినీరు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య అన్నారు. ఐడీబీఐ బ్యాంకు వారు ఏడు వాటర్ ప్యూరిఫైర్‌లను అందించగా, వారిని శాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ అందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు కోటేశ్వర్‌రావు, మమత, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మౌనిక, డాక్టర్ హైదర్, డాక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు దుప్పట్ల పంపిణీ

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్ ప్రాంగణంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, వనం మహిళా సంఘం ఆధ్వర్యంలో వయోవృద్ధులకు దుప్పట్లు, శాలువాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి కె.జయంతి హాజరై దుప్పట్లు, శాలువాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ ఎన్స్‌పెక్టర్ పి.వెంకన్న, సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిస్టర్ నిర్మల, వరంగ్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకుల మధు, సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణ, ఎర్ర శ్రీకాంత్, ట్రెజరర్ సిస్టర్ అమృత, నిర్వాహకురాలు సిస్టర్ ఆల్బర్ట్ స్టెపి లారెన్స్, వనం సంఘం అధ్యక్షులు లూర్దు మేరి, కోఆర్డినేటర్లు ఎం.అజయ్‌కుమార్, కె.రవికుమార్, సుందరి, శ్రీకళ, అనిత, రాజేశ్వరి, పూర్ణిమతో పాటు సుమారు 450 మంది వృద్ధులు పాల్గొన్నారు.

గంగు ఉపేంద్రశర్మకు సత్కారం

జూలైవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోజా క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాకతీయ నంది అవార్డును అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని వేయిస్తంభాల ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మను ఓసీ జేఏసీ నాయకులు ఘనంగా సత్కరించారు. సోమవారం హనుమకొండ పోస్టల్‌కాలనీలోని రెడ్డి సంఘం కార్యాలయంలో ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి సత్కరించారు. గంగు ఉపేంద్రశర్మ రాష్ట్రంలోని అర్చకులకు, ఆలయాల ఉద్యోగులకు రాష్ట్ర నేతగా ఉంటూ సేవలు అందిస్తున్నట్లు జైపాల్‌రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామకృష్ణ ప్రసాద్, కోటేశ్వర్‌రావు, నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, చకిలం రాజేశ్వర్‌రావు, రావుల నరసింహారెడ్డి, కోరల్ల విద్యాసాగర్‌రెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, ప్రభాకర్, రఘు, విజయ్‌కుమార్, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ ఇంజనీరింగ్‌కు ఉజ్వల భవిష్యత్

కేయూ క్యాంపస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో రోబోటిక్ ఇంజనీరింగ్ విద్యకు, ఇంజనీర్లకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేయూ కోఎడ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ అన్నారు. కేయూ ఇంజనీరింగ్ కళాశాల, వరంగల్ అసోం అకాడమీ నేతృత్వంలో సోమవారం కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రోబోటిక్ ఇంజనీరింగ్‌పై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమణ మాట్లాడారు. ఇన్నోవేషన్ చాలెంజెస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక అంశాలు, హార్డ్వేర్డు అవగాహన, ప్రాజెక్టు డిజైనింగ్, మోడల్ బిల్డింగ్‌తో పాటు అనేక అంశాలపై కీలక అంశాలను ప్రత్యేకంగా నేర్పించినట్లు వివరించారు. సోహం అడడమిక్ ట్రైనర్లు ప్రహర్ష, అజయ్, మల్లికార్జున్‌లు రోబోటిక్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.మహేందర్, ఇన్‌చార్జి హెచ్‌ఓడీ డాక్టర్ స్వప్న, ఎం.వాణి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

హసన్‌పర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులను తక్షణమే సీజ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చింతగట్టు క్యాంపులోని ఆర్‌టీవో కార్యాలయంలో ఎంవీఐ కిశోర్‌బాబును కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా పరిధిలోని ప్రైవేటు బస్సులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రైవేటు స్కూల్ యజమాన్యాలు 1, 2 బస్సులకు ఫిట్‌నెస్ చెకింగ్ చేయించుకొని 4 నుంచి 20కిపైగా ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపై నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌టీవో అధికారులు తక్షణమే స్పందించి నింబంధనలు వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పించిన వారిలో పీడీఎస్‌యూ నాయకులు వెంకట్‌రెడ్డి, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు హకీమ్‌నవీద్, ఏఐఎస్‌బీ నాయకులు బాషబోయిన సంతోష్, నాయకులు శ్రీకాంత్, సావిత్రి, రంజిత్, వినయ్, జస్వంత్, అనూష, తదితరులున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

- కాజీపేటలో లా కళాశాల విద్యార్థుల ధర్నా


లా కాలేజీ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

కాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లా కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాజీపేట జ్యోతిబా పూలే లా కాలేజీ ఎదుట సోమవారం లా స్టూడెంట్స్ ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. న్యాయ విద్యకు అవసరమైన లైబ్రరీ, కోర్టు విజిట్స్, పరిశుభ్రత, హాస్టల్ సదుపాయాలు లేవన్నా రు. అన్ని సదుపాయాలు కల్పించాలని ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సదుపాయాలు కల్పించకుంటే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ధర్నా విషయమై కాలేజీ ప్రిన్సిపాల్ రవిని వివరణ అడగగా లా కాలేజీ, డిగ్రీ కాలేజీ కలిసి ఉండటంతో నీటి కొరత, హాస్టల్‌లో సదుపాయాలు లేవ ని, ఈ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు విద్యార్థులతో మాట్లా డి ధర్నా విరమింపజేయించారు. సౌకర్యాలు కల్పించే విషయమై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. ఈ ధర్నాలో లా స్టూడెంట్స్ పెద్దఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే కాజీపేట అభివృద్ధి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.30 లక్షలతో రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

కాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడి మంతుర్తి ఐలయ్యనగర్‌లో సోమవారం రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శంకుస్థాపన చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కాజీపేట ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే కాజీపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ. కాజీపేటలో మురుగు కుంటలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని, ప్రత్యేక నిధులతో మురుగు కుం టలకు మర్మతులు చేసి స్థానికుల సమస్యలు తీరుస్తామన్నారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవిందర్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, కాలనీ అధ్యక్షుడు మంతుర్తి తిరుపతి యాదవ్, నాయకులు సిరిల్ లారెన్స్, కుమ్మరి బాబు రావు, బొంద్యాలు, లోకేశ్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి

కేయూ క్యాంపస్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ప్రాంతంలోని రెడ్డికాలనీ వికాస్‌నగర్‌లో మాస్టర్‌జీ పేర్లతో ఉన్న ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేసి యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం వామపక్ష విద్యార్థి సంఘాల నేతృత్వంలో మండల విద్యాశాఖ అధికారికి రెండు పేర్లతో ఒకేపాఠశాల నిర్వహిస్తున్నారని సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్‌తో పాటు వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ.. మాస్టర్‌జీ స్కూల్ రిజిస్ట్రేషన్‌పై ఎంఈఓ, సీఆర్‌పీలకు వినతిపత్రాన్ని ఇచ్చినట్లు వివరించారు. నగరం నడిబొడ్డున రెండు పేర్లతో నడుస్తున్న పాఠశాలపై ఇప్పటి వరకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రాంతంలో అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నేత మొగిలి వెంకట్‌రెడ్డి, ఏఐఎస్‌డీఎఫ్ నేత గడ్డం నాగార్జున, ఏఐఎస్‌బీ నపేత ఎంఏ హకీమ్ నవీద్, ఏఐఎస్ఎఫ్ నేత భాషబోయిన సంతోష్, పీడీఎస్‌యూ నేత బి.నరసింహరావు, ఎస్ఎఫ్ఐ నేత మంద శ్రీకాంత్, ఏఐఎఫ్‌డీఎస్ నేత మాస్ సావిత్రి, పీడీఎస్‌యూ నేత రాచకొండ రంజిత్, ఏఐఎస్ఎఫ్ నేత శ్రీపతి వినయ్, ఎస్ఎఫ్ఐ నేత జస్వంత్, పి.అనూష తదితరులు పాల్గొన్నారు.

ఇనుగాలను అభినందించిన నేతలు


డీసీసీ అధ్యక్షుడికి అభినందనలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

హనుమకొండ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన ఇనుగాల వెంకట్రాంరెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందించారు. సోమవారం హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఇనుగాలను కలిసి పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. ఇనుగాలను అభినందించిన వారిలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, టీపీసీసీ నాయకుడు బత్తిని శ్రీనివాస్, పరకాల మునిసిపల్ చైర్మన్ సోదా రామక్రిష్ణ, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, టీపీసీసీ నాయకుడు మార్క విజయ్‌కుమార్‌తో పాటు వీసం సురేందర్‌రెడ్డి, డాక్టర్ శ్రవణ్‌కుమార్, అబూబాకర్, కిషన్, రమణారెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, నవీన్‌రావు, నేతలు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి పలువురి శుభాకాంక్షలు

హసన్‌పర్తి(ఆంధ్రజ్యోతి):హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఇనుగాల వెంకట్రామిరెడ్డిని సోమవారం పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండ రత్నాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీరాములు, మేడిపల్లి మదన్‌గౌడ్, జోరుక పూల, బత్తుల స్వాతి, జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ గొర్రె కిరణ్ ఉన్నారు.

ప్రయివేట్ ఆస్పత్రులపై ఆరోగ్యశాఖ దాడులు

వరంగల్ మెడికల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రయివేటు ఆస్పత్రులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ.. క్లినికల్స్, ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నియమ నిబంధనలకు లోబడి పనిచేయాలని ఆదేశించారు. అనుమతి పత్రాలతో పాటుగా తారిఫ్ లిస్ట్, సందర్శిస్తున్న డాక్టర్ వివరాలు, ల్యాబ్‌లను పరిశీలించారు. అందించే సేవలకు ఎంత ఖర్చు అవుతుందనేది పేషెంట్లు వారికి అందుబాటులో ఉన్న క్లినిక్ లేదా ఆస్పత్రులకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలుశిక్ష

వరంగల్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 21 మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ నలుగురికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 17 మందికి రూ.18,600 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ 9 మందికి రూ. 5,400 జరిమానా విధించగా, మైనర్ డ్రైవింగ్‌లో 10 మందికి రూ.5,700 జరిమానా న్యాయమూర్తి విధించారన్నారు.

అతివలదే హవా

(5వ పేజీ తరువాయి)

లక్ష మందికిపైగా సభ్యులు ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వారి పాత్ర కీలకంగా మారనున్నది. పురుష ఓటర్లలో వేల సంఖ్యలో ఉద్యోగ రిత్యా విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉంటుండగా స్వస్థలాల్లో ఉండే మహిళలే ఓటింగ్‌లో అధికంగా పాల్గొననున్నారు. గతంలో అన్ని ఎన్నికల్లో పురుషుకన్నా దాదాపు 10 నుంచి 15 శాతం అధికంగా అతివలే ఓటు వేసిన దృష్ట్యా ఈ సారి కూడా అదే పునరావృతం అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. స్వశక్తి సంఘాల నిర్వహణ, ఐకేపీ ధాన్యం కొనుగోళ్లు, చిరు వ్యాపారాల నిర్వహణలో సత్తా చాటుతున్న మహిళలు ఈ ఎన్నికల్లో తమను తాము నిరూపించుకునేందుకు ఎదురుచూస్తున్నారు. కాగా, పంచాయతీ ఎన్నికల్లో పోటీ పడనున్న సర్పంచులు, వార్డు సభ్యుల అభ్యర్థులు మహిళలను ప్రసన్నం చేసుకోవడంపైనే ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

వార్డు సభ్యుల రిజర్వేషన్ వివరాలు

మండలం	వార్డులు	ఎస్టీ జీపీలు		ఎస్టీ		ఎస్సీ		బీసీ		అ.రి.	
		మ	జ	మ	జ	మ	జ	మ	జ	మ	జ
ఆత్మకూరు	152	0	0	0	1	13	18	18	26	36	40
భీమదేవరపల్లి	232	0	0	0	0	18	22	24	33	52	54
దామెర	132	0	0	0	0	11	17	19	19	31	35
ధర్మసాగర్	185	0	0	0	1	19	27	19	27	43	50
ఎల్కతుర్తి	180	0	0	0	0	21	29	13	22	43	52
హసన్‌పర్తి	138	4	4	0	1	14	19	12	18	28	38
ఐనవోలు	170	0	0	0	1	18	25	19	21	40	46
కమలాపూర్	246	0	0	0	0	21	27	32	43	56	67
నడికూడ	138	0	0	0	0	17	20	11	21	31	38
పరకాల	94	0	0	0	0	9	15	11	12	21	26
శాయంపేట	212	4	4	1	3	14	23	25	35	47	56
వేలేరు	106	11	11	3	3	7	11	9	9	20	22
మొత్తం	19860	19	19	10	23	182	253	212	286	448	534

మ = మహిళలు   జ = జనరల్   అ.రి.- అన్ రిజర్వుడు

దళితుల జోలికి వస్తే ఊరుకునేది లేదు..

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించిన నేతలు
- దిష్టిబొమ్మ దహనానికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు



కాళోజీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

హనుమకొండ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దళితుల జోలికి వస్తే ఊరుకునేదిలేదని మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు తాటికొండ రాజయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై ఇటీవల ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు డప్పులు కొట్టుకుంటూ ర్యాలీతో వెళ్లారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడిని చేపట్టారు. ఆపై హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ నారాయణరావు విగ్రహం వద్ద ప్లకార్డులు చేతపట్టి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ గంటపాటు ఆందోళన చేపట్టారు. సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొంత మందిని పోలీసులు సుబేదారి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ.. అభివృద్ధిపై మాట్లాడితే నాయిని రాజేందర్‌రెడ్డి అహంకారపూరితంగా మాట్లాడి దళితుల మనోభావాలు దెబ్బతీసేలా అవమానించారని అన్నారు. ఇప్పటికైనా తాటికొండ రాజయ్య, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, దళిత సంఘాల నాయకులు సంకు నర్సింగరావు, ఇమ్మడి లోహిత రాజు, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ మేకల బాబురావు, కంజర్ల మనోజ్, పున్నం చందర్, కొండ్ర శంకర్, సదాంత్, కోటి, హరినాథ్, గబ్బెట శ్రీనివాస్, మర్యాల కృష్ణ, వేణు, మంద సృజన్‌కుమార్, స్నేహిత్, చక్రి పాల్గొన్నారు.

దళితుల పక్షపాతి కాంగ్రెస్

- 58వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్, నేతలు

వడ్డెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దళితుల పక్షపాతి అని 58వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, జిల్లా నేతలు తాళ్లపెల్లి రవీందర్, తాళ్లపెల్లి విజయ్ అన్నారు. సోమవారం హనుమకొండ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీలోని చర్చి జంక్షన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సంక్షేమం, దళితుల అభ్యున్నతి కోసం ఆహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ శ్రేణులు అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిపై 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్యే రాజేం దర్‌రెడ్డికి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయాలు మాని అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండల సమ్మయ్య, తాళ్లపెల్లి మేరి, నల్ల ఆశీర్వాదం, మాచర్ల చేరాలు, బి.బోస్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు సత్కారం


ఐలయ్య దంపతులను సత్కరిస్తున్న పోలీసు అధికారులు

వరంగల్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు ఐలయ్యను ఏఆర్ అడిషనల్ డీసీపీ సురేశ్‌కుమార్ ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ నాగయ్య, ఆర్ఐ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వాటర్ సంపును తొలగించాలి

కాజీపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట 62వ డివిజన్ రహ్మత్‌నగర్ సెయింట్ జాన్స్ స్కూల్ ఎదుట సాహెబ్ హుస్సేన్ అనే వ్యక్తి రోడ్డుపై తాగునీటి ట్యాప్, వాటర్ సంప్, గద్దె నిర్మించాడు. దీంతో పాటు అక్కడ ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేయడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని తొలగించాలని స్థానిక కాలనీ వాసి కుర్షిద్ అహ్మద్ సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్డుపై సాహెబ్ హుస్సేన్ రోడ్డును కబ్జాచేయడంతో ఇరుకుగా మారిందని పేర్కొన్నారు. రోడ్డు కబ్జా చేయడంతో వాహనదారులకు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులకు గురతున్నారని, రోడ్డుపై నిర్మించిన గద్దెను, వాటర్ సంపును తొలగించాలని సాహెబ్ హుస్సేన్‌కు చెపితే కాలనీ వాసులపై తిరగపడుతున్నారన్నారు. అధికారులు సంప్‌ను, గోడలను తొలగించాలని కోరారు.

ఇన్‌చార్జి పదోన్నతులు కల్పించాలి

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్‌లోని ఓ అండ్ ఎం, అకౌంట్స్ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఇన్‌చార్జి పదోన్నతులు కల్పించాలని కోరుతూ టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి సోమవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -1104 నాయకులు వినతి పత్రం అందజేశారు. సీఎండీని కలిసినవారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, డిస్కం సలహాదారుడు శేషగిరారావు, డిస్కం అధ్యక్షుడు రఘునందన్‌రావు, కార్యదర్శి వెంకటరమణరావు, అడిషినల్ కార్యదర్శి ఆరిఫోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలి


మాట్లాడుతున్న కూరపాటి రమేష్, వీరస్వామి, చందా మల్లయ్య

వడ్డెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని, అవి అమలైన తర్వాతనే గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కూరపాటి రమేష్, వరంగల్ ఉమ్మడి జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వీరస్వామి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య డిమాండ్ చేశా రు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడా రు. 42శాతం అమలు చేసిన తర్వాతనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, అప్పటి వరకు ఎన్నికలను వాయిదా వేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా జీవో నంబర్ 46ను తీసుకొచ్చి స్థానిక సంస్థల్లో పాత రిజర్వేషన్ పద్ధతి ప్రకారం ఎన్నికలను నిర్వహించేందుకు పూనుకుంటుందని పేర్కొన్నారు. దీన్ని 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసి కేంద్రంపై ఒత్తిడి పెంచి వచ్చే శీతాకాల సమావేశంలో బిల్లును పెట్టి ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పెట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఇందుకోసం బీజేపీ సైతం సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా నాయకులు మండల పరశరాములు, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి జిల్లా నేతలు మేకల సుమన్, సురేష్ గౌడ్, తెలంగాణ కొమురయ్య పాల్గొన్నారు.


కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఎస్.బాలరాజు, జి.మునీశ్వర్

వడ్డెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయీస్ ప్రభుత్వశాఖలో కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి, డిపార్ట్‌మెంటల్ హమాలీ విధానాన్ని తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీ వర్కర్స్ యూనియన్, (ఏఐటీయూసీ అనుబంధ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ అంబేద్కర్ భవన్ రోడ్డులోని గిరిజన భవన్‌లో హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రథమ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజుతో పాటు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ మాట్లాడారు. 2018 నుంచి హమాలీ చార్జీలను పెంచలేదని బస్తాకు కనీసం రూ.45కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని సివిల్ సప్లయీస్ గోదాములలో హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యూటీ కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గోదాములలో హెల్మెట్, సేఫ్టీ షూ, గ్లౌజెస్, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని కోరారు. విధి నిర్వహణలో హమాలీ కార్మికుడు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, కుక్కల మల్లయ్య, కర్రె లక్ష్మణ్, కొట్టెపాక రవి, వస్కుల భరత్, ప్రజానాట్య మండలి ప్రతినిధులు మచ్చ శంకర్, బొచ్చు నరేష్, సరిగమల సురేష్, గాడిచెర్ల బాబు, రాములు, రమేష్ , వేణు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : హన్మకొండ
Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 8519926489,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8247285199, ACM - 9985411664



యాభై ఏళ్లు దాటిన పురుషుల్లో తలెత్తే ప్రధాన సమస్య ప్రోస్టేట్ గ్రంథి వాపు. ఈ 'బినైన్ ప్రోస్టటిక్ హైపర్‌ప్లేసియా'తో వేధించే మూత్ర సంబంధ సమస్యల నుంచి విముక్తి కోసం సురక్షితమైన, సౌకర్యవంతమైన 'ప్రోస్టేట్ ఎంబొలేజేషన్' చికత్సను ఎంచుకోవాలంటున్నారు వైద్యులు

ప్రోస్టేట్ గ్రంథి వాపు

సురక్షిత చికిత్స ఇదే!

పైబడే వయసుతో అంతర్గత అవయవాల్లో చోటు చేసుకునే కొన్ని మార్పులు, ఇతరత్రా అసౌకర్యాలను తెచ్చిపెడుతూ ఉంటాయి. మరీ ముఖ్యంగా పురుషుల్లో 50 ఏళ్లు దాటిన తర్వాత మూత్రనాళాన్ని చుట్టి ఉండే ప్రోస్టేట్ గ్రంథి పరిమాణం పెరగడం మొదలుపెడుతుంది. ఇందుకు జన్యుపరమైన కారణాలతో పాటు, పురుష హార్మోన్ సంతులనం దెబ్బతినడం, మధుమేహం లాంటి ఇతరత్రా కారణాలున్నాయి. ఈ పరిస్థితి ప్రమాదకరం కాకపోయినా, పెరిగిన ప్రోస్టేట్ వల్ల మూత్రాశయం మీద ఒత్తిడి పెరిగి, మూత్ర సంబంధ అసౌకర్యాలు వేధించడం మొదలుపెడతాయి. అవేంటంటే..

- మూత్రవిసర్జన సంపూర్తిగా జరగకపోవడం
- పగలు ఎక్కువసార్లు మూత్రవిసర్జన చేయవలసి రావడం
- మూత్ర ప్రవాహం బలహీనంగా ఉండడం
- మూత్రాన్ని నియంత్రించుకోలేకపోవడం
- రాత్రివేళ మూడు నుంచి నాలుగుసార్లు మూత్ర విసర్జన చేయవలసి రావడం
- మూత్రవిసర్జన తర్వాత చుక్కలు చుక్కలుగా కారుతూ ఉండడం

పెద్ద వయస్కులు సాధారణంగా మూత్ర సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ఈ సమస్యను నిర్లక్ష్యం చేసినప్పుడు, పరిస్థితి మరింత తీవ్రమై మూత్రాశయం, మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. కాబట్టి మొదట్లోనే అప్రమత్తమవడం అవసరం. జనరల్ ఫిజీషియన్ లేదా యూరాలజిస్ట్‌ను సంప్రతించి అల్ట్రాసౌండ్‌తో ప్రోస్టేట్ పరిమాణం తెలుసుకోవాలి. అలాగే ఇదే పరీక్షతో మూత్రవిసర్జన తదనంతరం మూత్రాశయంలో ఎంత మూత్రం మిగిలిపోతుందో వైద్యులు కనిపెట్టగలుగుతారు.



అలాగే యూరోఫ్లోమెట్రీ పరీక్షతో మూత్రవిసర్జన వేగాన్ని కూడా వైద్యులు అంచనా వేయగలుగుతారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా ప్రోస్టేట్ వాపును నిర్థారించుకోవచ్చు.

తిరగబెట్టొచ్చు

సర్జరీని ఎంచుకున్నా ప్రోస్టేట్ ఎంబొలైజేషన్‌ను ఎంచుకున్నా ప్రోస్టేట్ వాపు సమస్య దీర్ఘకాలంలో తిరగబెట్టే అవకాశాలు లేకపోలేదు. అయినప్పటికీ ఎటువంటి దుష్ప్రభావాలకూ ఆస్కారం లేకుండా ఉండాలనుకుంటే ప్రోస్టేట్ ఎంబొలైజేషన్ చికిత్సను ఎంచుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం.

సర్జరీలతో సమస్యలు

సాధారణంగా ప్రోస్టేట్ పరిమాణం 20 గ్రాములు ఉంటుంది. ఇంతకంటే ఎక్కువగా కొందరికి 50, 100, 150 గ్రాముల వరకూ పెరిగిపోవచ్చు. బినైన్ ప్రోస్టటిక్ హైపర్‌ప్లేసియాను నిర్థారించుకున్న తర్వాత ఒకట్రెండు నెలల పాటు మందులు వాడుకుని, వాటితో లక్షణాలు అదుపులోకి రానప్పుడు, సర్జికల్ లేదా నాన్ సర్జికల్ చికిత్సలను ఎంచుకోవచ్చు. ట్రాన్స్ యురేత్రల్ రిసెక్షన్ ఆఫ్ ప్రోస్టేట్ అనే సర్జరీలో భాగంగా మూత్రనాళం ద్వారా ప్రోస్టేట్ గ్రంథి మధ్య భాగాన్ని పాక్షికంగా కత్తిరించి, తొలగిస్తారు. ఈ సంప్రదాయ చికిత్సా విధానం 40 ఏళ్లుగా మనుగడలో ఉంది. గ్రంథి మరీ పెద్దగా ఉన్నప్పుడు ఇతరత్రా సర్జరీల సహాయంతో లేజర్‌ను ఉపయోగించి కత్తిరించి తొలగిస్తారు. తాజాగా కొన్ని మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలు కూడా అందుబాటులోకొచ్చాయి. అయితే ఈ సర్జరీలన్నీ మూత్రనాళం ద్వారానే సాగుతాయి కాబట్టి సర్జరీ తదనంతరం కొన్ని దుష్ప్రభావాలకు కూడా ఆస్కారం ఉంటుంది. అవేంటంటే...

- మూత్రనాళంలో పూడికలు ఏర్పడే అవకాశం ఉంటుంది. వీటికి మళ్లీ ఇంకొక సర్జరీ అవసరం పడొచ్చు
- మూత్రం లీక్ అవుతూ ఉండడం
- మూత్రాన్ని ఆపులేకపోవడం
- యూరిన్ బ్యాగ్ వాడుకోవలసి రావడం
- వీర్యం బయటకు రాకుండా లోపలకు వెళ్లడం
- స్వల్ప అంగస్తంభన సమస్య

అనుభవజ్ఞులను ఎంచుకోవాలి

ప్రోస్టేట్ ఎంబొలైజేషన్ చికిత్స భద్రత, సత్ఫలితాల కోసం అనుభవమున్న వైద్యులనే ఎంచుకోవాలి. అలాగే అడ్వాన్స్‌డ్ ఇమేజింగ్ విత్ కోన్ బీమ్ సిటి సౌకర్యాన్ని కలిగి ఉండే ఆస్పత్రినే ఎంచుకోవాలి.

దుష్ప్రభావాలకు ఆస్కారం లేని సురక్షిత చికిత్స... ప్రోస్టేట్ ఎంబొలైజేషన్

యాంజియోగ్రఫీ పద్ధతిలో కాలు లేదా చేతిలోని రక్తనాళాల ద్వారా ప్రోస్టేట్‌కు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాన్ని చేరుకుని, దాన్ని మూసివేసే చికిత్స.. ప్రోస్టేట్ ఎంబొలైజేషన్. ఈ చికిత్సలో సమస్యకు కారణమైన రక్తనాళం లోపలకు చేరుకుని, ఎంబోస్ఫియర్స్ అనే పార్టికల్స్ లేదా ద్రవరూప జిగురును ఇంజెక్ట్ చేయడం జరుగుతుంది. వీటితో రక్తనాళం మూసుకుపోయి, ప్రోస్టేట్‌కు ఆక్సిజన్ ఆగిపోయి, ఆ గ్రంథి మెత్తబడి, క్రమేపీ చిన్నదైపోతుంది. ఫలితంగా సంబంధిత సమస్యలన్నీ అదుపులోకొస్తాయి. దాదాపు 15 ఏళ్లుగా అందుబాటులో ఉన్న ఈ చికిత్సకు ఎఫ్‌డిఎ అనుమతి కూడా ఉంది. అమెరికన్ యూరలాజికల్ మార్గదర్శకాలతో పాటు యుకె, యూరప్‌లోని నేషనల్ హెల్త్ సర్వీస్ మార్గదర్శకాల్లో కూడా ఈ చికిత్స అనుమతి పొందింది. కాబట్టి ఇది ప్రయోగాత్మక చికిత్స కాదనే విషయం గుర్తుపెట్టుకోవాలి. ఈ చికిత్సలో మూత్రనాళ ప్రమేయం ఉండదు కాబట్టి మూత్రనాళం దెబ్బతినే ప్రమాదం ఉండదు. కోత ఉండదు కాబట్టి రక్తస్రావ సమస్య ఉండదు. అనస్థీషియా అవసరం కూడా ఉండదు. చికిత్స ఒక్క రోజులోనే పూర్తయిపోతుంది కాబట్టి మరుసటి రోజు నుంచి పనులన్నీ చేసుకోవచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా ఇది కోత లేని సర్జరీ కాబట్టి నరాలు దెబ్బతినే ప్రమాదం ఉండదు. ఫలితంగా చికిత్స తదనంతర లైంగిక సమస్యలు తలెత్తవు. అంగ స్తంభన సమస్య ఉండదు. అలాగే సర్జరీకి భయపడే పురుషులు, సర్జరీ చేయించుకోలేని పురుషులు, వృద్ధులు, హృద్రోగులు, రక్తం పలుచబడే మందులు వాడుకునేవాళ్లు అన్ని విధాలా సురక్షితమైన ప్రోస్టేట్ ఎంబొలైజేషన్ చికిత్సను ఎంచుకోవచ్చు.

డాక్టర్ అర్జున్ రెడ్డి
చీఫ్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్,
రివియా వాస్క్యులర్ ఇన్‌స్టిట్యూట్,
గచ్చిబౌలి, హైదరాబాద్



మీకు తెలుసా?

కుడికి బదులు ఎడమ



రోజూ చేసే చిన్న చిన్న పనులకు ఆధిపత్య చేతికి బదులుగా ఆధిపత్యం లేని చేతిని ఉపయోగించడం వల్ల మెదడు చురుగ్గా మారుతుందని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయం చేపట్టిన అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే...

మన మెదడు చిన్న చిన్న సవాళ్లను ఇష్టపడుతుంది. కుడి చేత్తో పనులు చేసే అలవాటున్న వాళ్లు అవే పనులను ఎడమ చేత్తో చేయడం మొదలుపెడితే మెదడులో కొత్త నాడీ సంబంధాలు ఏర్పడతాయి. శాస్త్రవేత్తలు దీన్నే న్యూరో ప్లాస్టిసిటీ అంటూ ఉంటారు. ఇలా ఆధిపత్యం లేని చేతిని ఉపయోగించడం వల్ల మెదడు చురుకుదనం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంతులనం కూడా పెరుగుతాయి. కాబట్టి కుడి చేత్తో దంతధావనం చేసుకునేవారు ఎడమచేత్తో బ్రష్ చేసుకోవడం మొదలుపెట్టొచ్చు. నిజానికి రెండు నిమిషాల నిడివితో కూడిన దైనందిన చర్య ఇది. అయినప్పటికీ ఈ స్వల్ప సమయమే మెదడుకు వ్యాయామంగా మారి, నాడీ సంబంధాలను పెంచుతుంది.

తెలుసుకుందాం

పోషక లోపాలు... లక్షణాల రూపంలో...

పోషక లోపాలు లక్షణాల రూపంలో బయల్పడుతూ ఉంటాయనే విషయం అందరికీ తెలిసిందే! అయితే లక్షణాల ఆధారంగా పోషక లోపాలను గ్రహించే విషయంలో మనం పొరపాటు పడుతూ ఉంటాం. వాటిని కచ్చితంగా ఎలా కనిపెట్టాలంటే...

మెగ్నీషియం: కండరాల నొప్పులకు కారణం మెగ్నీషియం లోపంగా భావిస్తాం. అయితే మెగ్నీషియం లోపం ప్రధానంగా ఒక లక్షణం ద్వారా బయల్పడుతుంది. కన్ను పదే పదే అదురుతూ ఉంటే, దాన్ని మెగ్నీషియం లోపంగా పరిగణించాలి. మెగ్నీషియం 300 రకాల స్పందనలను, ప్రత్యేకించి కండరాలు, నాడుల స్పందనలను క్రమబద్ధీకరిస్తుంది.

విటమిన్ డి: ఎముకల బలహీనత ద్వారా ఈ పోషకలోపం బయల్పడుతుందని భావిస్తాం. కానీ రుతుపరమైన విచారం విటమిన్ డి లోపంగా పరిగణించాలి. విటమిన్ డి... విటమిన్ కంటే ఎక్కువగా హార్మోన్‌గా పని చేస్తూ, సెరటోనిన్ హార్మోన్‌ను క్రమబద్ధీకరిస్తుంది. కాబట్టి శరీరానికి ఎండ సోకకపోతే, సెరటోనిన్ విడుదలకు సిగ్నల్ అందక, విచారం వేధిస్తుంది



విటమిన్ బి12: శక్తి సన్నగిల్లితే విటమిన్ బి12 లోపంగా భావిస్తాం. అయితే, చేతులు, అరికాళ్లలో తిమ్మిర్లు ఈ పోషకలోపం ప్రధాన సంకేతం. బి12, కొవ్వు, ప్రొటీన్‌తో కూడిన నాడీ పైపొర అయిన మైలిన్ షీత్‌ను క్రమబద్ధీకరిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే, నాడీ సంకేతాలు గాడి తప్పి షార్ట్‌సర్క్యూట్ అవుతూ ఉంటాయి. ఫలితంగా తిమ్మిర్లు వేధిస్తాయి

ప్రొటీన్: ఈ లోపం వల్ల కండరాలు క్షీణిస్తాయని అనుకుంటాం. నిజానికి ఈ లోపం నిరంతర ఆకలి రూపంలో బయల్పడుతుంది. ప్రొటీన్ ఆకలితో ముడిపడి ఉండే గ్రెలిన్, లెప్టిన్ హార్మోన్లను నియంత్రిస్తుంది. కాబట్టి ఈ పోషకం తగ్గినప్పుడు, ఆకలి పెరుగుతుంది

జింక్: జుట్టు రాలడం ఈ పోషకలోపం ప్రధాన లక్షణం కాదు. రుచి, వాసనలను కోల్పోవడం ఈ పోషకలోపం ప్రధాన లక్షణాలు. ఇంద్రియ రిసెప్టార్లు, వ్యాధినిరోధకశక్తికీ జింక్ కీలకం. ఈ పోషకం లోపిస్తే, ఇంద్రియాలు సామర్థ్యం కోల్పోతాయి

సీజనల్ కేర్

చలికాలం వ్యాధులకు దూరంగా...



సూప్: బోన్ సూప్, వెజిటబుల్ సూప్‌లు శరీరానికి అవసరమైన ఖనిజలవణాలనూ, అమీనో ఆమ్లాలనూ సమకూర్చి, వ్యాధినిరోధకశక్తిని పెంచుతాయి.

జలుబు, జ్వరం: దంచిన వెల్లుల్లి, తేనె కలిపిన మిశ్రమం శక్తివంతమైన సహజసిద్ధ విరుగుడుగా పని చేస్తుంది. జలుబు, జ్వరం, ఇన్‌ఫెక్షన్లు వేధించినప్పుడు ఈ మిశ్రమాన్ని తీసుకుంటే వీటి నుంచి ఉపశమనం కలుగుతంది

ఉబ్బసం: వేడి పాలలో చిటికెడు పసుపు కలుపుకుని తాగడం వల్ల ఉబ్బసం, దగ్గు, జలుబుల నుంచి ఊరట కలుగుతుంది

నిమ్మరసం: పరగడుపున గోరువెచ్చని నీళ్లలో నిమ్మరసం కలుపుకుని తాగడం వల్ల విషాలు బయటకు వెళ్లిపోయి, జీర్ణశక్తి, వ్యాధినిరోధకశక్తి మెరుగవుతాయి

ముక్కు దిబ్బెడ: వేడి నీళ్లలో యూకలిప్టస్, పెప్పర్‌మింట్ నూనెలు కలిపి ఆవిరి పడితే, ముక్కు దిబ్బెడ వదులుతుంది. శ్వాసకోస నాళాలు తెరుచుకుని, శ్వాస ఇబ్బంది సమస్య తొలగిపోతుంది.

వైద్య సంచలనం

జీన్ థెరపీకి తలవంచుతున్న అరుదైన వ్యాధి

కొన్ని అరుదైన జన్యు వ్యాధులు అర్థాంతరంగా జీవితాన్ని అంతం చేస్తాయి. అలాంటివాటిలో హంటర్ సిండ్రోమ్ ఒకటి. ప్రత్యేకించి బాలలను మాత్రమే ప్రభావితం చేసే ఈ రుగ్మత తాజాగా ప్రయోగాత్మక జన్యు చికిత్సకు తలవంచినట్టు తేలింది. ఈ చికిత్స గురించిన ఆసక్తికరమైన వివరాలు...

ప్రధానంగా మగపిల్లలనే ప్రభావితం చేసే హంటర్ సిండ్రోమ్, నెమ్మదిగా శరీరంలో శోషించుకోడానికి వీల్లేని పదార్థాలను నింపేసి మరణానికి చేరువ చేస్తుంది. పుట్టిన రెండేళ్ల తర్వాత లక్షణాలను కనబరిచే ఈ రుగ్మత 20 ఏళ్ల వయసులోపు లేదా అంతకంటే పిన్న వయసులోనే ప్రాణాలను తీస్తుంది. సాధారణంగా శరీరం కణాల్లోని వ్యర్థాలను తొలగించుకోవడం కోసం, శుభ్రపరిచే పనిముట్లను పోలిన ప్రత్యేకమైన ఇంజైమ్స్‌ను ఉపయోగించుకుంటుంది. తప్పుడు జన్యువు మూలంగా హంటర్ సిండ్రోమ్‌లో ఐడిఎస్ అనే ఒక ఎంజైమ్ తయారు కాదు. ఈ ఎంజైమ్ లేకుండా, చక్కెరను పోలిన పరమాణువులు శరీరంలోని భిన్న అవయవాల్లో పేరుకుపోయి, భిన్నమైన సమస్యలను తెచ్చిపెడతాయి. క్రమేపీ ముఖకవళికలు మారిపోతాయి. పిల్లల ఎత్తు పెరగడం ఆగిపోతుంది. కీళ్లు బిగుసుకుపోతాయి. వినికిడి కోల్పోతారు. గుండె, శ్వాస సమస్యలు తలెత్తుతాయి. వీటికి తోడు మెదడు దెబ్బతిని నేర్పరితనం తగ్గిపోతుంది. ఇలాంటి హంటర్ సిండ్రోమ్‌కు గురైన ఆలివర్ చూ అనే రెండేళ్ల పిల్లాడికి క్లినికల్ ట్రయల్‌లో భాగంగా వైద్యులు తయారుకాని ఎంజైమ్‌ను ఉత్పత్తి చేయగలిగేలా, జన్యుమార్పిడి చేసిన మూల కణాలను ఇంజెక్షన్ రూపంలో ఇవ్వడం జరిగింది.

మూల కణ చికిత్సతో...


2024 డిసెంబరులో, మాంచెస్టర్‌లో ఆలివర్ నుంచి మూల కణాలను సేకరించి, వాటిని లండన్‌లోని గ్రేట్ ఆర్మండ్ స్ట్రీట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ, మార్పు చేసిన వైరస్‌లోకి ఐడిఎస్ జన్యువును చొప్పించారు. ఈ జన్యువు, రక్తం, మెదడుల అవరోధాన్ని దాటుకుని ప్రయాణించగలిగే ఎంజైమ్‌ను ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆలివర్‌కు, పన్నెండున్నర కోట్ల మార్పు చెందిన మూలకణాలతో కూడిన రెండు ఇంజెక్షన్లను ఇవ్వడం జరిగింది. చికిత్స పూర్తయిన మూడు నెలల నుంచి ఆలివర్‌లో మెరుగుదల లక్షణాలు కనిపిస్తున్నట్టు వైద్యులు కనిపెట్టారు. ఆలివర్ కదలికలు పెరిగినట్టు బాబు తల్లితండ్రులు పేర్కొనడం, వారు చెప్పినట్టే, పిల్లాడికి చేపట్టిన పరీక్షల్లో బాబు శరీరం, సొంత ఎంజైమ్స్ ఉత్పత్తి చేసుకుంటున్నట్టు ఫలితాల్లో తేలడంతో, ప్రతివారం ఇవ్వవలసిన ఎంజైమ్ ఇన్‌ఫ్యూషన్స్‌ను వైద్యులు నిలిపివేశారు. చికిత్స మొదలుపెట్టిన తొమ్మిది నెలలకు, గత ఆగస్టులో చేపట్టిన పరీక్షల్లో ఆలివర్, సాధారణ మోతాదు కంటే కొన్ని వందల రెట్లు ఎంజైమ్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నట్టు తేలింది. ఏడాది తర్వాత ఆలివర్, మాటలు, కదలికలు, తెలివితేటల పరంగా మెరుగుపడినట్టు వైద్యులు కనిపెట్టి, ఇందుకు జన్యు చికిత్స తోడ్పడినట్టు నిర్థారించారు.

మరికొన్ని జన్యువ్యాధులకు...

సాధారణంగా ఈ చికిత్స తీసుకున్న పిల్లలను కనీసం రెండేళ్ల పాటు వైద్యులు పర్యవేక్షించి, జన్యు చికిత్స ప్రభావాన్ని నిర్థారిస్తారు. తాజా విజయంతో ఇదే తరహా చికిత్సను హర్లర్ సిండ్రోమ్, శాన్‌ఫిప్పో సిండ్రోమ్‌లాంటి మరికొన్ని జన్యుపరమైన వ్యాధులకు ఉపయోగించే దిశగా వైద్యులు సన్నాహాలకు పూనుకుంటున్నారు.



సైకాలజీ



ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి, ఆందోళనలు అత్యంత సహజం. అయితే వీటికి విరుగుడుగా ఆశ్రయించే మార్గాలు సమస్యను పరిష్కరించేలా ఉండాలే తప్ప మరింత జటిలం చేసేలా ఉండకూడదు. మరీ ముఖ్యంగా ఒత్తిడిని ప్రారంభంలోనే చిత్తు చేయాలే తప్ప ముదిరి మానసిక సమస్యలకు దారి తీసేవరకూ తాత్సారం చేయకూడదు అంటున్నారు మానసిక వైద్యులు

ఒత్తిడిని చిత్తు చేయకపోతే

పరీక్ష ముందు ఒత్తిడే లేకపోతే అందుకు తగ్గట్టు సిద్ధపడం. కాబట్టి ప్రతి ఒక్కరికీ ఎంతో కొంత ఒత్తిడి అవసరమే! అయితే ఒత్తిడి మన సామర్థ్యాన్ని పెంచి ప్రయోజనాన్ని అందించేలా ఉండాలి. ఆందోళనకు దారి తీసి జీవితంలో వెనకపడేలా చేయకూడదు. అయితే ఒక్కోసారి ఒత్తిడి పెరగడం వల్ల నిద్రలేమి, భావోద్వేగాలు అదుపుతప్పడం, అలసట, ఒంటి నొప్పులు, పనిసామర్థ్యం తగ్గడం, అవసరానికి మించి కష్టపడవలసి రావడం లాంటి ఇబ్బందులన్నీ ఉంటాయి. ఒత్తిడి వల్ల వ్యాధినిరోధకశక్తి తగ్గి తేలికగా అస్వస్థతకు గురవుతూ ఉంటా రు. అయినప్పటికీ రోజువారీ పనులు చేసుకోవడంలో ఎలాంటి ఇబ్బందీ ఎదురవ్వదు. ఈ దశ దాటి ఆందోళన, మానసిక కుంగుబాటు సమస్యలు మొదలై, వృత్తిపర, వ్యక్తిగత సమస్యలు తలెత్తుతాయి. పనిలో నాణ్యత లోపించడంతో పాటు, కుటుంబంలో కీచులాటలు మొదలవుతాయి. గుండెదడ, చమటలు పట్టడం, తీవ్రమైన ప్యానిక్ అటాక్స్ లక్షణాలు కనిపిస్తాయి. అసిడిటీ, అధిక రక్తపోటు, అధిక మధుమేహం సమస్యలు మొదలవుతాయి. ఈ పరిస్థితి జీవన నాణ్యతను దెబ్బతీస్తుంది. కాబట్టి ఒత్తిడికి లోనవుతున్నట్టు గుర్తించిన వెంటనే దాన్ని వదిలించుకునే ఆరోగ్యకరమైన మార్గాల కోసం అన్వేషించాలి.

ఒత్తిడి ఇలా దూరం

ఒత్తిడికి మూల కారణంతో వ్యవహరించే విధానం మీదే ఒత్తిడి ప్రభావం ఆధారపడుతుంది. ఒత్తిడిని అంగీకరించడం, మార్చుకోవడం, తప్పించుకోవడం... ఈ మూడు సూత్రాలను ఎవరికి తగ్గట్టు వారు అనుసరించాలి. తప్పించుకోగలిగే ఒత్తిడిలు కొన్ని ఉంటాయి. మార్చుకునే వీలుండేవి కొన్ని ఉంటాయి. కానీ అంగీకరించి తదనుగుణంగా నడుచుకోవడం మినహా మరేమీ చేయలేని ఒత్తిడిలు కూడా ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో ప్రాణాయామం, ధ్యానం, వ్యాయామాలతో ఒత్తిడిని వదిలించునే ప్రయత్నాలు చేయాలి. పెంపుడు జంతువులతో సమయాన్ని గడపడం, ఆప్తులతో బాధలు పంచుకోవడం, అభిరుచులకు సమయం కేటాయించడం, నచ్చిన పనులు చేయడం ద్వారా కూడా ఒత్తిడిని వదిలించుకోవచ్చు. అలాగే పరిస్థితులను మన నియంత్రణలోకి తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. నియంత్రణలో లేని వాటిని అంగీకరించి ఒత్తిడికి లోనవకుండా రిలాక్సేషన్ టెక్నిక్స్ అనుసరించాలి.

చికిత్స తప్పనిసరి

ఒత్తిడి, యాంగ్జయిటీ డిజార్డర్‌గా మారినప్పుడు తప్పనిసరిగా చికిత్స తీసుకోవాలి. విపరీతమైన ఒత్తిడితో మెదడులో న్యూరోట్రాన్స్ మీటర్ల పనితీరులో కూడా హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటాయి. కాబట్టి మందులతో మొదట ఆ హెచ్చుతగ్గులను సరిదిద్దుకుని, ఒత్తిడితో వ్యవహరించగలిగే మెలకువలు అలవరుచుకోవాలి.

గంజాయి అలవాటును ఇలా కనిపెట్టొచ్చు

- కళ్లు ఎర్రబడతాయి
- గంజాయి వాసన అంటిపెట్టుకుని ఉంటుంది
- గంజాయి దొరకనప్పుడు కోపం, చికాకుకు లోనవుతూ ఉంటారు
- గదులకే పరిమితమవుతూ ఉంటారు
- కళ్లలోకి సూటిగా చూడలేకపోవడం
- చదువులో, వృత్తిలో వెనకబడడం

గాడి తప్పే మార్గాలు

కొందరు ఒత్తిడిని వదిలించుకోవడం కోసం దురలవాట్లకు దగ్గరవుతారు. మద్యం, ధూమపానం, గంజాయిలతో ఒత్తిడిని వదిలంచుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఇంకొందరు ఆ మార్గాన్ని ఆహారంలో వెతుక్కుని ఈటింగ్ డిజార్డర్‌కు లోనవుతారు. ధూమపానం, మద్యపానం, గంజాయి విషయానికొస్తే, ఎలాంటి దురలవాట్లలో అయినా ఫిజికల్ డిపెండెన్స్, సైకలాజికల్ డిపెండెన్స్ అనే రెండు సమస్యలుంటాయి. మద్యం, ధూమపానం మానుకున్నప్పుడు, వణుకు, నిద్రలేమి, చమటలు పట్టడం లాంటి భౌతిక లక్షణాలు కనిపిస్తాయి. కానీ గంజాయిలో మానసిక లక్షణాలు మినహా ఎలాంటి భౌతిక లక్షణాలూ కనిపించవు కాబట్టి ఈ అలవాటు సురక్షితమైనదనే ప్రచారం సాగుతోంది. కానీ నిజానికి గంజాయిలో సైకలాజికల్ డిపెండెన్స్ ఎక్కువ. చికాకు, కోపం, దుందుడుకుతనం, గంజాయి తీసుకోవాలనే బలమైన కోరికకు లోనవడం, అందుకోసం ఎంతకైనా తెగించడం లాంటి తీవ్రమైన మానసిక లక్షణాలుంటాయి. దాని కోసం నేరాలకు కూడా పాల్పడతారు. ఎదుటివారి మీద దాడులకు తెగబడడానికి, హాని కలిగించడానికి కూడా వెనకాడరు. మద్యపానం, ధూమపానం మానేసినప్పుడు తలెత్తే భౌతిక లక్షణాలను చికిత్సతో సరిచేసే వీలుంది. కానీ గంజాయి సంబంధిత మానసిక లక్షణాలకు చికిత్స సంక్లిష్టమవుతుంది. అలాగే కొందరు దుర్బలుల్లో గంజాయి అలవాటు, జన్యుపరమైన మార్పులకు దారి తీసి, స్కిజోఫ్రేనియా అనే ప్రధాన మానసిక సమస్యకు లోను చేస్తుంది. ఈ అలవాటును వదిలించడం కోసం మోటివేషన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ థెరపీలో భాగంగా కౌన్సెలింగ్ సెషన్స్, డిఅడిక్షన్ చికిత్సలు తీసుకోవాల్సి ఉంటుంది.

డాక్టర్ సుధారాణి
ప్రొఫెసర్ అండ్ హెచ్ఒడి,
గవర్నమెంట్ హాస్పిటల్ ఫర్ మెంటల్ కేర్,
ఎర్రగడ్డ, హైదరాబాద్



బాలీవుడ్ హీమ్యాన్ ఇక లేరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోదీ తదితరులు సామాజిక మాధ్యమాల ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ధర్మేంద్రను ఆయన కుటుంబసభ్యులు అక్టోబరు 31న ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చేర్పించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆయన చనిపోయారంటూ సామాజిక మాధ్యమాల్లో వదంతులు వైరల్ అయ్యాయి. అయితే.. ధర్మేంద్ర ఆరోగ్యం కుదురుగానే ఉందని, అసత్య ప్రచారాలు నమ్మొద్దని ఆయన కుటుంబసభ్యులు ఆ సమయంలో అందరికీ విజ్ఞప్తి చేశారు. నవంబరు 12న.. వైద్యులు ఆయనను ఇంటికి తరలించి చికిత్సను కొనసాగించారు. డిసెంబరు 8వ తేదీ ధర్మేంద్ర పుట్టినరోజు కావడం.. ఆయన 90వ పడిలో అడుగు పెట్టనుండడంతో కుటుంబసభ్యులు జన్మదిన వేడుకలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అంతలోనే ఇలా జరగడం వారిని శోకసంద్రంలో ముంచివేసింది.

ఆరున్నర దశాబ్దాల కెరీర్..

పంజాబ్‌లోని ఓ మారుమూల గ్రామంలో పుట్టిన ధర్మేంద్ర.. చిన్నప్పటి నుంచీ సినిమాలపై ఆసక్తిగా ఉండేవారు. ఈ క్రమంలోనే.. నూతన ప్రతిభావంతులను వెలుగులోకి తెచ్చేందుకు ఫిలింఫేర్ మ్యాగజైన్ జాతీయస్థాయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో



2022 డిసెంబరు 8న బర్త్‌డే కేకు కట్‌చేస్తున్న ధర్మేంద్ర (ఫైల్)

పాల్గొని విజేతగా నిలిచి ముంబైకి చేరుకున్నారు. 1960లో ఆయన కల.. 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' చిత్రంతో నెరవేరింది. అయితే ఆ సినిమా అంత బాగా ఆడలేదు. 1961లో వచ్చిన 'షోలా ఔర్ షబ్నమ్' ఆయనకు తొలి వాణిజ్య విజయాన్ని సాధించి పెట్టిన సినిమా. అలాదాదాపు 65 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన 300కు పైగా చిత్రాల్లో నటించారు. 'ఆంఖేన్', 'సావన్ ఝూమ్ కీ', 'అనుపమ', 'అన్‌పఢ్', 'మేరా గావ్ మేరా దేశ్', 'సీతా ఔర్ గీత', 'షోలే', 'ధర్మ వీర్', 'సత్యకామ్', 'చుప్కే చుప్కే', 'ఫూల్ ఔర్ పత్థర్' తదితర చిత్రాల్లో తన అద్భుతమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. తెలుగులో కృష్ణ, కృష్ణంరాజు నటించిన 'అడవి సింహాలు' చిత్రాన్ని హిందీలో 'జానీ దోస్త్' పేరుతో ధర్మేంద్ర, జితేంద్ర హీరోలుగా నిర్మించారు. ఈ రెండు చిత్రాల షూటింగ్స్ ఏకకాలంలో జరగడం విశేషం.. షాహిద్ కపూర్, కృతి సనన్ నటించిన 'తేరీ బాతోమే ఐసా ఉల్జా జియా'తో చివరిసారిగా వెండితెరపై కనిపించారు. ఆయన నటించిన చివరి చిత్రం 'ఇక్కీస్' విడుదలకు సిద్ధంగా ఉంది. ఆయన నటించిన ఆల్‌టైమ్ క్లాసిక్ 'షోలే' 50 ఏళ్ల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబరు 12న రీ రిలీజ్ అవుతోంది. 1935లో జన్మించిన ఆయన.. 1952లో ప్రకాశ్ కౌర్‌ను పెళ్లి చేసుకున్నారు ధర్మేంద్ర. వారి సంతానం.. సన్నీ డియోల్, బాబీ డియోల్, విజేత, అజీత. అయితే.. ధర్మేంద్ర 1980లో హేమమాలినిని రెండో వివాహం చేసుకున్నారు. వారికి ఈషా డియోల్, అహానా డియోల్ జన్మించారు. కథానాయకుడిగా దశాబ్దాలపాటు వెండితెరను ఏలిన ధర్మేంద్ర రాజకీయాల్లోకీ అడుగుపెట్టారుగానీ.. ఆట్టేకాలం కొనసాగలేదు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన బీజేపీ రాజస్థాన్‌లోని బికనీర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. తర్వాత మళ్లీ రాజకీయాల జోలికి పోలేదు.

ఇథియోపియాలో పేలిన అగ్నిపర్వతం..
భారత్ నుంచి విమానాలు రద్దు

- సుమారు 15 కిలోమీటర్ల ఎత్తు వరకు బూడిద
- అరేబియా మీదుగా భారత్ వైపు బూడిద మేఘాలు
- జాగ్రత్తగా ఉండాలని విమానయాన సంస్థలకు హెచ్చరికలు జారీ చేసిన డీజీసీఏ

న్యూఢిల్లీ/శంషాబాద్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా ఖండం ఈశాన్య ప్రాంతంలోని ఇథియోపియాలో సుమారు 12 వేల ఏళ్లుగా నిద్రాణంగా ఉన్న హేలి గుబ్బి అగ్నిపర్వతం ఒక్కసారిగా బద్దలైంది. దానికి ముందు ఆ ప్రాంతంలో 4.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. అగ్ని పర్వత విస్ఫోటంతో వాతావరణంలో 15 కిలోమీటర్ల ఎత్తులోకి పెద్ద ఎత్తున బూడిద, దట్టమైన పొగలను ఎగజిమ్మింది. దట్టమైన బూడిద మేఘాలు యెమెన్, ఒమన్, అరేబియా సముద్రం, పాకిస్థాన్ మీదుగా భారత్‌వైపు కదులుతున్నాయి. సోమవారం రాత్రి భారత్‌లోకి ప్రవేశించాయి. బూడిద మేఘాలు, పొగ కమ్ముకోవడంతో.. భారత్ నుంచి గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లాల్సిన పలు విమానాలు రద్దయ్యాయి. మరికొన్నింటిని దారి మళ్లించారు. ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల మీదుగా ఈ బూడిద, ధూళి మేఘాలు చైనా వరకు విస్తరించవచ్చని అంతర్జాతీయ వాతావరణ విభాగాలు అంచనా వేశాయి. ఈ క్రమంలో బూడిద మేఘాలు కమ్ముకున్న ప్రాంతాల నుంచి ప్రయాణించవద్దంటూ విమానయాన సంస్థలకు డీజీసీఏ అత్యవసర సూచనలు జారీ చేసింది.



హేలి గుబ్బి అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద

వరుసగా విమానాల రద్దు, దారి మళ్లింపు..

బూడిద మేఘాలు, దట్టమైన పొగ కారణంగా పలు విమానాలు రద్దు చేస్తున్నట్టు ఆకాశ ఎయిర్, ఇండిగో, కేఎల్‌ఎం తదితర సంస్థలు ప్రకటించాయి. సోమవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఖతార్‌లోని దోహా వెళ్లాల్సిన 6ఈ 1315 ఇండిగో విమానం రద్దయింది. 158 ప్రయాణికులు, సిబ్బంది విమానంలోకి ఎక్కి, అంతా సిద్ధమయ్యాక దానిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించి, అందరినీ కిందకు దింపారు. ఇక దోహా నుంచి శంషాబాద్‌కు రావాల్సిన 6ఈ 1316 విమాన సర్వీసును కూడా రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. కేరళలోని కన్నూర్ నుంచి అబుధాబికి బయలుదేరిన 6ఈ 1433 ఇండిగో విమానాన్ని మధ్యలోనే అహ్మదాబాద్‌కు మళ్లించారు. సోమ, మంగళవారాల్లో జెడ్డా, కువైట్, అబుధాబి వెళ్లే, తిరిగొచ్చే విమానాలను రద్దు చేస్తున్నట్టు ఆకాశ ఎయిర్ ప్రకటించింది.

చిత్రజ్యోతి
SINCE 1965

ఒక సినిమా.. రెండేళ్ల ప్రయాణం!



'కార్తికేయ 2' చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన యువ కథానాయకుడు నిఖిల్ 20వ చిత్రం 'స్వయంభు'. ఈ హిస్టారికల్ యాక్షన్ ఎపిక్‌కు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. 'రెండేళ్ల ప్రయాణం.. 170 రోజుల షూటింగ్ తర్వాత ఈ మహత్తర చిత్రీకరణ పూర్తయింది' అంటూ హీరో నిఖిల్ చేత చెప్పించి ఓ వీడియో విడుదల చేశారు నిర్మాతలు భువన్, శ్రీకర్. 'మన భారతదేశ చరిత్రకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అవి రాజుల కథలో, యుద్ధ గాథలో కాదు.. మన సంస్కృతికి పునాదులు. ఆ చరిత్రలో చెప్పని ఓ గొప్ప వీరుడి కథే ఈ చిత్రం' అని ఆ వీడియోలో నిఖిల్ పేర్కొన్నారు. వచ్చే ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 13న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్ర సమర్పకుడు ఠాగూర్ మధు చెప్పారు.

అరుదైన గౌరవం



తమిళ అగ్ర నటుడు అజిత్ కుమార్‌కు అరుదైన గౌరవం దక్కింది. చిత్రపరిశ్రమలో నటుడుగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ప్రొఫెషనల్ కార్ రేసర్‌గానూ రాణిస్తున్నారు. ఈ రంగంలో ఆయన సాధించిన విజయాలకు గుర్తింపుగా ఇటలీ ప్రతిష్ఠాత్మక 'జెంటిల్మెన్ డ్రైవర్ ఆఫ్ ది ఇయర్ 2025' పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇటలీలోని వెనిస్ నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఫిలిప్ చారియోల్ మోటార్‌స్పోర్ట్స్ గ్రూపు ఈ పురస్కారాన్ని అందించింది. అంతర్జాతీయ కార్ రేసింగ్ ట్రాక్‌లో భారతదేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసినందుకుగాను ఈ అవార్డు వరించింది. దీన్ని జీటీ రేసింగ్‌లో ప్రపంచ అగ్రగామిగా ఉన్న ఎస్‌ఆర్‌వో మోటార్‌స్పోర్ట్స్ గ్రూపు సీఈవో స్టెఫాన్ రాటెల్.. అజిత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అజిత్ సతీమణి షాలిని, వారి ఇద్దరు పిల్లలు కూడా పాల్గొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

బాలయ్య నట విశ్వరూపాన్ని చూస్తారు

రామ్, లక్ష్మణ్



"అఖండ'కి మించిన అంచనాలు 'అఖండ 2'పై ఉన్నాయి. మొదటి భాగంలో బాలకృష్ణగారి పాత్రను పరిచయం చేశారు. 'అఖండ 2'లో డైరెక్టర్ బోయపాటిగారు బాలయ్య నట విశ్వరూపాన్ని చూపించనున్నారు. భగవంతుడి శక్తిని తీసుకున్న హీరో ప్రాతని ఢీకొనాలంటే ప్రత్యర్థి క్యారెక్టర్ కూడా అంతే ధృడంగా ఉండాలి. అలాంటి ప్రతి నాయకుడి పాత్రలో ఆది పినిశెట్టి అద్భుతంగా నటించారు' అని అన్నారు ఫైట్ మాస్టర్స్ రామ్- లక్ష్మణ్. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను రూపొందించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. సినిమా డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్ -లక్ష్మణ్ చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'గన్‌ని త్రిశూలంతో ఆపరేట్ చేసే సన్నివేశాన్ని ట్రైలర్‌లో చూసే ఉంటారు. సాధారణంగా గన్ కే ఒక పవర్ ఉంటుంది. ఆ గన్‌కి త్రిశూలం పవర్, శివుని శక్తి తోడైతే ఎలా ఉంటుందనే కోణంలో పోరాటాలను చిత్రీకరించాం. ఓంకారం శక్తి, శివశక్తిని గుండెల్లో నింపుకుంటే జీవితం ఎంత ఆనందంగా, అద్భుతంగా ఉంటుందనే విషయాన్ని డైరెక్టర్ బోయపాటి అద్భుతంగా తెరకెక్కించారు. బాలకృష్ణగారికి అభిమానులకు రియల్‌గా కనిపించాలనే తపన ఉంటుంది. ప్రతీ షాట్‌ని డూప్ లేకుండా ఆయనే చేశారు. ఎందుకంటే ఈ క్యారెక్టర్ అటువంటిది. ఈ సినిమాలో మూడు భిన్నమైన పాత్రలకు సంబంధించిన పోరాట సన్నివేశాలుంటాయి. ఎక్కడా బోర్ కొట్టకుండా ఆ సన్నివేశాలు ఆద్యంతం అలరిస్తాయి' అని చెప్పారు.

కలెక్షన్స్ భారీగా వస్తున్నాయి

"రాజు వెడ్స్ రాంబాయి' సినిమా మేము ఊహించినదాని కంటే పెద్ద విజయాన్ని సాధిస్తోంది. కొన్ని సినిమాలకు కలెక్షన్స్ చెప్పలేం. కానీ ఈ సినిమాకు మాత్రం వసూళ్లు చెప్పాలని అనిపించింది' అని అన్నారు నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి. అఖిల్‌రాజ్, తేజస్విని జంటగా సాయిలు కంపాటి తెరకెక్కించిన చిత్రమిది. వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవీ నిర్మించారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బేనర్లపై బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేశారు. ప్రేక్షకుల ముందుకు ఇటీవలె వచ్చిన ఈ సినిమా భారీ వసూళ్లతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బన్నీ వాస్ మాట్లాడుతూ 'మూడు రోజుల్లో ఈ సినిమాకు రూ.7.28 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు దక్కాయి. వీటిలో కేవలం నైజాం నుంచే ఐదు కోట్ల రెండు లక్షలు వసూలు అయ్యాయి. తెలంగాణలోని మల్టీప్లెక్స్‌ల కంటే సింగిల్ స్క్రీన్స్ నుంచే ఎక్కువ కలెక్షన్లు వచ్చాయి. ఐ బొమ్మ క్లోజ్ అవడం, టికెట్‌కు రూ.99 ధర పెట్టడం కూడా మా కలెక్షన్లు పెరిగేందుకు కలిసొచ్చింది' అని చెప్పారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ 'మా పెట్టుబడికి నాలుగు రెట్ల లాభం వస్తుందని ఆశిస్తున్నాం. ఏపీతో పోల్చితే నైజాంలో కలెక్షన్స్ ఎక్కువగా ఉన్నాయి. మల్టీప్లెక్స్‌తో పాటు బీ, సీ సెంటర్లలో కూడా కలెక్షన్స్ బాగున్నాయి. టికెట్ రేటుని రూ.99గా ఫిక్స్ చేసుకుంటేనే సింగిల్ స్క్రీన్స్ కళకళ లాడతాయి. లేదంటే మూసివేయాల్సిన పరిస్థితులున్నాయి' అని అన్నారు.



బన్నీ వాస్, వంశీ నందిపాటి



బాలీవుడ్ తొలి యాక్షన్ హీరో



ఆ తరం అమ్మాయిలకు ఆయన కలల రాకుమారుడు. 'హీ మ్యాన్' అని నాటి యువతరం ప్రశంసలు అందుకొన్న ధర్మేంద్ర పూర్తి పేరు ధర్మేంద్ర కేవల్ కిషన్ డియోల్. నటుడు, నిర్మాత మాత్రమే కాకుండా రాజకీయ వేత్తగానూ పలువురి ప్రశంసలు అందుకొన్నారు. ఆరున్నర పదుల తన నటజీవితంలో 300కు పైగా చిత్రాల్లో నటించి అందగాడుగా, కమర్షియల్‌గా సక్సెస్ అయిన హీరోగా గుర్తింపు పొందారు. చిత్ర పరిశ్రమలో తనకు గాడ్‌ఫాదర్ అంటూ ఎవరూ లేకపోయినా నట వారసులే కాదు బయటి నుంచి వచ్చిన వారు కూడా హీరోలుగా రాణించగలరు అని నిరూపించారు ధర్మేంద్ర. తాను హీరోగా పరిశ్రమలో మంచి పొజిషన్ సంపాదించుకోవడమే కాకుండా తన కుటుంబం నుంచి మరికొందరు పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తిగా నిలిచారు ధర్మేంద్ర. తన కుమారులు సన్నీ డియోల్, బాబీ డియోల్, కుమార్తెలు ఈషా డియోల్, అహనా డియోల్ కూడా సినిమాల్లో తండ్రి వారసత్వం కొనసాగిస్తున్నారు.

19 ఏళ్లకే పెళ్లి

ధర్మేంద్ర 1935 డిసెంబర్ 8న పంజాబ్‌లోని లూథియానా జిల్లా నస్రాలీ గ్రామంలో జన్మించారు. 1952లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 19 ఏళ్లకు ప్రకాశ్ కౌర్‌ను పెళ్లి చేసుకున్నారు. కెరీర్ ఆరంభంలో చిన్న పాత్రల్లో నటించారు ధర్మేంద్ర. ఆయన నటించిన తొలి చిత్రం 'దిల్ భీ తేరా హమ్ భీ తేరే' 1960లో విడుదల అయింది. 'ఆయే మిలన్ కీ బేలా', 'ఫూల్ ఔర్ పత్థర్', 'ఆయే దిన్ బహార్ కే' వంటి చిత్రాలతో 60ల దశకంలోనే ఆయనకు మంచి గుర్తింపు వచ్చింది. 1960-80 మధ్య కాలంలో హీరోగా ఓ వెలుగు వెలిగారు. 'ఆంఖేన్', 'షికార్', 'సావన్ ఝూమ్ కీ', 'బందినీ', 'అనుపమ', 'అన్‌పఢ్', 'జీవన్ మృత్యు', 'మేరా గావ్ మేరా దేశ్', 'సీతా ఔర్ గీత', 'రాజా జానీ', 'జుగ్ను', 'యాదోంకి బారాత్', 'దోస్త్', 'షోలే', 'చరస్', 'ధర్మ వీర్' వంటి చిత్రాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. 1973 ఆయన కెరీర్‌లోనే లక్కీ ఇయర్. ఆయన నటించిన ఎనిమిది చిత్రాలు బ్లాక్‌బస్టర్లు అయ్యాయి. 1987లో వరుసగా ఏడు సూపర్ హిట్స్ అందుకున్నారు ఆయన. ఇవి కాకుండా ఒకే ఏడాది తొమ్మిది హిట్ చిత్రాలు.. ఇలా రికార్డుల మీద రికార్డులు నెలకొల్పుతూ సాటి హీరోలకు అందనంత దూరంగా ఉండేవారు ధర్మేంద్ర. ఇప్పటికీ ఆ రికార్డ్స్ ధర్మేంద్రకే సొంతం. ఆ రోజుల్లో మూడు, నాలుగు షిఫ్టుల్లో పని చేస్తూ బిజీగా ఉండేవారు.

అమితాబ్‌కు మాట సాయం



తొలినాళ్లలో ధర్మేంద్రతో అమితాబ్ 'షోలే' చేస్తున్న సమయమది. ఈ చిత్రం షూటింగ్ కోసం ధర్మేంద్రతో పాటు అమితాబ్ కూడా బెంగుళూరులో ఉండాల్సిన పరిస్థితి. అయితే అమితాబ్ బెంగుళూరులో ఉండడంతో బొంబాయిలో చాలా సినిమాల చిత్రీకరణలు ఆగిపోయాయి. ఈ విషయాన్ని దర్శకుడు రమేశ్ సిప్పీకు చెబితే, 'ధర్మేంద్ర కేవలం మీ కోసం రెండు మూడు సినిమాలు రద్దు చేసుకుని వచ్చారు. ఆయన ఏమైనా అనుకుంటాడేమో... వెళ్లి అడుగు' అని రమేశ్ సిప్పీ అన్నారు. కానీ అప్పటికే సూపర్‌స్టార్ హోదాలో ఉన్న ఆయనకు ఈ విషయాన్ని చెప్పాలంటేనే సందేహిస్తున్నారు. నిర్మాతల బలవంతం మీద అమితాబ్.. 'మీరు వెళ్లమంటే బొంబాయి వెళ్లి మా నిర్మాతల పని పూర్తి చేస్తాను' అని ధర్మేంద్రను అడిగారు. ఆయన 'దానికేముంది.. ఇక్కడ పనిలేకపోతే వెళ్లండి.. నాకేం అభ్యంతరం లేదు' అని బదులిచ్చారు.

హేమతో ప్రేమ.. పెళ్లి



బాలీవుడ్‌లోని ఐకానిక్ ప్రేమ జంటల్లో ఒకటిగా ధర్మేంద్ర, హేమమాలిని గుర్తింపు తెచ్చుకున్నారు. 'తూ హసీనా మై జవాన్ తూ' చిత్రంతో రీల్ లైఫ్‌లో మొదలైన వారి అనుబంధం.. రియల్ లైఫ్ వరకూ సాగింది.. మరోవైపు నటులు సంజీవ్ కుమార్, జితేంద్ర హేమమాలిని వెంట పడేవారు. కానీ ఆమె మాత్రం ధర్మేంద్రకే మనసిచ్చారు. 'తూ హసీనా మై జవాన్ తూ' లీడ్ పెయిర్‌గా నటించిన ఈ ఇద్దరూ చిత్రీకరణ పూర్తయ్యేసరికి ప్రేమలో పడ్డారు. 'అయితే ప్రేమలో పడినంత సులభంగా వారి పెళ్లి జరగలేదు. హేమమాలినితో ప్రేమలో పడే సమయానికే ధర్మేంద్రకు ప్రకాశ్‌కౌర్‌తో పెళ్లై నలుగురు సంతానం ఉండేవారు. వారే సన్నీ డియోల్, బాబీ డియోల్, విజేత, అజీత. అలానే అప్పటికే పెళ్లైన వ్యక్తితో జీవితం ఎలా పంచుకుంటావు అని హేమమాలిని తల్లిదండ్రులు ఈ పెళ్లికి ససేమిరా అన్నారు. దాదాపు ఐదేళ్లు ప్రేమించుకున్నాక, వివాహం చేసుకుందాం అనే సమయానికి ప్రకాశ్ కౌర్ విడాకులకు అంగీకరించలేదు. అయినా అన్ని అడ్డంకులు దాటుకుని ప్రేమించుకున్న ఏడేళ్లకు వారు ఏడడుగులు వేశారు. పెళ్లయ్యాక వారికి ఇద్దరు కుమార్తెలు ఈషా డియోల్, అహానా డియోల్ జన్మించారు. వారి వివాహ సమయంలోనూ పలు రూమర్స్ రావడం గమనార్హం. వారి పెళ్లికి హిందూ వివాహ చట్టం ప్రకారం న్యాయపరమైన సమస్యలు రావడంతో 1979లో ధర్మేంద్ర ముస్లింగా మారి హేమమాలినిని పెళ్లి చేసుకున్నారని.. ఇద్దరూ తమ పేర్లను దిలావర్, ఆయేషా బీగా మార్చుకున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ విషయాన్ని చాలా కాలం వరకూ ధర్మేంద్ర ఖండించలేదు. 2004లో ఎలక్షన్లలో పోటీ చేస్తున్నప్పుడు స్పందించి, 'మతం మార్చుకునే అవసరం నాకు లేదు' అని స్పష్టం చేశారు.

తొలినాళ్లలో సాఫ్ట్, రొమాంటిక్ చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన ఆయన.. 1970 నుంచి యాక్షన్ మ్యాన్ అనే ఇమేజ్‌ను సొంతం చేసుకుని షోలే చిత్రంతో స్టార్ స్టేటస్ సంపాదించారు. బలమైన దేహదారుఢ్యంతో ఉండే ఆయన తెరపైన శక్తిమంతమైన యాక్షన్ రోల్స్‌తో అలరించేవారు. పోరాటాలు కూడా డూప్ లేకుండా చేసేవారు. అందుకే ఆయనను 'హీ మ్యాన్', 'యాక్షన్ కింగ్' అని పిలిచేవారు.

బయోపిక్ ఇష్టం లేదు

ధర్మేంద్ర బయోపిక్‌ను తెరకెక్కించడానికి ఆయనను చాలా మంది దర్శకనిర్మాతలు సంప్రదించినా సున్నితంగా తిరస్కరించేవారు. 'నా బయోపిక్ తెరకెక్కిస్తే, అందులో నాలా నటించే నటులు ఎవరూ కనిపించలేదు' అని ఆయన భావించడమే దానిక్కారణం.

విడుదలకు సిద్ధం



అర్చన ప్రధాన పాత్రలో తోట కృష్ణ తెరకెక్కిస్తోన్న చిత్రం 'దక్షిణ కాళీ'. మీసాల వాణి నిర్మాత. చంద్రగిరి సుబ్బు, ప్రియాంక శ్రీ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ రిలీజ్ చేశారు. కార్యక్రమంలో నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ 'ఆ కాళీమాతే నిర్మాతను ఆవహించి ఈ సినిమా తీసిందేమో అన్నట్టుంది. అర్చన అద్భుతంగా నటించారు. మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని అన్నారు. చిత్ర దర్శకుడు తోట కృష్ణ మాట్లాడుతూ 'ఆర్టిస్టులు, టెక్నీషియన్లు పట్టుదలతో చేసిన కృషికి నిదర్శనం ఈ చిత్రం' అని అన్నారు. నిర్మాత మీసాల వాణి మాట్లాడుతూ 'ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకంతో 'దక్షిణ కాళీ' కథను నేను రాసుకున్నా' అని చెప్పారు.

ఇలాంటి సినిమా ఇప్పటి వరకూ రాలేదు

మహేశ్ బాబు పి



"ఆంధ్ర కింగ్ తాలూకా' అంటే ప్రత్యేక అర్థముంది. అది సినిమా చూస్తున్నప్పుడు అర్థమవుతుంది. కన్నడలో కూడా అదే టైటిల్‌తో విడుదల చేస్తున్నాం. ఇలాంటి సినిమా ఇప్పటి వరకూ రాలేదు. రామ్ కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోతుందీ చిత్రం' అని అన్నారు దర్శకుడు మహేశ్ బాబు పి. రామ్ పోతినేని కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మించారు. సినిమా ఈనెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మహేశ్ బాబు చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'రానా గారు ఉపేంద్రతో ఒక ఇంటర్వ్యూ చేయడం చూశాను. అందులో ఉపేంద్ర ' నేను బయటకంటే సినిమాలోనే రియల్ మనిషిని' అని చెప్పారు. ఆ మాట నాకు చాలా కనెక్ట్ అయింది. అప్పుడే సూర్య అనే క్యారెక్టర్ ఇలా ఉంటుంది అని అనిపించింది. సూర్య పాత్ర కోసం ఉపేంద్రని సంప్రదించాము. ఆయనకు వీరాభిమానులు ఉన్నారు. సూర్య క్యారెక్టర్‌లో స్టార్స్ అందరు కనిపిస్తారు. హీరోయిన్ భాగ్యశ్రీ పాత్ర కథలో చాలా కీలకం. ఒక జీవితాన్ని చూసినట్టుగా ఉంటుంది. వివేక్ మెర్విన్ అద్భుతమైన ఆల్బమ్ ఇచ్చారు. 'చిన్ని గుండెలో..' నా ఫేవరేట్ సాంగ్. 'నువ్వుంటే చాలు..' పాట కూడా నాకు చాలా ఇష్టం. రామ్ గారికి మ్యూజిక్‌పై మంచి అవగాహన ఉంది' అని పేర్కొన్నారు.

సుదర్శన్ నిర్లక్ష్యం.. విచక్షణలేని జురెల్.. బాధ్యతలేని పంత్.. వెరసి బ్యాటింగ్‌లో మరోసారి కుప్పకూలిన టీమిండియా.. సొంతగడ్డపై మరో వైట్‌వాష్‌కు చేరువైంది. బ్యాట్‌తో అదరగొట్టిన యాన్సెన్.. బౌలింగ్‌లోనూ చెలరేగి షార్ట్ బాల్స్‌తో భారత మిడిలార్డర్ వెన్నువిరిచాడు. దక్షిణాఫ్రికా భారీ స్కోరు చేసిన చోట.. ఘనత వహించిన మన బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. టెయిలెండర్ కుల్దీప్ చూపిన పట్టుదలను కూడా ప్రదర్శించలేక పోయారు. దీంతో సొంతగడ్డపైనే ఫాలో-ఆన్‌లో పడిన ఘోర దుస్థితి..! ప్రత్యర్థి కెప్టెన్ వద్దనుకొన్నాడు కాబట్టి ఆ అవమానం తప్పింది. అయితే, భారత గడ్డపై టెస్ట్ మ్యాచ్ గెలవడమే అద్భుతం అనుకొన్న సఫారీలకు.. అరుదైన క్లీన్‌స్వీప్ ఊరిస్తోంది..!!


సాయి సుదర్శన్ (15)


పంత్ (7)

యాన్సెన్ వేట

మన బ్యాట్లు బోల్తా

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 201 ఆలౌట్

రాణించిన జైస్వాల్, సుందర్ • 314 రన్స్ ఆధిక్యంలో దక్షిణాఫ్రికా

రెండో టెస్ట్


జడేజా (6)


యాన్సెన్ (6/48)

గువాహటి: బ్యాటర్ల నిర్లక్ష్యంతో సొంతగడ్డపై భారత్‌కు మరో ఘోర పరాభవం తప్పేట్టు లేదు. మార్కో యాన్సెన్ (6/48) షార్ట్ బాల్స్ వ్యూహానికి మనోళ్లు బెంబేలెత్తారు. దీంతో భారీ ఆధిక్యాన్ని సొంతం చేసుకొన్న పర్యాటక దక్షిణాఫ్రికా రెండో టెస్ట్‌లో పట్టుబిగించింది. మరో రెండు రోజుల ఆట మిగిలున్న నేపథ్యంలో ఏదో అద్భుతం జరిగితే తప్ప టీమిండియా క్లీన్‌స్వీప్‌ను తప్పించుకోవడం కష్టమే..! ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 9/0తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 201 పరుగులకు కుప్పకూలింది. జైస్వాల్ (58), వాషింగ్టన్ సుందర్ (48) మినహా మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. సైమన్ హార్మర్ మూడు వికెట్లు పడగొట్టాడు. మార్‌క్రమ్ ఏకంగా ఐదు క్యాచ్‌లు పట్టి భారత పతనంలో కీలక భూమిక పోషించాడు. సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ స్కోరు 489కి భారత్ 288 పరుగులు వెనుకబడింది. అయితే, ప్రత్యర్థిని ఫాలో-ఆన్ ఆడించకుండా రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 26/0 స్కోరు చేసింది. సోమవారం ఆట ఆఖరుకు ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (13), మార్‌క్రమ్ (12) క్రీజులో ఉన్నారు. మొత్తంగా సఫారీలు 314 పరుగుల ఆధిక్యంలో ఉన్నారు. సుమారు ఇంకో 40-50 ఓవర్లు ఆడి 500 రన్స్‌కు దగ్గర్లో లక్ష్యాన్ని టీమిండియా ముందుంచే అవకాశం ఉంది.

ఆరంభం నిలకడగా..: తొలి సెషన్‌లో భారత్ నిలకడగా స్కోరు చేసినా.. యాన్సెన్ దెబ్బకు ఒక్కసారిగా తడబడింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు జైస్వాల్, రాహుల్ (22) జట్టుకు శుభారంభాన్ని అందించారు. అయితే, స్పిన్నర్ కేశవ్ బౌలింగ్‌లో బౌన్స్ అయిన బంతిని ఆడే క్రమంలో రాహుల్ స్లిప్స్‌లో క్యాచిచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ, జైస్వాల్, సాయి సుదర్శన్ (15) రెండో వికెట్‌కు 30 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న జైస్వాల్.. హార్మర్ బౌలింగ్‌లో భారీషాట్ ఆడే క్రమంలో అవుటవడంతో టీమిండియా బ్యాటింగ్ కుదుపులకు లోనైంది. బ్యాటర్ల బాధ్యతారాహిత్యమైన షాట్ల కారణంగా కేవలం 27 పరుగుల తేడాతో.. అంటే 95/1 నుంచి 122/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. హార్మర్ బౌలింగ్‌లో పేలవ షాట్ ఆడిన సుదర్శన్ క్యాచవుట్ కాగా.. జురెల్ (0)ను డకౌట్ చేసిన యాన్సెన్ భారత్ పతనానికి నాందిపలికాడు. కెప్టెన్ రిషభ్ పంత్ (7), జడేజా (6) కొంతసేపు క్రీజులో నిలవడంతో టీ సమయానికి భారత్ 102/4తో నిలిచింది.

మిడిల్ ధమాల్: టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టిన వేళ.. ఎనిమిదో వికెట్‌కు 72 పరుగులు జోడించిన సుందర్, కుల్దీప్ (19) టీమ్ స్కోరును 200 మార్క్ దాటించారు. రెండో సెషన్ ఆరంభంలోనే యాన్సెన్‌పై ఎదురుదాడి చేద్దామనుకొన్న పంత్ చెత్తగా ఆడి వికెట్ పారేసుకొన్నాడు. ముందుకు వచ్చి ఆడే క్రమంలో మిస్ టైమ్ కావడంతో ఎడ్జ్ తీసుకొన్న బంతి కీపర్ చేతుల్లో పడింది. నితీశ్ (10), సీనియర్ బ్యాటర్ జడేజాను యాన్సెన్ షార్ట్ బాల్స్‌తో బోల్తా కొట్టించాడు. అయితే, సుందర్, కుల్దీప్ ఎదురు నిలవడంతో టీమిండియా 174/7తో లంచ్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లో మరో 27 పరుగులు జోడించిన టీమిండియా మిగతా మూడు వికెట్లు చేజార్చుకొంది. ఫిఫ్టీకి చేరువలో ఉన్న సుందర్‌ను హార్మర్ క్యాచవుట్ చేయగా.. కుల్దీప్, బుమ్రా (5)ను వెనక్కిపంపిన యాన్సెన్ భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489 ఆలౌట్;

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) యాన్సెన్ (బి) హార్మర్ 58, రాహుల్ (సి) మార్‌క్రమ్ (బి) కేశవ్ 22, సుదర్శన్ (సి) రికెల్టన్ (బి) హార్మర్ 15, జురెల్ (సి) కేశవ్ (బి) యాన్సెన్ 0, పంత్ (సి) వెరిన్నే (బి) యాన్సెన్ 7, జడేజా (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 6, నితీశ్ (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 10, సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 48, కుల్దీప్ (సి) మార్‌క్రమ్ (బి) యాన్సెన్ 19, బుమ్రా (సి) వెరిన్నే (బి) యాన్సెన్ 5, సిరాజ్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 83.5 ఓవర్లలో 201 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-65, 2-95, 3-96, 4-102, 5-105, 6-119, 7-122, 8-194, 9-194; **బౌలింగ్:** యాన్సెన్ 19.5-5-48-6, ముల్డర్ 10-5-14-0, కేశవ్ మహరాజ్ 15-1-39-1, హార్మర్ 27-6-64-3, మార్‌క్రమ్ 10-1-26-0, ముత్తుసామి 2-0-2-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: రికెల్టన్ (బ్యాటింగ్) 13, మార్‌క్రమ్ (బ్యాటింగ్) 12; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 8 ఓవర్లలో 26/0; బౌలింగ్:** బుమ్రా 3-0-13-0, సిరాజ్ 3-1-8-0, జడేజా 1-0-2-0, కుల్దీప్ 1-0-2-0.



కబడ్డీ కిరీటం

మళ్లీ మనదే

మహిళల ప్రపంచకప్ విజేత భారత్

ఢాకా: డిఫెండింగ్ చాంపియన్ భారత్ వరుసగా రెండోసారి మహిళల కబడ్డీ వరల్డ్‌కప్ ట్రోఫీని కైవసం చేసుకొంది. సోమవారం ఇక్కడ జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో భారత్ 35-28 స్కోరుతో చైనీస్ తైపీని ఓడించి విజేతగా నిలిచింది. టాస్ గెలిచిన తైపీ ఆహ్వానం మేరకు భారత్ తొలి రైడ్‌కు వెళ్లి శుభారంభం చేసింది. ఆట ప్రథమార్థం ముగింపు వరకు నువ్వా-నేనా అన్నట్టు సాగగా, చివరిలో సంజు చేసిన సూపర్ రైడ్‌తో భారత్ 20-16తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ద్వితీయార్థంలో భారత డిఫెండర్లు పూనమ్, సొనాలీ అద్భుతమైన ట్యాకిల్స్‌తో ప్రత్యర్థి దూకుడుకు కళ్లెం వేశారు. తైపీ ఒక దశలో గట్టి పోటీ ఇచ్చినా భారత్ పాయింట్ల అంతరం మాత్రం తగ్గకుండా ఆటను ముందుకు తీసుకెళ్లింది. భారత స్టార్ రైడర్ సంజూదేవి చివర్లో మరోసారి మెరవడంతో దేశానికి వరల్డ్‌కప్ దక్కింది. ఈ వరల్డ్‌కప్‌లో అద్భుత ఆటతీరు కనబర్చిన సంజూదేవికి 'అత్యంత విలువైన క్రీడాకారిణి అవార్డు' లభించింది. 2012లో భారత్ తొలిసారి వరల్డ్‌కప్ నెగ్గింది. ఆ తర్వాత ఈ టోర్నీ జరగడం ఇప్పుడే. మొత్తం 12 దేశాలు పాల్గొన్న ఈ లీగ్‌లో గ్రూప్ దశలో థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, జర్మనీ, ఉగాండాపై నెగ్గిన భారత్ సెమీస్‌లో ఇరాన్‌ను ఓడించింది.



పసిడి ప్రాంజలి

బధిర ఒలింపిక్స్

టోక్యో: బధిర ఒలింపిక్స్ మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత షూటర్ ప్రాంజలి ప్రశాంత్ ధూమల్ అదరగొట్టింది. ఫైనల్లో ఆద్యంతం ఆధిపత్యం చెలాయించిన ప్రాంజలి స్వర్ణ పతకం దక్కించుకుంది. ఉక్రెయిన్, కొరియా రజత, కాంస్య పతకాలు గెలుపొందాయి. ఈ ఒలింపిక్స్‌లో ధూమల్‌కిది మూడో పతకం. ఇంతకుముందు పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో స్వర్ణం, 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత కేటగిరీలో రజతం నెగ్గింది.

పెళ్లి వేడుకల ఫొటోలు తొలగించిన స్మృతి

ముంబై: తండ్రి శ్రీనివాస్ అస్వస్థతకు గురవడంతో టీమిండియా క్రికెటర్ స్మృతీ మంధాన.. బాలీవుడ్ సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్‌తో వివాహాన్ని చివరి నిమిషంలో వాయిదా వేసుకుంది. అయితే, ఇప్పుడు స్మృతి తన పెళ్లి ముందస్తు వేడుకలకు సంబంధించిన అన్ని ఫొటోలను సోషల్ మీడియా ఖాతా నుంచి తొలగించడం చర్చనీయాంశమైంది. రెండ్రోజుల క్రితం డీవై పాటిల్ స్టేడియంలో పలాష్ రింగ్ తొడిగి ఎంగేజ్‌మెంట్ చేసుకున్న వీడియో కూడా స్మృతి ఖాతా నుంచి మాయమైంది. అంతేకాదు.. హల్దీ, మెహందీ, సంగీత్ వేడుకల్లో పాల్గొని సందడి చేసిన సహచర క్రికెటర్లు జెమీమా రోడ్రిగ్స్, శ్రేయాంక పాటిల్ తదితరులు కూడా తమ సోషల్ మీడియా నుంచి ఫొటోలను తొలగించడం గమనార్హం. దీంతో ఏం జరిగిందోనంటూ అనేకమంది నెట్టింట పోస్టులు పెడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఈ ఫొటోలు, వీడియోలను స్మృతి కావాలనే తొలగించిందా లేదంటే హైడ్‌లో ఉంచిందా? అంటూ చర్చించుకుంటున్నారు. మరోవైపు స్మృతి కాబోయే భర్త పలాష్ ముచ్చల్ కూడా ఇన్‌ఫెక్షన్, ఎసిడిటీతో ఆసుపత్రిలో చేరాడు. చికిత్స అనంతరం అతడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు.

శ్రీకాంత్, ప్రణయ్ సత్తా చాటేనా?

నేటినుంచి సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ మంగళవారం ఇక్కడ మొదలవనుంది. ఈ టోర్నీలో సత్తాచాటి సీజన్‌ను ఘనంగా ముగించాలని సీనియర్లు కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్ భావిస్తున్నారు. భారత్ నుంచి సింగిల్స్‌లో ఉన్నతి, ఆకర్షి, డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా, అర్జున్/హరిహరన్ బరిలో ఉన్నారు.

చెస్ వరల్డ్‌కప్ ఫైనల్ తొలి గేమ్ డ్రా

పనాజీ: చెస్ వరల్డ్‌కప్ ఫైనల్లో జావోఖిర్ సిందరోవ్ (ఉజ్బెకిస్థాన్), వీ యి (చైనా) మధ్య సోమవారం జరిగిన తొలి క్లాసికల్ గేమ్ డ్రాగా ముగిసింది. దీంతో ఇద్దరికి చెరో అర పాయింట్ లభించింది. మూడో స్థానం కోసం జరిగిన పోరులో నోడిర్బెక్ యకుబ్బెవ్(ఉజ్బెకిస్థాన్)పై ఆండ్రీ ఎసిపెంకో (రష్యా) గెలిచాడు.

భారత్-బెల్జియం మ్యాచ్ నేటికి వాయిదా

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భాగంగా భారత్, బెల్జియం జట్ల మధ్య సోమవారం జరగాల్సిన మ్యాచ్ ప్రతికూల వాతావరణం వల్ల మంగళవారానికి వాయిదా పడింది. ఆట మొదలైన మూడు నిమిషాల తర్వాత భారీవర్షం కురియడంతో వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

బిజినెస్

manepally Jewellers Pvt. Ltd. trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP Ph: 99120 10888

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,130 ▼	1,14,700 ▼	1,71,000 ▲
విజయవాడ	1,27,000 ▼	1,20,000 ▲	1,58,000 ▼
విశాఖపట్నం	1,27,150 ▲	1,15,350 ▲	1,71,000 ▼
రాజమండ్రి	1,25,130 ▼	1,14,700 ▼	1,56,000 ▼
ప్రొద్దుటూరు	1,24,400 ▲	1,14,450 ▲	1,57,700 ▲
ముంబై	1,23,310 ▲	1,12,950 ▲	1,53,650 ▲

పైలట్ల శిక్షణలోకి అదానీ!



ఎఫ్ఎస్‌టీసీ కొనుగోలుపై ఫోకస్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ పైలట్ల శిక్షణ వ్యాపారంలో ప్రవేశించే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. ఇందుకోసం, అదానీ గ్రూప్‌నకు చెందిన డిఫెన్స్, ఏరోస్పేస్ అనుబంధ విభాగం పైలట్లకు శిక్షణ ఇచ్చే ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్‌ను (ఎఫ్ఎస్‌టీసీ) కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన చర్చలు పురోగతిలో ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2012లో ప్రారంభమైన ఎఫ్ఎస్‌టీసీ.. హైదరాబాద్, ముంబై, గురుగ్రామ్ నగరాల్లో సిమ్యులేటర్ సెంటర్లను కలిగి ఉంది.. హర్యానా, సూరత్, షోలాపూర్‌లలో ఫ్లైట్ ట్రైనింగ్ అకాడమీలు కూడా నిర్వహిస్తోంది. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీ (ఏడీఎస్‌టీ), ఫ్రైమ్ ఏరోల సమ భాగస్వామ్య సంస్థ హోరిజాన్ ఏరో సొల్యూషన్స్ ద్వారా ఎఫ్ఎస్‌టీసీ కొనుగోలు జరిపే అవకాశం ఉన్నదంటున్నారు. ఏడీఎస్‌టీకి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రమోటర్‌గా ఉండగా.. ఎన్‌సీపీ నాయకుడు, పౌర విమానయాన శాఖ మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్ కుమారుడైన ప్రజయ్ పటేల్ నిర్వహణలోని సంస్థ ఫ్రైమ్ ఏరో. గత ఏడాది డిసెంబరులో ఎయిర్‌వర్క్స్‌లో మెజారిటీ వాటా కొనుగోలు ద్వారా విమానాల నిర్వహణ, మరమ్మతు విభాగంలోకి ప్రవేశించిన ఏడీఎస్‌టీ.. ఆ తర్వాత కాలంలో ఇదే విభాగానికి చెందిన మరో సంస్థ ఇండామెర్ టెక్నిక్స్‌లోనూ 50 శాతం వాటా కొనుగోలు చేసింది. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో ఇప్పటికే రూ.5,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టిన అదానీ గ్రూప్.. మున్ముందు సంవత్సరాల్లో ఈ మొత్తాన్ని మూడింతలకు పెంచాలనుకుంటోంది.

ప్రథమార్ధంలో రికార్డు పనితీరు

సెప్టెంబరుతో ముగిసిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో అదానీ గ్రూప్ కంపెనీలు బలమైన పనితీరు కనబరిచాయి. రికార్డు స్థాయి ఆదాయాలను ఆర్జించడంతోపాటు మూలధన వ్యయాలను భారీగా పెంచడం ఇందుకు తోడ్పడింది. ఈ ప్రథమార్ధంలో అదానీ గ్రూప్ రూ.67,870 కోట్ల పెట్టుబడులు పెట్టింది. దాంతో గ్రూప్ స్థూల ఆస్తులు రూ.6.77 లక్షల కోట్లకు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి గ్రూప్ రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రథమార్ధంలో అదానీ కంపెనీల మొత్తం ఎబిటా వార్షిక ప్రాతిపదికన 11.2 శాతం వృద్ధితో ఆల్‌టైం రికార్డు గరిష్ఠ స్థాయి రూ.92,943 కోట్లకు చేరుకుంది.

'రెపో' మరింత తగ్గుతుంది

ఆర్‌బీఐ గవర్నర్



ముంబై: దేశంలో కీలక రెపోరేటు మరింతగా తగ్గించేందుకు వాతావరణం అనుకూలంగా ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. మరిన్ని రెపో కోతలకు పరిస్థితి సానుకూలంగా ఉన్న విషయం అక్టోబరు ఎంపీసీ సమావేశ సమయంలోనే ప్రకటించిన విషయం ఒక చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గుర్తు చేశారు. ఆ పరిస్థితి ఏమీ మారలేదన్న విషయం ఆ తర్వాత వచ్చిన గణాంకాలు నిరూపించాయని ఆయన అన్నారు. అయితే డిసెంబరు మొదటి వారంలో జరుగబోయే ఎంపీసీ ఆ విషయం పరిగణనలోకి తీసుకుంటుందా, లేదా అనేది కమిటీయే నిర్ణయిస్తుందని చెప్పారు. 2024 సంవత్సరం ప్రథమార్ధంలో ఒక శాతం మేరకు రెపో రేటును తగ్గించిన ఎంపీసీ అక్టోబరులో మాత్రం విరామం ఇచ్చింది. అక్టోబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 శాతానికి దిగి రావడం మరో విడత రెపోరేటుకు సానుకూల అంశమని విశ్లేషకులంటున్నారు.

ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతాయ్

ఈ ఏడాది ఇప్పటివరకు తీసుకున్న ఆర్థిక, ద్రవ్య, నియంత్రణా పరమైన చర్యలతో ప్రైవేటు పెట్టుబడుల పునరుజ్జీవానికి అనుకూల వాతావరణం ఏర్పడినట్టు ఆర్‌బీఐ తాజా బులెటిన్‌లో తెలిపింది. ప్రపంచ దేశాల నుంచి వీస్తున్న ప్రతికూల పవనాలను కూడా తట్టుకుని మన ఆర్థిక వ్యవస్థ మరింత పుంజుకునే సంకేతాలనే వెలువరించిందని పేర్కొంది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో కొంత ఉత్సాహం కనిపిస్తోందని, అయితే ఆ జోరు నిలదొక్కుకుంటుందా...ఆర్థిక స్థిరత్వంపై దాని ప్రభావం ఏమిటి అనేవి ప్రశ్నార్థకంగా ఉన్నాయని తెలిపారు.

ఈ ఏడాది వృద్ధి 6.5%: ఎస్ అండ్ పీ

ఇటీవల ప్రకటించిన పన్ను రేట్ల కోతలు, ద్రవ్య విధాన సడలింపులు వినియోగ వృద్ధికి ఊతం ఇస్తాయని, ఫలితంగా వృద్ధిరేటు వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 6.5%, వచ్చే ఏడాది 6.7% ఉంటుందని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో ఇది 7.8% ఉండగా రెండో త్రైమాసిక అధికారిక గణాంకాలు వచ్చే శుక్రవారం వెలువడనున్నాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరినట్టయితే అస్థిరతలు తొలగిపోయి, విశ్వాసం పెరగడంతో పాటు కార్మిక ఆధారిత రంగాలు మరింత ఉత్తేజితం కాగలవన్న ఆశాభావం ప్రకటించింది.

చైనా 'ఎఫ్‌డీఐ'కి గ్రీన్‌సిగ్నల్!

సిద్ధమైన కేబినెట్ నోట్

న్యూఢిల్లీ: చైనా నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై (ఎఫ్‌డీఐ) బెట్టు సడలించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ కన్స్యూమర్ డ్యూరబుల్ వస్తువుల విషయంలో కొద్దిగా సడలింపు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. దీని కోసం అధికార వర్గాలు ఇప్పటికే కేంద్ర కేబినెట్ పరిశీలన కోసం ఒక నోట్ కూడా సిద్ధం చేసినట్టు సమాచారం. 2020లో జరిగిన గల్వాన్ సరిహద్దు ఘర్షణ తర్వాత చైనా నుంచి వచ్చే ఎఫ్‌డీఐని ప్రభుత్వం కట్టడి చేసిన సంగతి తెలిసిందే. దీంతో మన దేశంలోని ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్ డ్యూరబుల్ వస్తువుల తయారీ కంపెనీలతో పాటు అనేక కంపెనీలు కీలక యంత్రాలు, విడి భాగాలను చైనా నుంచి దిగుమతి చేసుకోలేకపోతున్నాయి. దీని వల్ల మేకిన్ ఇండియా లక్ష్యం కూడా దెబ్బతింటుందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో కొన్ని రంగాల్లో చైనా ఎఫ్‌డీఐని అనుమతించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ కంపెనీల్లో చైనా ఎఫ్‌డీఐని పరిమిత స్థాయిలోనే అనుమతిస్తూ, ఆయా కంపెనీల కీలక ఉద్యోగులు అందరూ భారతీయులే అయి ఉండాలని ప్రభుత్వం షరతులు పెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

26,000 దిగువకు నిఫ్టీ

- లాభాల స్వీకరణతో కుంగిన మార్కెట్
- 2 రోజుల్లో రూ.7 లక్షల కోట్లు ఫట్

ముంబై: ఆఖరి అరగంటలో మదుపరులు భారీ స్థాయిలో లాభాల స్వీకరణకు పాల్పడటం, విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా స్టాక్ మార్కెట్ సోమవారం నష్టాల బాట పట్టింది. సూచీలు ఇంట్రాడే లాభాలను కోల్పోయి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 331.21 పాయింట్లు క్షీణించి 84,900.71 వద్దకు జారుకుంది. నిఫ్టీ 108.65 పాయింట్లు పతనమై 25,959.50 వద్ద స్థిరపడింది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రెండు సెషన్లలో రూ.7 లక్షల కోట్లు తగ్గి రూ.469.68 లక్షల కోట్లకు (5.27 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

తేజస్ క్రాష్.. హెచ్ఏఎల్ షేరు డౌన్: గత వారాంతంలో జరిగిన దుబాయ్ ఎయిర్‌షోలో తేజస్ యుద్ధ విమానం కుప్పకూలిన సంఘటన ఆ విమానాల తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) షేరు ధరపై ప్రభావం చూపింది. బీఎస్ఈలో ఈ షేరు ఒక దశలో 8.48% క్షీణించింది. మళ్లీ కాస్త కోలుకున్నప్పటికీ, చివరికి 3.31% నష్టంతో రూ.4,443 వద్ద ముగిసింది.

రూపాయికి స్వల్ప ఊరట : భారత కరెన్సీ ఆల్‌టైం రికార్డు కనిష్ఠం నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం 50 పైసలు పెరిగి రూ.89.16 వద్ద ముగిసింది. దిగుమతిదారులు, బ్యాంక్‌లు భారీగా డాలర్ల అమ్మకాలకు పాల్పడటంతో పాటు క్రూడ్ ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు దోహదపడింది.

భారత్‌లో ఐపీఓకు సెంబ్‌కార్ప్: సింగపూర్‌కు చెందిన విద్యుత్ ఉత్పత్తి సంస్థ సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ తన భారత అనుబంధ విభాగమైన సెంబ్‌కార్ప్ గ్రీన్ ఇన్‌ఫ్రా ఐపీఓకు మరోసారి ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందుకోసం సిటీ, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ సహా మూడు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లను నియమించుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2019 జనవరిలో సెబీ నుంచి ఐపీఓ పత్రాలను ఉపసంహరించుకున్న సెంబ్‌కార్ప్.. ఐపీఓకు వచ్చేందుకు చేస్తున్న రెండో ప్రయత్నమిది.

3 ఐపీఓలకు సెబీ ఆమోదం: కృత్రిమ మేధ(ఏఐ) సంస్థ ఫ్రాక్టల్ అనలిటిక్స్, సాస్ సేవల సంస్థ అమాగీ మీడియా ల్యాబ్స్‌తో పాటు గుండెలో అమర్చే స్టెంట్ల తయారీదారు సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ ఐపీఓలకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది.

కెనరా బ్యాంక్ ఈడీగా సునీల్ కుమార్ చగ్



బెంగళూరు: కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సునీల్ కుమార్ చగ్ నియమితులయ్యారు. ఆయన నియామకం తక్షణం అమలులోకి వచ్చింది. ఆయన పదవీ కాలం మూడు సంవత్సరాలుంటుంది. ఈ పదోన్నతి పొందడానికి ముందు చగ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఉన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఆయనకు మూడు దశాబ్దాలకు పైబడిన అనుభవం ఉంది.

ఎస్‌బీఐ వెంచర్స్ రూ.20,000 కోట్ల ఫండ్

భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) ప్రమోటర్‌గా ఉన్న ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎస్‌బీఐ వెంచర్స్ తన మూడో క్లైమెట్ ఫోకస్డ్ ఫండ్ కోసం రూ.20,000 కోట్లు సమీకరించనుంది. ఈ నిధులను స్టార్టప్‌లలో పెట్టుబడిగా పెట్టాలనుకుంటోంది. ఇది దేశంలో పర్యావరణహిత వ్యాపారాల వృద్ధికి తోడ్పడటంతో పాటు కొత్త ఆర్థిక అవకాశాలను కల్పించనుందని ఎస్‌బీఐ వెంచర్స్ ఎండీ, సీఈఓ ప్రేమ్ ప్రభాకర్ అన్నారు. వచ్చే ఏడాది జనవరి-మార్చి మధ్య కాలంలో ఈ ఫండ్‌ను ప్రారంభించనున్నట్లు ఐవీసీఏ గ్రీన్ రిటర్న్ సమ్మిట్‌లో సోమవారం పాల్గొన్న సందర్భంగా ఆయన వెల్లడించారు.

బీఎస్‌డీఏపై సెబీ సమీక్ష

మరింత మందిని సంఘటిత ఆర్థిక సేవల పరిధిలోకి తెచ్చేందుకు బేసిక్ సర్వీసెస్ డీమ్యాట్ అకౌంట్ (బీఎస్‌డీఏ) వసతులను సమీక్షించాలని సెబీ ప్రతిపాదించింది. బీఎస్‌డీఏ అర్హతను నిర్ణయించేందుకు ఉపయోగించే పోర్ట్‌ఫోలియో విలువ మదింపు ప్రక్రియ నుంచి జీరో కూపన్ జీరో ప్రిన్సిపల్ (జెడ్‌సీజెడ్‌పీ) బాండ్లను మినహాయించాలని సెబీ సూచించింది. చిన్న మదుపరులపై డీమ్యాట్ చార్జీల భారాన్ని తగ్గించేందుకు సెబీ కనీస సేవలందించే బీఎస్‌డీఏను 2012లో ప్రవేశపెట్టింది.

డాక్టర్ రెడ్డీస్ ఔషధానికి ఈయూ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ 'ఏవీటీ03' అనే బయోసిమిలర్ ఔషధాన్ని మార్కెట్ చేసేందుకు యూరోపియన్ కమిషన్ ఆమోదం తెలిపింది. కేన్సర్ పేషెంట్లు, రుతు చక్రం ఆగిపోయిన స్త్రీలలో ఆస్టియోపోరోసిస్ (ఎముకలు గుల్ల బారటం, బలహీనపడడం) వ్యాధిని అరికట్టేందుకు ఈ ఔషధాన్ని ఉపయోగిస్తారని కంపెనీ తెలిపింది. ఐర్లాండ్ కంపెనీ అల్వోటెక్ ఈ బయోసిమిలర్ ఔషధాన్ని అభివృద్ధి చేసి తయారు చేస్తోంది. డాక్టర్ రెడ్డీస్ ఈ ఔషధాన్ని ఈయూ, యూకే, అమెరికా తదితర దేశాల్లో మార్కెట్ చేయనుంది.

సౌదీ కంపెనీతో ఆర్ఎస్ఐటీ భాగస్వామ్యం

హైదరాబాద్: ఏఐ ఆధారిత గవర్నెన్స్, ఎంటర్‌ప్రైజ్ ఆటోమేషన్ సొల్యూషన్స్ కంపెనీ ఆర్ఎస్ఐటీ ఏఐ సొల్యూషన్స్ సౌదీ అరేబియాకు చెందిన ఎంటర్‌ప్రైజ్, డిజిటల్ పరివర్తన సొల్యూషన్లు అందించే అజ్నిహాట్ అల్నాజా గ్రూప్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం విలువ 30 కోట్ల డాలర్లు (రూ.2,640 కోట్లు). జీసీసీ ప్రాంతంలో ఆర్ఎస్ఐటీ లాంఛనంగా ప్రవేశించడానికి ఇది ఉపయోగపడుతుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	660
వరంగల్	652	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		దజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	103
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	92
కర్నూలు	100	నెల్లూరు	97
విశాఖపట్నం	100	అనంతపురం	97
గోదావరి	103		

ప్రేమించి.. పెళ్లికి నిరాకరిస్తే రేప్ కేసా?

» పరస్పర సమ్మతితో శారీరక సంబంధం అత్యాచారం కిందికి రాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 24: ప్రేమ బంధం పెళ్లికి దారి తీయని సందర్భాల్లో.. ప్రేమికుడిపై ప్రియురాలు రేప్ ఆరోపణలు చేయటం, కేసులు పెట్టటం వంటి ఘటనలు పెరిగిపోతున్నాయి. ఈ తరహా కేసులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది నేర న్యాయవ్యవస్థను (క్రిమినల్ జస్టిస్‌ను) దుర్వినియోగం చేయటం కిందికే వస్తుందని స్పష్టం చేసింది. కొన్నేళ్లపాటు బంధం కొనసాగించి, పరస్పర అంగీకారంతో శారీరంగా సన్నిహితమైన తర్వాత.. రేప్ అని ఎలా ఆరోపించగలరని ప్రశ్నించింది. ఇటువంటి కేసుల్లో రేప్ అభియోగాలను నమోదు చేయటం వల్ల.. అత్యంత తీవ్ర నేరమైన రేప్‌ను అపహాస్యం చేసినట్లవుతుందని పేర్కొంది. ఎదుటి వ్యక్తి సమ్మతి లేకుండా లైంగికదాడి జరిపినప్పుడు మాత్రమే రేప్‌గా పరిగణించాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ, ప్రేమ పేరుతో మోసగించిన నిజమైన కేసుల్లో చట్టం సున్నితంగా వ్యవహరించాల్సిందేనని తెలిపింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి దాఖలు చేసిన కేసుపై ధర్మాసనం సోమవారం ఈ తీర్పునిచ్చింది. సదరు వ్యక్తితో మూడేళ్లుగా బంధం కొనసాగించిన ఓ మహిళ.. అతడి వల్ల గర్భం వచ్చిందని, దానిని విచ్ఛిత్తి చేసుకున్నానని, అతడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని పేర్కొంటూ.. రేప్ అభియోగాలు మోపింది.

నేవీలోకి సైలెంట్ హంటర్ ఐఎన్ఎస్ మాహే

ముంబై, నవంబరు 24: తీరప్రాంత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ తొలి యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ (ఏఎస్‌డబ్ల్యూ) షాలో-వాటర్ క్రాఫ్ట్ 'ఐఎన్ఎస్ మాహే' భారత నౌకాదళంలో చేరింది. ముంబైలోని నేవల్ డాక్‌యార్డులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ నౌకను నేవీకి అప్పగించారు. 'సైలెంట్ హంటర్'గా పిలిచే ఈ యుద్ధ నౌకకు మలబార్ తీరంలోని చారిత్రక పట్టణం 'మాహే' పేరు పెట్టారు. ఈ నౌక శిఖరంపై కలరియపట్టులో ఉపయోగించే సన్నని కత్తిలాంటి ఆయుధం 'ఉరుమి'ని ఏర్పాటు చేశారు. భారత్ నిర్మించే ఎనిమిది మాహే క్లాస్ నౌకల్లో ఇది మొదటిది. శత్రు జలాంతర్గాములను వేటాడేందుకు, తీర ప్రాంతంలో గస్తీ నిర్వహించేందుకు దీన్ని ఉపయోగిస్తారు. ఐఎన్ఎస్ మాహే నీటిలో చాలా తక్కువ ధ్వని చేస్తూ కదులుతుంది. అందుకే దీన్ని 'సైలెంట్ హంటర్'గా పిలుస్తున్నారు. ఆత్మనిర్భర్ భారత్ కింద కొచ్చి షిప్‌యార్డ్ లిమిటెడ్ 80 శాతం స్వదేశీ పరికరాలతో దీన్ని నిర్మించింది.

అసాధారణ పరిస్థితుల్లో జరిగిన దుర్ఘటన

» షేర్లు పతనంతో 'తేజస్' ఘటనపై హెచ్ఏఎల్ వివరణ

న్యూఢిల్లీ, నవంబరు 24: ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఎయిర్‌షోలో తేజస్ యుద్ధ విమానం కూలిన ఘటనపై దాని తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) స్పందించింది. అది 'అసాధారణ పరిస్థితుల వలన జరిగిన ప్రత్యేక దుర్ఘటన'గా పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రమాదం తేజస్ యుద్ధ విమానం మొత్తం పనితీరును ప్రతిబింబించదని తెలిపింది. అదేవిధంగా సంస్థ వ్యాపార కార్యకలాపాలు, భవిష్యత్తు డెలివరీలపై ఎలాంటి ప్రభావం చూపబోదని స్పష్టం చేసింది.కాగా, తేజస్ విమానం కూలిన ఘటన తర్వాత హెచ్ఏఎల్ షేర్లు 8% మేర పడిపోయాయి. సోమవారం మధ్యాహ్నం సమయంలో 3.14 శాతం తగ్గి రూ.4,450 వద్ద ట్రేడైంది..

మీ సిమ్ దుర్వినియోగానికి మీదే బాధ్యత:డీవోటీ

న్యూఢిల్లీ, నవంబరు 24: మీ పేరుపై తీసుకున్న సిమ్ కార్డు సైబర్ మోసాలు, ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దుర్వినియోగమైనట్లు తేలితే.. అందుకు మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని టెలికాం శాఖ (డీఓటీ) హెచ్చరించింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. ట్యాంపర్ చేసిన ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) మొబైల్ పరికరాలను కూడా వాడకూడదని ఓ ప్రకటనలో సూచించింది. ఐఎంఈఐ ట్యాంపర్ చేసిన మోడెమ్‌లు, మాడ్యుల్స్, సిమ్ బాక్స్‌లను కొనుగోలు చేయడం.. వాటిని వాడటం నేరమేనని తెలిపింది. నకిలీ పత్రాలతో సిమ్ కార్డులు కొనడం.. మీ పేరు మీద తీసుకున్న సిమ్ కార్డులను వేరొకరికి ఇవ్వడమూ నేరమేనని స్పష్టం చేసింది. సైబర్ నేరాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు మీ పేరుపై తీసుకున్న సిమ్ వినియోగించినట్లు తేలితే తీవ్ర చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని.. ఇలా నేరాలకు పాల్పడిన వారితో పాటు మీపై కూడా చర్యలుంటాయని పేర్కొంది. మొబైల్స్, ఇతర పరికరాల్లోని ఐఎంఈఐని ట్యాంపర్ చేస్తే చట్ట ప్రకారం మూడేళ్ల జైలు, రూ.50 లక్షల జరిమానా ఉంటుందని హెచ్చరించింది. సంచార్ సాథి పోర్టల్ ద్వారా మీ పేరుపై తీసుకున్న సిమ్ కార్డుల వివరాలతో పాటు ఐఎంఈఐ వివరాలను ధ్రువీకరించుకోవాలని డీఓటీ సూచించింది.

మలేషియాలో పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం

కౌలాలంపూర్(మలేషియా), నవంబరు 24: పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు మలేషియా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది నుంచి 16ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను వినియోగించకుండా నిషేధం విధించనుంది. ఆదివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆ దేశ కమ్యూనికేషన్ శాఖ మంత్రి ఫాహ్మి ఫడ్జిల్ తెలిపారు. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాల నుంచి పిల్లల్ని కాపాడేందుకు.. ఆస్ట్రేలియా, డెన్మార్క్, నార్వే వంటి దేశాలు ఇప్పటికే ఈ తరహా బ్యాన్‌ను అమలులోకి తేవాలని పరిశీలిస్తున్నాయి. వయసు ధ్రువీకరణ కోసం ఆయా దేశాలు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

ఢిల్లీలో 260 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

న్యూఢిల్లీ, నవంబరు 24: దేశ రాజధాని ఢిల్లీలో మరో డ్రగ్స్ మాఫియా గుట్టు రట్టయింది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా 'ఆపరేషన్ క్రిస్టల్ ఫోర్ట్రెస్' పేరుతో నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.262 కోట్ల విలువైన 329 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు ఛతర్‌పూర్ ప్రాంతంలోని ఓ ఇంటిపై మెరుపు దాడి చేసిన అధికారులు ఈ భారీ డ్రగ్స్ నిల్వను కనుగొన్నారు. ఈ కేసులో నాగాలాండ్‌కు చెందిన ఓ మహిళతో పాటు ఉత్తరప్రదేశ్‌కు చెందిన సేల్స్ మేనేజర్‌ను అరెస్టు చేశారు.

హెచ్-1బీ వీసా ఉన్నా ప్లాన్-బీ అవసరం!

న్యూఢిల్లీ, నవంబరు 24: అమెరికాకు వెళ్లే విదేశీయులకు హెచ్-1బీ వీసా అంటే ఒక భరోసా!. ఈ వీసా దొరికితే చాలు తమను ఎవరూ కదిలించలేరని భావిస్తారు. కానీ, అలాంటి భరోసా ఏమీ లేదని, అందువల్ల ప్లాన్-బీతో ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్లాన్-బీలో నాలుగు అంశాలను వారు పేర్కొంటున్నారు. హెచ్-1బీ వీసా ద్వారా పొందిన ఉద్యోగం కోల్పోయిన వారు.. వెంటనే బీ-2 పర్యాటక వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. తద్వారా అమెరికాలో కొన్నాళ్లు ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఎఫ్-1 విద్యార్థి వీసా కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలి. తద్వారా వేరే ప్రోగ్రాం చేసేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా ఎక్కువ సమయం లభిస్తుంది. అదేవిధంగా హెచ్-4 వీసా(డిపెండెంట్)కు మరలే అవకాశం ఉంటుంది. భార్యాభర్తల్లో ఎవరికి హెచ్-1బీ వీసా ఉన్నా.. రెండో వ్యక్తి హెచ్-4కు దరఖాస్తు చేసుకుంటే.. ఉద్యోగం సంపాదించుకునే వరకు అమెరికాలో ఉండే అవకాశం ఉంటుంది. అదేసమయంలో దేశాన్ని వీడి వెళ్లే పరిస్థితి నుంచి కూడా తప్పించుకోవచ్చు.

ఢిల్లీలో కాలుష్యంపై నిరసనలు.. హిడ్మా అమరవీరుడంటూ నినాదాలు

న్యూఢిల్లీ, నవంబరు 24: ఢిల్లీలో వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదంటూ ఇండియా గేట్ సమీపంలో ఆదివారం ఆందోళన నిర్వహించిన వారిలో 23 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆందోళనకారులు రోడ్లను బ్లాక్ చేయడంతో పాటు అడ్డుకున్న తమపై పెప్పర్ స్ప్రే ఉపయోగించారని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు హిడ్మా ఫొటో ప్రదర్శించడంతో పాటు హిడ్మా అమరవీరుడంటూ ఆందోళనకారులు నినాదాలు చేశారని పోలీసులు తెలిపారు. ఆందోళనకారులపై బీఎన్ఎస్ 223ఏ, 132, 221, 121ఏ, సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. మరోవైపు వాయు నాణ్యత క్షీణించిన నేపథ్యంలో ప్రైవేటు కార్యాలయాల ఉద్యోగుల్లో 50 శాతం మంది ఇంటి వద్ద నుంచే పనిచేయాలని ఢిల్లీ ప్రభుత్వం సూచించింది.

సూర్యకాంత్ అనే నేను..

(మొదటి పేజీ తరువాయి)

అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్ నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలోనే తొలిసారిగా ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారోత్సవానికి.. ఏడు దేశాల (భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక, బ్రెజిల్) ప్రధాన న్యాయమూర్తులు తమ కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముగిశాక.. జస్టిస్ బీఆర్ గవాయి తన అధికారిక వాహనాన్ని రాష్ట్రపతి భవనంలోనే వదిలేసి వెళ్లారు. కాగా, జస్టిస్ సూర్యకాంత్ 2027 ఫిబ్రవరి 9 వరకూ.. అంటే సుమారు 15 నెలలపాటు సీజేఐగా కొనసాగనున్నారు.



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ముర్ము

నూతన నియమం..

సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ తొలిరోజే విధానపరమైన ఒక నూతన నియమానికి శ్రీకారం చుట్టారు. అత్యవసర జాబితా కోసం కేసుల ప్రస్తావన విషయంలో మౌఖిక అభ్యర్థనలకు స్వస్తి పలికారు. ఆయా కేసులను రాతపూర్వకంగానే మెన్షన్ చేయాలని స్పష్టం చేశారు. మరణశిక్ష, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి వాటి విషయంలో మౌఖిక అభ్యర్థనలను స్వీకరిస్తామని తెలిపారు. ప్రమాణ స్వీకారం తర్వాత రాష్ట్రపతి భవన్ నుంచి సీజేఐ హోదాలో సుప్రీంకోర్టుకు చేరుకున్న ఆయన.. కోర్టు ప్రాంగణంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. సుప్రీంకోర్టు అడ్వొకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ (ఎస్‌సీఏఓఆర్ఏ) అధ్యక్షుడు విపిన్ నాయర్ నూతన సీజేఐకి కోర్టు హాలులోకి స్వాగతం పలికారు. ఆ తర్వాత హెరిటేజ్ కోర్టు నంబర్ వన్‌లో.. జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌తో కూడిన ధర్మాసనానికి అధ్యక్షత వహించారు. మొదటిరోజు 17 కేసులను విచారించారు. మధ్యాహ్నం తర్వాత.. హిమాచల్ ప్రదేశ్‌లో ఒక ప్రైవేట్ సంస్థకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై సీజేఐ తీర్పును వెలువరించారు. కాగా.. ప్రమాణ స్వీకారం అనంతరం మాట్లాడిన జస్టిస్ సూర్యకాంత్.. పెండింగ్ కేసులను తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. "సుప్రీంకోర్టులో 90 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, దీనికి కారణాలు ఎంతో సంక్లిష్టంగా ఉన్నాయి. గత ఆరు నెలల్లో నమోదైన కేసుల సంఖ్యలో స్పష్టమైన పెరుగుదల కనిపించింది. కేసుల సంఖ్య నెలకు దాదాపు నాలుగైదు వేల నుంచి ఏడు వేలకు పెరిగింది. హైకోర్టులను దాటవేసి నేరుగా సుప్రీంకోర్టుకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. దిగువ కోర్టులతోపాటు సుప్రీంకోర్టులో కేసులకు సంబంధించిన, చాలా కాలంగా నిలిచిపోయిన కేసులను పరిష్కరించడంపై శ్రద్ధ పెడతాం. పెండింగ్ కేసులను గుర్తించి వాటి పరిష్కారానికి బెంచ్‌లు ఏర్పాటు చేస్తా" అని పేర్కొన్నారు.

జిల్లా కోర్టు వకీల్ నుంచి సీజేఐ స్థాయికి

సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణావాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఆయన.. 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1981లో హిసార్ ప్రభుత్వ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో డిగ్రీ పట్టా పొందారు. అనంతరం హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తి మొదలు పెట్టారు. 1985లో పంజాబ్ హరియాణా హైకోర్టులో ప్రాక్టీసు చేయడం కోసం చండీగఢ్‌కు వెళ్లారు. 2000 జూలై 7న.. అత్యంత పిన్న వయస్సులో హరియాణా అడ్వొకేట్ జనరల్‌గా నియమితులు అయ్యారు. 2004 జనవరి 9న పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2018 అక్టోబరు 5న హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2024 నవంబరు 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు. ఢిల్లీ మద్యం కేసులో.. ఆ రాష్ట్ర మాజీ సీఎం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన ధర్మాసనానికి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వం వహించారు. సీబీఐకి.. తనపై ఉన్న 'పంజరంలో చిలుక' అనే భావనను తొలగించేలా పని చేయాలని సూచించారు.



కుటుంబ సభ్యులకు పాదాభివందనం చేస్తున్న జస్టిస్ సూర్యకాంత్

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరు



న్యాయ నిపుణుడిగా జస్టిస్ సూర్యకాంత్ అనుభవం దేశ న్యాయ వ్యవస్థకు మార్గదర్శకంగా నిలవాలని, దేశ న్యాయ వ్యవస్థలో సరికొత్త కాంతులు నిండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. "భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిష్ఠాత్మకమైన, అత్యున్నత పదవిని స్వీకరించిన జస్టిస్ సూర్యకాంత్‌కు అభినందనలు. మీ నాయకత్వంలో దేశంలోని ప్రజలందరికీ, ముఖ్యంగా కిందిస్థాయి వర్గాలకు న్యాయం దక్కుతుందని కోరుకుంటున్నాను." అని రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మరోవైపు.. ప్రధాని మోదీ కూడా ఎక్స్ వేదికగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు శుభాభినందనలు తెలియజేశారు. ఇక.. జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వంలో రాజ్యాంగ విలువలపైన, చట్టపాలనపైన ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నట్లు ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు.



కీలక తీర్పులు..

- జమ్మూ కశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370 నిర్వీర్యం నిర్ణయాన్ని సమర్థించిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఒకరు.
- సెక్షన్ 124 ఏ (దేశద్రోహం) పై స్టే విధించారు. కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని సమీక్షించే వరకూ దాన్ని అమలు చేయొద్దని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించిన ధర్మాసనంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు.
- పెగాసస్ కేసులో విచారణ కోసం సైబర్ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్న ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. జాతీయ భద్రత పేరుతో ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు ఇవ్వలేమని తేల్చి చెప్పారు.
- బిహార్ ఓటర్ల జాబితా వివాదంలో కీలకమైన నిర్ణయాన్ని వెల్లడించిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఒకరు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది పేర్లను బహిరంగపరచాలని ఈసీని ఆదేశించారు.

నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా జస్టిస్ విక్రమ్ నాథ్

న్యూఢిల్లీ, నవంబరు 24: నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ విక్రమ్ నాథ్‌ను రాష్ట్రపతి ముర్ము నియమించారు. మరోవైపు సుప్రీం కోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ (ఎస్‌సీఎల్ఎస్‌సీ) నూతన ఛైర్మన్‌గా సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ జితేంద్ర కుమార్ మహేశ్వరిని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నియమించారు. సంప్రదాయం ప్రకారం నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పదవిలో సీజేఐ తర్వాత అత్యంత సీనియర్ న్యాయమూర్తి నియమితులవుతారు. ఇక ఎస్‌సీఎల్ఎస్‌సీ ఛైర్మన్ పదవిలో సుప్రీం కోర్టు రెండో అత్యంత సీనియర్ జడ్జిని నియమిస్తారు. కాగా ఈ నియామకాలు సోమవారం నుంచే అమల్లోకి వచ్చాయి.

అయోధ్య రామ మందిరంపై నేడు కాషాయ ధ్వజారోహణ

» ఆవిష్కరించనున్న ప్రధాని మోదీ
» ఆలయ పనులు సంపూర్ణం
» త్రికోణం ఆకృతిలో కాషాయ జెండా
» మధ్యలో సూర్యుడు, ఓం, దేవకాంచనం చెట్టు చిహ్నాలు



అయోధ్య, నవంబరు 24: అయోధ్య రామ మందిర నిర్మాణ పనుల్లో చివరి ఘట్టం మంగళవారం పూర్తికానుంది. ఆలయ శిఖరంపై కాషాయ ధ్వజాన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించనున్నారు. ఆలయ పనులు పూర్తయ్యాయనడానికి గుర్తుగా ఈ ధ్వజారోహణ చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేస్తూ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించింది. ఆ జెండా 10 అడుగుల ఎత్తు, 20 అడుగుల పొడవుతో లంబకోణ త్రిభుజం ఆకారంలో ఉంటుంది. జెండా మధ్యలో రాముని ప్రతిభ, ధైర్యానికి చిహ్నంగా ప్రకాశించే సూర్యుని బొమ్మ ఉంటుంది. ఓం చిహ్నంతో పాటు, కోవిదార వృక్షం(దేవ కాంచనం చెట్టు) బొమ్మ ఉంటుంది. ఈ పవిత్ర కాషాయ ధ్వజం.. ప్రతిష్ఠ, ఐక్యత, సాంస్కృతిక పరంపర, రామరాజ్య ఆదర్శాలకు చిహ్నంగా ఉంటుందని ఆ ప్రకటనలో వివరించింది. ఆలయం పైభాగాన ఉత్తర భారత సంప్రదాయ వాస్తు అయిన నగర శైలిలో శిఖరం నిర్మించారు. ఆ శిఖరంపై ఈ ధ్వజాన్ని అమర్చనున్నారు. 800 మీటర్ల చుట్టుకొలత ఉన్న ఆలయ ప్రాకారాన్ని దక్షిణాది శైలిలో నిర్మించడం విశేషం. అయోధ్య రామ మందిరంలో నిర్మించిన ఇతర ఆలయాలను కూడా ప్రధాని మోదీ సందర్శించనున్నారు. సప్త మందిర్‌గా వ్యవహరిస్తున్న మహర్షి వశిష్ఠ, మహర్షి విశ్వామిత్ర, మహర్షి వాల్మీకి, మహర్షి అగస్త్య, దేవీ అహల్య, మాతా శబరి, నిషాద్‌రాజు గుహుని మందిరాలను దర్శించి అనంతరం శేషావతార్ మందిర్‌కు వెళ్లనున్నారు. మాతా అన్నపూర్ణ, రామ దర్బార్ గర్భ గృహంలో పూజలు చేయనున్నారు. చివరగా రామ లల్లా గర్భ గృహాన్ని దర్శించి పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం ధ్వజారోహణ చేసిన అనంతరం అక్కడ నిర్వహించే సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. వాల్మీకి రామాయణంలోని ఘట్టాలను ఆలయ గోడలపై 87 రాతి శిల్పాలుగా చెక్కారు. దేశ సంస్కృతిని 79 కాంస్య రేకులపై చిత్రీకరించారు. ఇవన్నీ కనువిందు చేయనున్నాయి. ధ్వజారోహణ ముహూర్తానికి కూడా విశేషం ఉంది. మార్గశిర మాస శుక్ల పక్ష పంచమి నాడు అభిజిత్ లగ్నంలో ఈ కార్యక్రమం జరగనుంది. పంచమినాడు అభిజిత్ లగ్నంలోనే సీతారాముల కల్యాణం జరిగింది. సిక్కుల తొమ్మిదవ గురువు తేగ్ బహాదుర్ ఇదే రోజున అమరుడయ్యారు. ఆయన 17వ శతాబ్దంలో అయోధ్య సమస్యపై 48 గంటల పాటు సంప్రదింపులు జరపడం గమనార్హం. ప్రధాని రాక సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చేసిన ఏర్పాట్లపై యూపీ సీఎం యోగి సోమవారం సమీక్ష జరిపారు.

రష్యా చమురుపై మరింత రాయితీ!

» అమెరికా ఆంక్షల నేపథ్యంలో భారత రిఫైనరీలకు రష్యా కంపెనీల ఆఫర్
» ఒక్కో బ్యారెల్‌పై 7 డాలర్ల వరకు తగ్గింపు

న్యూఢిల్లీ, నవంబరు 24: రష్యా చమురు కొనుగోళ్ల అంశంలో పరిస్థితి మరోసారి తారుమారయ్యే అవకాశం కనిపిస్తోంది. రష్యా అతిపెద్ద చమురు సంస్థలు రాస్‌నెఫ్ట్, ల్యూకోయిల్‌లపై అమెరికా, యూరోపియన్ యూనియన్ ఆంక్షలు విధించడం, ఆ దేశ చమురు కొనవద్దంటూ ఒత్తిడి చేయడంతో.. కొన్ని నెలలుగా భారత రిఫైనరీలు రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించాయి. బదులుగా పశ్చిమాసియా, అమెరికా నుంచి కొనుగోళ్లు పెంచాయి. చమురు కొనుగోళ్లు భారీగా తగ్గిపోవడంతో ఇబ్బందుల్లో పడిన రష్యా చమురు కంపెనీలు.. తాజాగా భారత్‌కు మరింత రాయితీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. డిసెంబర్‌లో లోడ్ చేసి జనవరి నాటికి డెలివరీ అందించే 'ఉరల్స్' చమురు ఒక్కో బ్యారెల్‌పై ఏడు డాలర్ల వరకు డిస్కౌంట్ ఆఫర్ చేశాయి. గత రెండేళ్లలో ఇదే అతి ఎక్కువ రాయితీ కావడం గమనార్హం. ఆంక్షలకు ముందు ఈ రాయితీ ఒక్కో బ్యారెల్‌పై 3 డాలర్లే. రష్యా, భారత చమురు, రిఫైనరీ సంస్థలను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ ఈ వివరాలతో కథనం ప్రచురించింది. కాగా, రష్యా చమురు సంస్థలు, ఆ దేశ చమురు రవాణా ట్యాంకర్లపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో.. భారత్, చైనా సహా పలు దేశాలు పశ్చిమాసియా, అమెరికాతోపాటు ఇతర దేశాల నుంచి చమురు కొనుగోళ్లు పెంచాయి. ఈ క్రమంలో చమురు రవాణా ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. పోటాపోటీ బుకింగ్స్‌తో చార్జీలు ఐదింతలకుపైగా పెరిగాయి.

అరుణాచల్ మాదేనంటూ..

» చైనా విమానాశ్రయంలో భారత మహిళ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకొని వేధింపులు
» మోదీకి లేఖలో వెల్లడించిన బాధితురాలు

ఢిల్లీ, నవంబరు 24: అరుణాచల్‌ప్రదేశ్ చైనాలో భాగమంటూ షాంఘై విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు భారత మహిళపై వేధింపులకు పాల్పడ్డారు. జన్మస్థలం అరుణాచల్‌ప్రదేశ్‌గా పేర్కొన్నందున ఆమె భారతీయ పాస్‌పోర్టు చెల్లదని, చైనా పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బ్రిటన్‌లో నివసిస్తున్న ప్రేమా వాంగ్జాం తాంగ్డోక్ లండన్ నుంచి జపాన్‌కు ప్రయాణిస్తూ 3 గంటల ట్రాన్సిట్ హాల్ట్ నిమిత్తం ఈనెల 21న షాంఘైలోని పుడోంగ్ విమానాశ్రయంలో దిగినప్పుడు ఎదురైన పరిస్థితి ఇది. 'అక్కడ దిగిన తర్వాత నన్ను ఇమ్మిగ్రేషన్ డెస్క్‌కు తీసుకెళ్లారు. నా పాస్‌పోర్టు చెల్లదన్నారు. ఎందుకని అడిగితే.. అరుణాచల్ చైనాలో భాగమని చెప్పారు. నా పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. చైనా పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేను ఎక్కాల్సిన జపాన్ వెళ్లే విమానం వచ్చినా.. నన్ను వెళ్లనివ్వలేదు. 18 గంటలపాటు మాటలతో వేధించారు' అని ఆమె ఒక ఆంగ్ల టీవీ చానల్‌కు వెల్లడించారు. బ్రిటన్‌లో ఉన్న ఒక స్నేహితుడి ద్వారా షాంఘైలోని భారత కాన్సులేట్ అధికారులకు విషయం తెలియజేయడంతో వారొచ్చి తనను ఆ నగరం నుంచి దాటించారని ఆమె తెలిపారు. దీనిపై ఆమె ప్రధాని మోదీతోపాటు సీనియర్ అధికారులకు ఒక లేఖ రాశారు.

బ్రిటన్‌ను వీడిన లక్ష్మీ మిత్తల్

తన వ్యాపార కేంద్రం స్విట్జర్లాండ్‌కు మార్పు

» కొత్త నివాసంగా దుబాయ్ ఎంపిక
» బ్రిటన్ కొత్త పన్ను చట్టాలకు నిరసనగానే
» కుబేరులపై భారీగా పన్నులు వేసిన బ్రిటన్

లండన్, నవంబరు 24: ప్రపంచ ఉక్కు వ్యాపార దిగ్గజం, ప్రవాస భారతీయుడు లక్ష్మీనివాస్ మిత్తల్.. బ్రిటన్‌ను వీడారు. బ్రిటన్‌లోని లేబర్ పార్టీ ప్రభుత్వం ఆ దేశంలోని పన్ను చట్టాల్లో సమూల మార్పులు చేసి, కుబేరులపై భారీగా పన్నులు వేస్తుండటంతో ఆయన తన వ్యాపార కేంద్రాన్ని స్విట్జర్లాండ్‌కు, నివాసాన్ని దుబాయ్‌కి మార్చారు. బ్రిటన్ కొత్త పన్ను చట్టాలను నిరసిస్తూ ఇప్పటికే చాలామంది ధనవంతులు ఆ దేశాన్ని వీడారు. బ్రిటన్‌లోని అత్యంత ధనవంతుల్లో 8వ స్థానంలో, ప్రపంచ కుబేరుల్లో 104వ స్థానంలో ఉన్న మిత్తల్.. ఇకపై దుబాయ్‌లో నివసించనున్నట్లు సండే టైమ్స్ వార్తా సంస్థ వెల్లడించింది. పన్ను పరిధిలోకి వచ్చే వ్యాపార వ్యవహారాలను మాత్రం స్విట్జర్లాండ్‌కు మార్చినట్లు పేర్కొంది. మిత్తల్ యాజమాన్యంలోని ఆర్సెలార్ మిత్తల్ కంపెనీ ప్రపంచంలో ఉక్కు ఉత్పత్తిలో రెండోస్థానంలో ఉంది. 2021 వరకు ఆ కంపెనీకి సీఈవోగా ఉన్న ఆయన.. తన కుమారుడు ఆదిత్య మిత్తల్‌కు ఆ పదవిని అప్పగించి ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉన్నారు. భారత్‌లోని రాజస్థాన్‌లో ఉక్కు వ్యాపార కుటుంబంలో జన్మించిన లక్ష్మీ మిత్తల్.. 1995 నుంచి లండన్‌లో నివసిస్తున్నారు.

కొత్త పన్ను చట్టాలపై నిరసనగానే..

బ్రిటన్‌లో చాలాకాలం తర్వాత అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ ప్రభుత్వం.. ధనవంతులపై భారీగా పన్నులు విధిస్తోంది. 226 ఏళ్లుగా ఉన్న నాన్-డోమ్ చట్టాన్ని రద్దు చేసింది. ఈ చట్టం ప్రకారం బ్రిటన్‌లో నివసించే వ్యక్తులు ఇతర దేశాల్లో సంపాదించిన ఆదాయంపై బ్రిటన్‌లో పన్ను కట్టాల్సిన అవసరం లేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసి కొత్త చట్టం తెచ్చింది. దాని ప్రకారం ప్రపంచంలో ఎక్కడ ఆదాయం సంపాదించినా, బ్రిటన్‌లో నివసించే వాళ్లు ఆ సంపదపై బ్రిటన్ ప్రభుత్వానికి పన్ను కట్టాల్సిందే. దీంతోపాటు వారసత్వ పన్ను చట్టంలోనూ మార్పులు తెచ్చి, ప్రపంచంలో ఎక్కడ వారసత్వ సంపదపై ఆదాయం వచ్చినా బ్రిటన్ ప్రభుత్వానికి పన్ను కట్టాలని నిబంధన పెట్టింది. వీటికి అదనంగా బ్రిటన్ నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నవారిపై కూడా ఎగ్జిట్ టాక్స్ వేసే చట్టం తేవాలని ప్రయత్నించింది. ఈ పన్ను చట్టాలను నిరసిస్తూ రివల్యూట్ సంస్థ సహ వ్యవస్థాపకుడు నిక్ స్టోరోన్‌స్కీ ఇప్పటికే తన మకాంను యూఏఈకి మార్చారు. కాగా, పారిశ్రామికవేత్తలు దేశాన్ని వీడి వెళ్లిపోవడంపై బ్రిటన్ విదేశాంగ మంత్రి కైల్ ఆందోళన వ్యక్తం చేశారు.



దూకుడైన వ్యాపారానికి పెట్టింది పేరు

లక్ష్మీ మిత్తల్‌ను ముద్దుగా 'కింగ్ ఆఫ్ స్టీల్' అని కూడా పిలుస్తారు. వ్యాపార విస్తరణలో అత్యంత దూకుడుగా వ్యవహరించే ఆయన.. ఉక్కు రంగంలో తనకు పోటీగా ఉన్న అనేక సంస్థలను కొనుగోలు చేసి తన యాజమాన్యం కిందికి తెచ్చుకున్నారు. 2006లో లగ్జంబర్గ్‌కు చెందిన ఆర్సెలార్ సంస్థను బలవంతంగా కొనేయటం అప్పట్లో సంచలనం సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా ఆయన కంపెనీల్లో ప్రస్తుతం 1,25,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆర్సెలార్ కొనుగోలు తర్వాత తన కంపెనీకి ఆర్సెలార్ మిత్తల్ అని పేరు పెట్టారు. దాదాపు 60 దేశాల్లో ఆయనకు వ్యాపారాలున్నాయి. పోర్బ్స్ ప్రపంచ కుబేరుల జాబితా ప్రకారం ఆయన సంపద 21.4 బిలియన్ డాలర్లు. లండన్‌లోని 'బిలియనీర్స్ రో'గా పేరున్న కెన్సింగ్టన్ ప్యాలెస్ గార్డెన్స్ వీధిలో ఆయనకు మూడు నివాసాలు ఉన్నాయి. 55 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న 'తాజ్ మిత్తల్' భవన నిర్మాణానికి భారత్‌లోని చారిత్రక కట్టడం తాజ్‌మహల్ కోసం పాలరాయిని తెచ్చిన క్వారీ నుంచే తరలించటం విశేషం. యూఏఈలో కూడా మిత్తల్ ఖరీదైన భవనాలు ఉన్నాయి. ఎమిరేట్ హిల్స్‌లో ఈ ఏడాది 152.7 మిలియన్ పౌండ్లతో ఓ ఖరీదైన భవనాన్ని కొనుగోలు చేశారు.

'హెచ్ఐఎల్టీ' విధానంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్

» దేశంలోనే భారీ కుంభకోణమిది: బీజేఎల్పీ నేత ఏలేటి



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హెచ్ఐఎల్టీ)' విధానం దేశంలోనే భారీ కుంభకోణమని, ఈ ప్రక్రియలో భారీగా ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. కొందరు కాంగ్రెస్ ముఖ్య నేతలు ఆరు నెలల ముందే పలువురు పారిశ్రామికవేత్తలతో ఒప్పందాలు చేసుకున్నారని, వారి పరిశ్రమల్లో వాటాదారులుగా చేరారని పేర్కొన్నారు. పారిశ్రామిక భూముల మార్పిడి కోసం టీజీఐఐసీ ధరలను కాదని.. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ధరలను పరిగణనలోకి తీసుకోవడంలోనే మతలబు ఉందని చెప్పారు. రూ.6 లక్షల కోట్లకుపైగా విలువజేసే పారిశ్రామిక భూములను కేవలం రూ.5 వేల కోట్లకే ధారాదత్తం చేయడమంటే ఖజానాను కొల్లగొట్టడమేనని మండిపడ్డారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు వాటాలు పంచుకోవడంతోపాటు పార్టీ జాతీయ నాయకత్వానికి భారీ మొత్తం పంపేందుకే ఈ భూదందాకు తెరతీశారని ఆరోపించారు. మరో మూడేళ్లు సీఎంగా కొనసాగడంతోపాటు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో పెత్తనం చెలాయించాలన్నది రేవంత్ ఆలోచన అని విమర్శించారు. ఈ పాలసీపై అసెంబ్లీలో చర్చించిన తర్వాతే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్ఐఎల్టీ పాలసీపై క్యాబినెట్ భేటీలో ఏ మంత్రి కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదని, వారికి కూడా ఈ భూదందాలో పాత్ర ఉన్నట్లుగానే భావించాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు.

తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో పటిష్ఠమైన వృద్ధి: మంత్రి శ్రీధర్‌బాబు

» థర్మోఫిషర్ సైంటిఫిక్ డిజైన్ సెంటర్ల ప్రారంభం



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం పటిష్ఠమైన వృద్ధితో ముందుకెళ్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో ప్రపంచ అగ్రగామి సంస్థ థర్మోఫిషర్ సైంటిఫిక్, ప్రభుత్వ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో ఏర్పాటు చేసిన రెండు బయోప్రాసెస్ డిజైన్ సెంటర్ల ప్రారంభోత్సవానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు సాధించాలన్న తమ లక్ష్య సాధనకు ఇలాంటి భాగస్వామ్యాలు తోడ్పడతాయన్నారు. తెలంగాణను ప్రపంచ లైఫ్ సైన్సెస్ రాజధానిగా నిలపాలన్న తమ విజన్‌కు తోడ్పడుతూ నైపుణ్యాల శిక్షణ అవకాశాలను కల్పించేందుకు ఈ కొత్త కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. థర్మోఫిషర్ సైంటిఫిక్ సంస్థ ఆసియా పసిఫిక్ ప్రెసిడెంట్ టోనీ యాక్సియారిటో మాట్లాడుతూ.. భారత లైఫ్ సైన్సెస్ రంగం కీలక దశలో ఉందని, పరిశోధకులు, పరిశ్రమ భాగస్వాములు తమ ఆలోచనలను వేగవంతంగా ఆచరణలోకి తేవడంలో ఈ కొత్త సెంటర్లు తోడ్పడుతాయని అన్నారు. ఆ సంస్థ భారత, దక్షిణాసియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్ వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రతిభావంతులు, మౌలిక సదుపాయాలు, అధునాతన టెక్నాలజీని మేళవించి, అంతర్జాతీయ బయోఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగంలో భారత్ స్థానాన్ని పటిష్ఠం చేసే విధమైన సుస్థిర వ్యవస్థ ఏర్పాటుకు తోడ్పాటునిచ్చేందుకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. దేశీయంగా ఆవిష్కరణలు, అభివృద్ధి, తయారీకి సంబంధించి విశ్వసనీయమైన భాగస్వామిగా నిలవాలన్న మా విజన్‌కు ఈ సెంటర్ల విస్తరణ నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

నేను రాజీనామా చేయడం లేదు

» స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్నా ఎదుర్కొంటా: కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రకటించారు. సోమవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి కడియం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనర్హత పిటిషన్‌పై అసెంబ్లీ స్పీకర్ ఏ నిర్ణయం తీసుకున్నా ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తన ఎన్నిక గురించి కార్యకర్తలు ఆలోచించాల్సిన అవసరం లేదని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎంపిక బాధ్యత గ్రామ కమిటీలదేనని చెప్పారు. అన్ని సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను గెలిపించుకొని ముఖ్యమంత్రి వద్ద నుంచి మరిన్ని నిధులు తెచ్చుకోవాలని కోరారు. బీ-ఫాంలు, పదవులు, అమ్ముకునే అలవాటు తనకు లేదని, కాంగ్రెస్ కార్యకర్తలు తల దించుకునే పని ఎప్పటికీ చేయబోనని అన్నారు. సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఎంపీ, ఎమ్మెల్యే నిధుల నుంచి గ్రామానికి రూ.25 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన రూ.3.5 కోట్ల విలువైన అభివృద్ధి పనుల ప్రొసీడింగ్‌లను కడియం అందించారు.

కేటీఆర్‌కు జైలు ఖాయం: విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయమని.. తనకు ఆ నమ్మకముందని బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అంటేనే కుటుంబ పాలన అని, వారి పాలనలో చోటుచేసుకున్న అక్రమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణ చేయాలన్నారు. సోమవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. దేశ ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలను గుర్తు చేశారు. అనంతరం విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నో అక్రమాలు జరిగాయని.. కాళేశ్వరం నుంచి చిన్న చిన్న ప్రాజెక్టుల వరకు ఎంతో అవినీతి జరిగిందన్నారు. వీటిపై సీఎం రేవంత్ రెడ్డి విచారణ చేయాలని.. ఎందుకంటే వారు దోచుకుంది తెలంగాణ సొత్తు అని స్పష్టం చేశారు. తనకు ఆపరేషన్ జరిగినప్పుడు అందరూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటే.. కేటీఆర్ మాత్రం 'నువ్వు చావరా' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించారని మండిపడ్డారు. 'నేను చావను.. నేను ఉంటాను.. నాకేం కాదు.. నీకే అవుతుంది' అంటూ కేటీఆర్‌నుద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించారు.

రేపు ఎమ్మెల్యేగా నవీన్‌యాదవ్ ప్రమాణస్వీకారం

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన నవీన్‌యాదవ్.. బుధవారంనాడు శాసన సభ్యుడిగా(ఎమ్మెల్యేగా) ప్రమాణస్వీకారం చేయనున్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్.. అసెంబ్లీలోని తన చాంబర్లో ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నవీన్‌యాదవ్ కుటుంబసభ్యులు హాజరుకానున్నారు.

సీసీఐ నిబంధనలతో రైతులకు తలనొప్పి

» గవర్నర్ దృష్టికి తెచ్చిన రైతు కమిషన్

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్ల విషయంలో కాటన్ సీడ్ కార్పొరేషన్ (సీసీఐ) నిబంధనలు రైతులకు తలనొప్పిగా పరిణమించాయని వ్యవసాయ రైతు కమిషన్ సభ్యులు సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దృష్టికి తెచ్చారు. కపాస్ కిసాన్ యాప్‌లో పత్తి కొనుగోళ్ల వివరాలు నమోదు చేయడం ఇబ్బందిగా పరిణమించిందన్నారు. ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొంటామని సీసీఐ అధికారులు పెట్టిన నిబంధన సరికాదని, మిగతా పత్తిని ఎక్కడ అమ్ముకోవాలో తెలియక అన్నదాతలు ఇబ్బందుల పాలవుతున్నారని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీసీఐ నిబంధనల అంశంపై తాను కేంద్రంతో మాట్లాడతానని గవర్నర్ హామీనిచ్చారని కోదండరెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో నాటింగ్‌హామ్ వర్సిటీ ఆఫ్ క్యాంపస్!

» ఆసక్తి కనబరిచిన వర్సిటీ ప్రతినిధులు

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం భారత్‌లో తన ఆఫ్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పేందుకు ఆసక్తి చూపించింది. అనేక అనుకూలతలున్న హైదరాబాదే వర్సిటీ ఆఫ్ క్యాంపస్ ఏర్పాటుకు అత్యుత్తమ ఎంపిక అవుతుందని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రైవేటు వర్సిటీకి యూకేలోని ప్రధాన క్యాంపస్‌లో 35 వేల విద్యార్థులుండగా, చైనాలోని ఆఫ్ క్యాంపస్‌లో 10 వేలు, మలేషియాలో 5 వేల మంది విద్యార్థులున్నారు. త్వరలో భారత్‌లోనూ ఆఫ్ క్యాంపస్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఉన్నత విద్యామండలితో కలిసి సంయుక్త కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వర్సిటీ అంతర్జాతీయ వ్యవహారాలు ఇన్‌చార్జి ఆండియా ఎలాన్స్ తెలిపారు. ఉన్నత విద్యామండలిలో అనేక సంస్కరణలు చేపడుతున్నామని... రాష్ట్రంలో ఆఫ్ క్యాంపస్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని బాలకిష్టారెడ్డి చెప్పారు.

ఎన్నికలకు వేళాయె!

(మొదటిపేజీ తరువాయి)

నుంచే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల సంఘం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, జిల్లా పంచాయతీ, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లు ఇటీవల సమావేశమై సమీక్షించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా.. సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి మూడు దశల్లో ఎన్నికలు జరపాలని ఎస్ఈసీ నిర్ణయించింది. ఇందులో భాగంగా, జిల్లాలవారీగా ఆయా మండలాల పరిధిలో సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి ఏ దశలో ఎక్కడ ఎన్నికలు నిర్వహించాలన్న కార్యాచరణను కూడా ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలుస్తోంది. దీని ప్రకారం సర్పంచు, వార్డు సభ్యుల తొలిదశ పోలింగ్ డిసెంబరు 11న, రెండో దశ 15న, మూడో దశ 19న చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో దశ ఎన్నికలకు ఆయా తేదీలను బట్టి ఎక్కడికక్కడ రిటర్నింగ్ అధికారులు ఆయా స్థానాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తారు.

చీరల పంపిణీ, వడ్డీ మాఫీల్లో జోరు

గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ 26న ప్రకటిస్తే.. అదే రోజు నుంచి కోడ్ అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలోనే, సంక్షేమ పథకాల అమలును సర్కారు వేగవంతం చేసింది. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రంలోపు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ఎస్‌హెచ్‌జీ సంఘాలకు వడ్డీ లేని రుణ పథకం కింద మహిళలు గతంలో చెల్లించిన వడ్డీ మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రక్రియను సైతం పూర్తి చేయాలని సర్కారు నిర్దేశించింది. వడ్డీ మాఫీ మొత్తాన్ని మంగళవారం సాయంత్రంలోపు ఎస్‌హెచ్‌జీ మహిళల ఖాతాల్లో జమ చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

తెలంగాణ నోయిడా!

(మొదటిపేజీ తరువాయి)



కొడంగల్‌లో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మంత్రులు దామోదర రాజనరసింహ, వాకిటి శ్రీహరి తదితరులతో కలిసి సీఎం రేవంత్ సోమవారం భూమి పూజ నిర్వహించారు. అల్పాహారం తయారీకి హరేకృష్ణ మిషన్ నిర్వహిస్తున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో రూ.103 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొడంగల్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన ప్రణాళికలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. "అక్షయ పాత్ర ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందిస్తున్నాం. ఏ విద్యార్థి ఆకలితో ఇబ్బంది పడకుండా ఉండాలని అన్న, అమ్మలా ఆలోచించి ఈ కార్యక్రమం చేపట్టాం. ఇందుకే సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణానికి భూమి పూజ చేశాం. ఫలితంగా ఈ ఏడాదే ప్రభుత్వ పాఠశాలల్లో 5000 మంది విద్యార్థులు పెరిగారు" అని వివరించారు. నెహ్రూ స్ఫూర్తితో విద్య, సాగునీటి రంగాలను తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యాలుగా తీసుకున్నామన్నారు. గత 70 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన కొడంగల్‌ను 2034 నాటికి దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనేది తన లక్ష్యమన్నారు. విద్య ఒక్కటే తరగని ఆస్తి అని, తెలంగాణ పునః నిర్మాణంలో ఇక్కడి పిల్లలను భాగస్వాములను చేసేందుకు రూ.5000 కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. ఉస్మానియా క్యాంపస్‌లో కూడా లేని విభాగాలను కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి గొప్ప చదువుల కోసం ఇక్కడికి వచ్చేలా విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొడంగల్ ప్రజల 70 ఏళ్ల కల నెరవేరబోతోందని, త్వరలోనే ఇక్కడి ప్రజలు రైలు కూత వినబోతున్నారని, పరిగి, కొడంగల్, నారాయణపేట్, మక్తల్ మీదుగా కర్ణాటకకు వికారాబాద్ - కృష్ణా రైల్వే లైన్ పనులు త్వరలో ప్రారంభం కాబోతున్నాయని చెప్పారు. భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని, రూ.5000 కోట్లతో నారాయణ్‌పేట్-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేసి ప్రతి ఎకరాకు కృష్ణా జలాలను అందిస్తామని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా వారిని వెయ్యి ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని, పెట్రోలు పంపులు, సోలార్ విద్యుత్తు ప్లాంట్ల నిర్వహణను మహిళలకు అప్పగించి ఆర్థిక స్వాతంత్ర్యం లభించేలా ప్రోత్సహిస్తున్నామని, అభివృద్ధికి ఆడబిడ్డలు అండగా నిలవాలని సీఎం రేవంత్ కోరారు. ప్రజలకు ఇవ్వడానికి అసైన్డ్ భూములు లేవని, కోట్లాది రూపాయలు లేవని, ప్రజలకు తాను చేయగలిగిందల్లా మంచి చదువులు చెప్పించడమేనని, సమస్యల పరిష్కారానికి చదువే మార్గమని, గొప్ప చదువులు చదివితే గొప్పవారిగా, ఉన్నతాధికారులుగా ఎదగవచ్చని వ్యాఖ్యానించారు.



కొడంగల్‌లో నిర్వహించిన సభకు హాజరైన ప్రజలు

మంచి వ్యక్తులను సర్పంచులుగా ఎన్నుకోండి

త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మూడు, నాలుగు రోజుల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చే అవకాశముందని, గ్రామాభివృద్ధికి సహకరించే వారినే సర్పంచులుగా ఎన్నుకోవాలని తెలిపారు. ప్రతి ఇంటికి సంక్షేమ కార్యక్రమాలు అందడమే కాకుండా ప్రతి గ్రామంలో అవసరమైన కనీస, మౌలిక సదుపాయాలు ఉండేలా కృషి చేసే వారిని ఎన్నుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. అనంతరం నియోజకవర్గంలో స్వయం సహాయక సంఘాలకు 300 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. మహిళా శక్తి పథకంలో భాగంగా మద్దూరు మండల మహిళా సమాఖ్య నడపనున్న బస్సును జెండా ఊపి ప్రారంభించారు.

నేడు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

» ఒకేసారి రూ.304 కోట్ల పంపిణీ: డిప్యూటీ సీఎం భట్టి

» రూ.3,500 కోట్ల వడ్డీని ఎగ్గొట్టిన బీఆర్ఎస్: మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక బృందాలకు మంగళవారం వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి భట్టి.. ములుగు జిల్లా ఏటూరు నాగారం నుంచి మంత్రి సీతక్క పాల్గొన్నారు. మొత్తం 3,57,098 సంఘాలకు ఒకేసారి రూ.304 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తున్నామని వారు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే ఈ రుణాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు హాజరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని గాలికొదిలేసిందని భట్టి ఆరోపించారు. ఇప్పటికే తాము రాష్ట్రంలో మూడు దఫాలుగా వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశామని తెలిపారు.

గత సర్కారు నిధులను కాజేసింది: సీతక్క

ఏటా రూ.25 వేల కోట్లకు తగ్గకుండా మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు అందిస్తూ, ప్రభుత్వం తరఫునే వడ్డీలను చెల్లిస్తున్నామని సీతక్క వివరించారు. గత బీఆర్ఎస్ సర్కారు మహిళా సంఘాలకు చెల్లించాల్సిన రూ.3,500 కోట్ల వడ్డీ సొమ్మును ఎగవేసిందని, సంఘాల అభయ హస్తం నిధులను కూడా కాజేసిందని ఆరోపించారు.

డిస్కమ్‌లకు ఊరట లభించేనా!?

» విద్యుత్తు సంస్థలను గట్టెక్కిస్తారా?

» ఆదాయ, అవసరాల అంతరం తగ్గిస్తారా?

» నేడే 'విద్యుత్తు' క్యాబినెట్

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారీ అప్పులు, బకాయిలతో కునారిల్లుతున్న విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్)లు కోలుకొనేదెలా? ఆదాయానికి, అవసరాలకు మధ్య అంతరంతో ఏటా నష్టాలు మూటగట్టుకుంటున్న డిస్కమ్‌లకు ఊరట లభించేదెలా? విద్యుత్తు సంస్థలకు ఊపిరులూదేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? ప్రస్తుతం డిస్కమ్‌లలో జోరుగా జరుగుతున్న చర్చ ఇదే! మంగళవారం ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన విద్యుత్తు రంగంపై ప్రత్యేకంగా జరగనున్న మంత్రివర్గ సమావేశం గురించి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి విద్యుత్తు సంస్థలు ఏటా నష్టాల పాలవుతూనే ఉన్నాయి. డిస్కమ్‌లు ఆర్థికంగా సాధికారత సాధించాలంటే చార్జీలు సవరించాల్సిందేనన్న కేంద్రం ఆదేశాలు కార్యరూపం దాల్చడం లేదు. ఫలితంగా 2025 మార్చి 31 నాటికి రాష్ట్రంలో డిస్కమ్‌ల నష్టాలు రూ.59,671 కోట్లుగా ఉన్నాయి. ఇక అప్పులు రూ.62,897 కోట్లు! వివిధ ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన కరెంట్ బిల్లుల బకాయిలు రూ.48,005 కోట్లు! 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2025-26 దాకా 12 ఏళ్లలో మూడుసార్లు మాత్రమే కరెంట్ చార్జీలను పెంచారు. డిస్కమ్‌ల ఆదాయానికి, అవసరాలకు మధ్య బాగా అంతరం ఉంటోంది. 2014-15 నుంచి 2019-20 మధ్యకాలంలో డిస్కమ్‌లకు రూ.3553.84 కోట్ల టారిఫ్ సబ్సిడీని గత ప్రభుత్వం చెల్లించలేదు. 2016-17 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరం దాకా అంచనా వేసిన విద్యుత్తు వ్యయం కన్నా వాస్తవిక వ్యయం (ట్రూ-అప్ చార్జీలు) రూ.12550 కోట్లు ఎక్కువ కాగా.. ఆ భారాన్ని వినియోగదారులపై వేయొద్దని, తామే చెల్లిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఐదు సమాన వాయిదాల్లో చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ పైసా విడుదల చేయలేదు. ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో కూడా రూ.2378 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. అవీ ఇవ్వలేదు. వీటన్నింటిపై మంత్రివర్గంలో చర్చించి.. పాత డిస్కమ్‌ల పరపతి పెంచేలా చర్యలు తీసుకోవడంతో పాటు కొత్త డిస్కమ్ ఏర్పాటుపైనా నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో రాష్ట్ర విద్యుత్తు అవసరాలు తీర్చడానికి కావాల్సిన కొత్త ప్లాంట్లపై కూడా చర్చించనున్నారు. రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు, అణు విద్యుత్కేంద్రం ఏర్పాటుకు అడుగులు, కేటీపీఎస్‌లో 1600 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణంపై కూడా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు నివేదించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్తు అంతరాయాలను తగ్గించి.. నాణ్యమైన కరెంట్ సరఫరా చేయడానికి 43384 కి.మీ. భూగర్భలైన్లు వేయాల్సి ఉంటుందని, దీనివ్యయం 14,725 కోట్లని అంచనా వేశారు. విద్యుత్తు చట్టం ప్రకారం ఏటా నవంబరు 30లోపు వచ్చే ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించాలి. దాంతో ఏఆర్ఆర్‌పై సీఎంకి నివేదించి, అనుమతి తీసుకునే అవకాశాలున్నాయి.

మూసీ అభివృద్ధి పనులు మార్చిలో..!

రూ.5800 కోట్ల అంచనాలతో తొలిదశ పనుల్ని ప్రారంభించేందుకు సర్కారు సన్నాహాలు


» ఏడీబీ నుంచి రూ.4100 కోట్ల రుణానికి ఆమోదం

» ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11 కి.మీ.

» హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ దాకా 9 కి.మీ.

» వారం రోజుల్లో పూర్తిస్థాయి డీపీఆర్!

» ఇప్పటికే సిద్ధమైన అభివృద్ధి నమూనాలు



మూసీ నది తీర ప్రాంత అభివృద్ధి నమూనా చిత్రం

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మూసీ నది తీరప్రాంత అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సర్కారు.. మార్చి నెలలో పనులు మొదలుపెట్టేందుకు సర్వం సిద్ధం చేసుకుంటోంది. సుమారు రూ.5800 కోట్ల అంచనాలతో తొలి దశ పనులు ప్రారంభించాలని యోచిస్తోంది. ఇప్పటికే రూ.4100 కోట్ల రుణం అందించేందుకు ఏడీబీ నుంచి ఆమోదం లభించింది. తొలిదశ పనుల సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) సైతం వారం రోజుల్లో పూర్తికానుంది. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11 కి.మీ., హిమాయత్ సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9 కి.మీ. మేర ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మూసీ అభివృద్ధి నమూనాలను కూడా అధికారులు సిద్ధం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటకులను ఆకర్షించే రీతిలో డిజైన్లు రూపొందించారు.

మూసీ ప్రణాళిక ఇలా..

అనంతగిరి కొండల్లో పుట్టి హైదరాబాద్ నగరం మధ్య నుంచి నల్లగొండ జిల్లాలో ప్రవేశించి, వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలిసే మూసీ నది మొత్తం 240 కి.మీ. మేర ప్రవహిస్తుంది. అందులో 55 కి.మీ. హైదరాబాద్ నగరం చుట్టూ ప్రవహిస్తోంది. దీన్ని 5 భాగాలుగా విడగొట్టారు. ఓఆర్ఆర్ వెస్ట్ నుంచి బాపూఘాట్ వరకు 17 కి.మీ., బాపూఘాట్ నుంచి పురానాపూల్ వరకు 10, పురానాపూల్ నుంచి ఎంజీబీఎస్ వరకు 5, ఎంజీబీఎస్ నుంచి ఉప్పల్ వరకు 10, ఉప్పల్ నుంచి ఓఆర్ఆర్ ఈస్ట్ వరకు 13, మొత్తం 55 కి.మీ. మేర దశలవారీగా అభివృద్ధి చేయనున్నారు. నదిలో స్వచ్ఛమైన నీటి ప్రవాహం ఉండేలా.. మూసీని గోదావరి నదితో అనుసంధానం చేస్తున్నారు. అలాగే మూసీలోకి శుద్ధి చేసిన నీటిని వదిలేలా కొత్త ఎస్టీపీలను నిర్మిస్తున్నారు. నదీ పరీవాహకంలో వరద నియంత్రణ ఏర్పాట్లు, వారసత్వ సంపద అభివృద్ధి, అత్యాధునిక పార్కులు, వాక్ టు వర్క్ తరహాలో మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇందు కోసం గ్రీన్ మాస్టర్ ప్లాన్, భూ వినియోగ, ఆర్థిక బృహత్ ప్రణాళికలు, ఆకర్షణీయంగా కనిపించే అభివృద్ధి నమూనాల ప్రాజెక్టులను సిద్ధం చేశారు. ఈస్ట్-వెస్ట్ కారిడార్‌లో మూసీని అనుసంధానం చేస్తూ వంతెనల నిర్మాణం, జీవనోపాధుల కల్పన విధానంలో పలు నమూనాలు సిద్ధం చేశారు.

ఇవిగో నమూనాలు..

మూసీ అభివృద్ధికి సంబంధించి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కొన్ని నమూనాలను రూపొందించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్న ఆ నమూనాలు పర్యాటకులను ఆకట్టుకునేలా ఉన్నా యి. మూసీ ముఖద్వారం నుంచి గాంధీ సరోవర్ ప్రాజెక్టు నమూనాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. నడక వంతెనల నమూనాలు, స్టాట్యూఆఫ్ పీస్, నేషనల్ మ్యూజియం, నాలెడ్జ్ హబ్, చేనేత ప్రోత్సాహక కేంద్రం, ధ్యానగ్రామం, ప్రజా వినోద కేంద్రాలు, ఘాట్లకు సంబంధించిన నమూనాలను రూపొందించారు.

సమస్యలు పరిష్కరించకుంటే.. డిసెంబరులో సమ్మె

» ప్రభుత్వానికి 'మధ్యాహ్న భోజన' కార్మికుల హెచ్చరిక



పాఠశాల విద్యాశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఖైరతాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించకుంటే డిసెంబరు చివరి వారం నుంచి సమ్మెకు దిగుతామని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రాథమిక విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎం నరసింహ.. మధ్యాహ్న భోజన పథక యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌పావని, రవీందర్ మాట్లాడుతూ.. కార్మికులు సొంత డబ్బుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతుంటే, వారికి ప్రభుత్వం ఇస్తున్న చాలీచాలని రూ.3 వేల గౌరవ వేతనాన్ని కూడా పెండింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన సరుకులను సర్కారే ఇవ్వాలని, లేదంటే ప్రతి విద్యార్థికి మెనూ చార్జీగా రూ.25 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు వంట కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించాలని కోరారు.

వాహనాలపై 'విజిలెన్స్' నిఘా

» ఫిట్‌నెస్, అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరాలపై దృష్టి

» 2,623 వాహనాల తనిఖీ.. 195 సీజ్, రూ.37.4 లక్షల జరిమానా

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న వాహనాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కొరడా ఝళిపించింది. రాష్ట్ర వ్యాప్తంగా శని, ఆదివారాల్లో విజిలెన్స్ విభాగం స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. నిబంధనలు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేయడంతోపాటు పలు వాహనాలను అధికారులు సీజ్ చేశారు. అత్యవసర ద్వారం లేని ప్రైవేటు బస్సులు, అగ్నిమాపక పరికరాలు లేని, ఫిట్‌నెస్ సరిగా లేని, జీఎస్టీ ఎగవేసిన, వ్యవసాయ మార్కెట్ ఫీజు చెల్లించని, ఇతర భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. రెండు రోజుల స్పెషల్ డ్రైవ్‌లో ఏడు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్లు, 30 ప్రత్యేక బృందాలు పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో 2,623 వాహనాలను తనిఖీ చేసి.. నిబంధనలు పాటించని 195 వాహనాలను సీజ్ చేసి, రూ.37.45 లక్షలు జరిమానా విధించారు. ఇవి కాకుండా మైనింగ్, జీఎస్టీ చట్టం, వ్యవసాయ మార్కెట్ ఫీజు, ఇతరత్రా బకాయిలకు సంబంధించి 123 వాహనాలను స్వాధీనం చేసుకుని, రూ.41 లక్షలు జరిమానా వేశారు. ప్రైవేటు, సరుకు రవాణా వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్నట్లు గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబరు 14432కు సమాచారం ఇవ్వాలని విజిలెన్స్ అధికారులు సూచించారు.

వివిధ విమానాల్లో ఒకేరోజు
నలుగురు ప్రయాణికులకు అస్వస్థత

» ఆస్పత్రికి తరలింపు, ఆలస్యంగా బయల్దేరిన విమానాలు

శంషాబాద్ రూరల్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలోని వివిధ విమానాల్లో ఒకేరోజు నలుగురు ప్రయాణికులు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే విమానాశ్రయంలోని ఆస్పత్రికి తరలించారు. దీంతో పలు విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి. సోమవారం రన్‌వేపై సిద్ధంగా ఉన్న రెండు విమానాల్లో ముగ్గురు ప్రయాణికులు తీవ్ర అస్వస్థతకు గురవ్వగా, షిరిడీ నుంచి హైదరాబాద్ వస్తున్న విమానంలో ఓ ప్రయాణికురాలు గుండెపోటుకు లోనయ్యారు. సోమవారం ఉదయం 148 మంది ప్రయాణికులతో రియాద్ వెళ్తున్న ఫైనాస్ ఎక్స్‌వై326 విమానం టేకాఫ్ తీసుకోవడానికి ట్యాక్సీవే పైకి వెళ్తుండగా పొచ్చ మల్లయ్య, మహ్మద్ అబ్దుల్ నబీ అస్వస్థతకు గురయ్యారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఢిల్లీ వెళ్తున్న ఆకాశ్ ఎయిర్‌లైన్స్ క్యూపీ 1405 విమానంలో శ్రీనివాస్‌రెడ్డి (38) అనే ప్రయాణికుడికి విమానం టేకాఫ్ తీసుకునే సమయంలో ఛాతిలో నొప్పి వచ్చింది. గమనించిన సిబ్బంది విషయాన్ని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు తెలియజేసి, విమానాలను ప్లాట్‌ఫామ్‌పై నిలిపివేశారు. మెడికల్ ఎమర్జెన్సీ సిబ్బంది అస్వస్థతకు గురైన ఇద్దరు ప్రయాణికులను ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. దీంతో ఆ విమానాలు గంటకు పైగా ఆలస్యంగా బయల్దేరాయి. మరో ఘటనలో షిర్డీ నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో 6ఈ 6063 విమానంలో అనియ విశాల్ సాల్వే అనే మహిళా ప్రయాణికురాలు గుండెపోటుకు గురయ్యారు. విమానం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న వెంటనే ఎమర్జెన్సీ మెడికల్ సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తరలించారు.

టేకాఫ్‌కు ముందు ఎమర్జెన్సీ డోర్ తెరచిన ప్రయాణికుడు

విమానం టేకాఫ్‌కు ముందు ఓ ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్ తీయడానికి యత్నించాడు. విమాన సిబ్బంది వెంటనే అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఆదివారం సాయంత్రం 5:10 గంటలకు కొచ్చిన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఐఎక్స్ 2834 విమానంలో ఈ ఘటన జరిగింది. మహ్మద్ నవాజ్ అనే ప్రయాణికుడు మొదటిసారి విమానం ఎక్కడంతో పొరపాటున డోర్ తీసినట్లు తెలిసింది. తిరిగి 6:09 గంటలకు ఆ విమానం కొచ్చిన్‌కు బయల్దేరి వెళ్లింది.

ఓఆర్ఆర్‌పై కారు దగ్ధం.. ఒకరి సజీవ దహనం

» మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలో ఘటన


ప్రమాదంలో అగ్నికి ఆహుతైన కారు

శామీర్‌పేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శామీర్‌పేట్ వద్ద ఓఆర్ఆర్‌పై కారులో మంటలు చెలరేగి ఓ వ్యక్తి సజీవ దహనమయ్యాడు. డ్రైవర్ కారు ఆపి హీటర్ వేసుకుని నిద్రిస్తుండగా మంటలు చెలరేగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. మృతుడిని హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం, జైగిరి గ్రామానికి చెందిన తల్లపల్లి దుర్గాప్రసాద్ (30)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. వ్యాపార పనుల నిమిత్తం ఆదివారం హైదరాబాద్‌కు వచ్చిన దుర్గా ప్రసాద్.. తిరిగి సోమవారం వేకువజామున 4.30 గంటల సమయంలో స్వగ్రామానికి బయలుదేరాడు. ఆ సమయంలో చలి అధికంగా ఉండటంతో శామీర్‌పేట సమీపంలోని లియోనియో రిసార్ట్స్ వద్ద కారును రోడ్డు పక్కన ఆపి, హీటర్(వేడిగాలి) పెట్టుకుని నిద్రించాడు. కొద్దిసేపటి తర్వాత హీటర్ వేడికి ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లోనే వాహనం మొత్తం అంటుకున్నాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో నిద్రలో ఉన్న దుర్గాప్రసాద్ బయటకు రాలేక అగ్నికి ఆహుతయ్యాడు. శామీర్‌పేట పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

గూడెం మధుసూదన్‌రెడ్డి ఆస్తుల జప్తు

» తాజాగా 1.12 కోట్లను జప్తు చేసిన ఈడీ

హైదరాబాద్/పటాన్‌చెరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్ కేసులో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు, సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్ సప్లై యజమాని మధుసూదన్‌రెడ్డి, ఆయన కుమారుడు విక్రమ్‌రెడ్డిసహా మరికొందరికి చెందిన రూ.1.12కోట్ల ఆస్తుల్ని ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. దీంతో ఈ కేసులో జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ రూ.80.5 కోట్లకు పెరిగింది. ఈడీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మధుసూధన్ రెడ్డి యజమానిగా ఉన్న సంతోష్ సాండ్, గ్రానైట్ సప్లై కంపెనీ తమకు కేటాయించిన క్వారీ స్థలంతో పాటు ప్రభుత్వ భూమిలో మైనింగ్ చేసి అక్రమాలకు పాల్పడింది. కంపెనీ యాజమాన్యం అక్రమ మైనింగ్‌తో రూ.300కోట్లు సంపాదించినట్లు పటాన్‌చెరు పీఎస్‌లో గతంలో కేసు నమోదు అయింది. ఈ కేసు ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మధుసూదన్‌రెడ్డి బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేసిన నేపథ్యంలో ఆయన ఆస్తుల జప్తు చర్చనీయాంశంగా మారింది.

15 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పోలీసుల ఎదుట సోమవారం 15మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 9మందిపై సుమారు రూ.48లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో మడ్వి సన్నా, సోది హిడ్మే, సూర్యం అలియాస్ రవ్వా సోమ, మీనా అలియాస్ మడ్వి భీమే ఉన్నారు. సుక్మా జిల్లాలో మావోయిస్టులు జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో వీరు నిందితులుగా ఉన్నారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

» ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి ఓంకార్

రాంనగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే 2004లో మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం శాంతి చర్చలకు ముందుకు రావాలన్నారు. బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ నిర్వహిస్తున్నా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోకపోవడం శోచనీయమన్నారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలన్నారు.

మురుమూరులో సీఆర్పీఎఫ్ క్యాంప్

వాజేడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని కర్రెగుట్టలకు దగ్గరగా ఉన్న మురుమూరు అటవీ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ క్యాంప్ ఏర్పాటు చేసేందుకు సీఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్యాంపును మంగళవారం ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మురుమూరు అటవీ ప్రాంతంలో తొలుత సీఆర్పీఎఫ్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి అనంతరం వెంకటాపురం మండలంలోని గుట్టలపై ఉన్న పామునూరులో మరో క్యాంప్ ఏర్పాట్లు చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ రెండు క్యాంప్‌ల ఏర్పాటుతో కర్రెగుట్టల వద్దకు సులువుగా బలగాలు వెళ్లేందుకు దోహదపడతాయని తెలుస్తోంది.

5న వైకుంఠ ద్వార దర్శనానికి టికెట్ల విడుదల

తిరుమల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను డిసెంబరు 5న టీటీడీ విడుదల చేయనుంది. జనవరి 2 నుంచి 8 వరకు రోజుకు 15వేల టికెట్ల చొప్పున టికెట్లు కేటాయిస్తారు. 5వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో వీటిని విడుదల చేయనున్నారు. ఇక తొలి మూడు రోజులకు(వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, న్యూయర్)కు సంబంధించిన ఉచిత దర్శనం టోకెన్ల కోసం నవంబరు 27 నుంచి డిసెంబరు 1వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డిసెంబరు 2న ఈడిప్ ద్వారా దర్శనాలను కేటాయిస్తారు.

ఐ బొమ్మ వెనక అంతా నేనే..

» చట్ట ప్రకారం ఏమైనా చేసుకోమంటూ పోలీసులకు ఇమ్మడి రవి సమాధానం..!
» డొమైన్‌లు, క్రిప్టోకరెన్సీ లావాదేవాలపై ఆరా
» 100 కోట్లు సంపాదించినట్లు నిర్ధారణ
» ముగిసిన కస్టడీ.. జైలుకు తరలింపు
» రవి బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ



హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పైరసీ కేసులో అరెస్టయిన ఐ బొమ్మ రవి.. ఐదు రోజుల కస్టడీ సోమవారంతో ముగిసింది. విచారణలో రవి రిజిస్ట్రేషన్ చేసుకున్న డొమైన్స్ గురించి, వాటి నిర్వహణ గురించి పోలీసులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలిసింది. ఐబొమ్మ వెనక తానొక్కడినే ఉన్నానని.. చట్టప్రకారం తనను ఏమైనా చేసుకోండంటూ ఇమ్మడి రవి సమాధానమిచ్చినట్లు సమాచారం. అయితే తాను ఎలాంటి పైరసీకి పాల్పడలేదంటూ.. పైరసీకి సంబంధించి నోరు విప్పలేదని తెలిసింది. బెట్టింగ్ యాప్స్ ద్వారానే రూ.కోట్లలో డబ్బులు వచ్చాయని.. వాటితో జల్సా చేశానని చెప్పినట్లు సమాచారం. ఐ బొమ్మ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం చెల్లింపులన్నీ క్రిప్టో కరెన్సీ ద్వారా జరిగినట్లు గుర్తించిన పోలీసులు.. రవి సుమారు రూ.80-100 కోట్లు కొల్లగొట్టినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు 35 బ్యాంకు ఖాతాల్లో పలు కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం. 1ఎక్స్‌బెట్ సహా 15 బెట్టింగ్ యాప్‌ల వరకు రవి ప్రచారం చేసినట్లు.. ఒక్క 1ఎక్స్‌బెట్ ద్వారానే ఎక్కువ మొత్తంలో డబ్బు వచ్చినట్లు పోలీసులు ఓ అంచనాకు వచ్చినట్లు తెలిసింది. అయితే రవి తన స్నేహితుడు నిఖిల్, చెల్లెలుకు మాత్రమే డబ్బులు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన లావాదేవీలన్నీ ఇతరుల ఖాతాలకు సంబంధించినట్లుగా తేలింది. ఇప్పటివరకు రూ.30 కోట్ల మొత్తానికి ఆధారాలు లభించగా.. మిగిలిన అన్ని బ్యాంకుల నుంచి ఆధారాలు వస్తే రూ.100 కోట్ల వరకు తేలే అవకాశమున్నట్లు పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. యాడ్ ఏజెన్సీలతో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సంప్రదింపులు, సినిమాల కొనుగోలు సంబంధించిన వివరాలన్ని టెలీగ్రామ్ యాప్ ద్వారా నిర్వహించినట్లు ఆధారాలు సేకరించారు. రవి నుంచి ఇప్పటివరకు సేకరించిన సమాచారంపై సీపీ సజ్జనార్ మంగళవారం మీడియా సమావేశం వెల్లడించే అవకాశముంది.

చంచల్‌గూడ జైలుకు తరలింపు..

రవి ఐదు రోజుల కస్టడీ ముగియడంతో.. సాయంత్రం 5:30కు తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇటు రవి తరఫు న్యాయవాది శ్రీనాథ్ మాట్లాడుతూ.. తన క్లయింట్‌పై మొత్తం 5 కేసులు నమోదయ్యాయని, కేవలం ఒక్క కేసులో మాత్రమే న్యాయస్థానం కస్టడీకి అనుమతించిందన్నారు. ఇప్పుడు కస్టడీ ముగియడంతో రవికి బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేశామని వెల్లడించారు. మంగళవారం ఆ పిటిషన్‌పై కోర్టు విచారణ జరపనుందన్నారు. రవికి కచ్చితంగా కోర్టు బెయిల్ మంజూరు చేస్తుందని అన్నారు.

అందరికీ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)



తెలిపింది. మెరుగైన విద్య, ఉత్తమ వైద్యం, పారిశుద్ధ్యం, స్వచ్ఛమైన వాతావరణం, భద్రత, ఇంటి వద్దే అవకాశాలు, భవిష్యత్తు పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దే ఐటీ, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఆధునిక నైపుణ్యాలను తమ ప్రధాన ఆశయాలుగా పేర్కొంది. వీటి కోసం 65 శాతం స్పందనలు యువత నుంచే వచ్చాయని తెలిపింది. ఈ అభిప్రాయాలన్నింటి ఆధారంగా ఆర్థిక వ్యవస్థ, యువత, మహిళలు, రైతులు, పెట్టుబడులు, మౌలిక వసతులు, స్థల వినియోగ ప్రణాళిక, వాతావరణ లక్ష్యాలు వంటి ఎనిమిది అంశాలపై దృష్టి పెట్టినట్లు వివరించింది. 2047 నాటికి సమర్థమైన, సమానత్వంతో కూడిన, ప్రపంచ స్థాయిలో పోటీ పడే తెలంగాణను నిర్మించడమే లక్ష్యమని పేర్కొంది. ఈ డాక్యుమెంట్‌లో మొత్తం 8 అధ్యాయాలు, 3 ముఖ్య అమలు సాధనాలు ఉన్నాయని వెల్లడించింది.

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ..

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, భారతదేశ జీడీపీకి 10 శాతం వాటాను అందించడమే లక్ష్యంగా ముందుకు వెళతామని ప్రభుత్వం పేర్కొంది. ఈ వృద్ధిని సాధించడానికిగాను.. ఆవిష్కరణల ఆధారంగా టోటల్ ఫ్యాక్టరీ ప్రొడక్టివిటీని పెంచడం, స్టార్ టాలెంట్‌ను రాష్ట్రానికి తిరిగి రప్పించడం, డీప్‌టెక్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్, సైబర్ సెక్యూరిటీ, జీన్‌టెక్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి పెట్టడం, స్టార్టప్‌లకు అనుకూల పరిస్థితులు కల్పించడం, ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయడం, పర్యాటకం, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల అభివృద్ధి, ప్రపంచ స్థాయి పోటీ శక్తి పెంపు, ఎగుమతుల విస్తరణ వంటివి చేపట్టనున్నట్లు పేర్కొంది.

వ్యూహాత్మక స్థల ఆధారిత ఆర్థిక ప్రణాళిక..

రాష్ట్రాన్ని అర్బన్ కోర్, పెరి అర్బన్, రూరల్ తెలంగాణ పేరిట మూడు ప్రాంతీయ అభివృద్ధి మండలాలుగా ప్రభుత్వం వర్గీకరించింది. ఇందులో అర్బన్ కోర్‌లో హైదరాబాద్ కేంద్రంగా టెక్నాలజీ, డీప్‌టెక్, ఏఐ, ఇండస్ట్రీ 4.0, మాన్యుఫాక్చరింగ్, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డిజైన్ స్టూడియోలు, ఆర్అండ్‌డీ ల్యాబ్‌లు, స్టార్టప్‌లు, నాలెడ్జ్ ఎకానమీ ప్రధాన కేంద్రంతోపాటు గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొంది. ఇక పెరి అర్బన్ ప్రాంతాలను.. మధ్య స్థాయి పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ, లాజిస్టిక్స్ క్లస్టర్లకు కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. వీటిలో మధ్యస్థాయి, క్లస్టర్ ఆధారిత పరిశ్రమలు, పర్యావరణ ప్రమాణాలతో ఆరెంజ్, ఎల్లో వర్గ పరిశ్రమలు, ఎకో ఇండస్ట్రియల్ పార్కులు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాల ఏర్పాటుతోపాటు గ్రామీణ ఉత్పత్తులను పట్టణ మార్కెట్లకు అనుసంధానించనున్నట్లు వివరించింది. రూరల్ తెలంగాణను గ్రామీణ జీవనోపాధులు, ప్రకృతి ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొంది.

పెట్టుబడులకు ఆకర్షణ కేంద్రంగా..

తెలంగాణను తయారీ రంగం, నాలెడ్జ్-బేస్డ్ పెట్టుబడుల కోసం ప్రపంచ స్థాయి గమ్యస్థానంగా మలచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అధునాతన తయారీ, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', ప్రతిభను ఆకర్షించడం, జీవన ప్రమాణాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటరు, అత్యాధునిక ఆర్అండ్‌డీ కేంద్రాలు, శక్తివంతమైన ఎకో సిస్టమ్‌ను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. ప్రగతిశీల విధానాలు, మౌలిక వసతులు, నైపుణ్యంతో కూడిన మానవవనరులు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించనున్నట్లు పేర్కొంది. పారిశ్రామిక దిగ్గజాలకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా మార్చడం, ఉద్యోగావకాశాలు కల్పించడం లక్ష్యమని తెలిపింది.

మహిళలు, యువత, రైతుల కోసం..

యువత, మహిళలు, రైతులను భవిష్యత్తు పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రతి దశలో మహిళలకు సహాయం చేసే లైఫ్-సైకిల్ అప్రోచ్ ద్వారా కోటి మంది మహిళలను మిలియనీర్లను తయారు చేయాలనే లక్ష్యాన్ని సీఎం ప్రస్తావించారు. ఇక యువతకు ఫౌండేషన్ ఎడ్యుకేషన్, భవిష్యత్తు నైపుణ్యాలు అందించడం, విద్యతోపాటు నైపుణ్యాన్ని పెంచడం, కీలకమైన అధునాతన తయారీ, టెక్నాలజీ రంగాల్లో శక్తివంతం చేయడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇక పంట వైవిధ్యం, అగ్రిటెక్ వాడకం, విలువ వృద్ధి ద్వారా రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్థిరమైన, టెక్నాలజీ ఆధారిత, లాభదాయక వ్యవసాయ వ్యవస్థను నిర్మించాల్సి ఉంటుందని తెలిపింది.

విజయానికి 3 పునాది స్తంభాలు..

తెలంగాణ రైజింగ్-2047 విజయాన్ని నడిపించే మూడు ముఖ్య పునాది స్తంభాలుగా టెక్ అండ్ ఇన్నోవేషన్, సమర్థ ఫైనాన్సింగ్, ఉత్తమమైన పరిపాలన(గుడ్ గవర్నెన్స్)ను ప్రభుత్వం పేర్కొంది. ఇవి అన్ని రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి, సమాన సేవల అందుబాటు, అత్యుత్తమ పరిపాలనా వ్యవస్థలను నిర్ధారిస్తాయని తెలిపింది.

ఆరోగ్యం, పోషణ, విద్య..

తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్‌లో మానవ అభివృద్ధికి ప్రధాన స్థానం ఉందని ప్రభుత్వం తెలిపింది. ఆరోగ్యాన్ని ప్రధాన లక్ష్యంగా పరిగణిస్తూ ప్రాథమిక వైద్యం, వ్యాధి నిరోధక విధానాలను మరింత బలోపేతం చేయడం. డిజిటల్ హెల్త్ మౌలిక సదుపాయాలు, బయో బ్యాంకులు, ఆరోగ్య సిబ్బంది సామర్థ్య వృద్ధి వంటి అంశాలపై పెట్టుబడులు పెట్టనుంది. ఇందులోభాగంగా వృద్ధులు, దీర్ఘకాలిక రోగాల సంరక్షణ, అందరికీ అందుబాటులో చౌకైన ఆరోగ్య సేవలు, టెక్నాలజీ ద్వారా లాస్ట్-మైల్ డెలివరీ, వైద్య విద్య, పోషణ, సామాజిక సంక్షేమం వంటివాటిపై దృష్టా సారిస్తుంది. ప్రతి పౌరుడూ ఆరోగ్యవంతమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశం కల్పిస్తుంది. ఇక సుస్థిరత, క్లైమేట్ రెసిలియన్స్, ఆర్థిక వృద్ధి-పర్యావరణ బాధ్యతలను సమతుల్యం చేస్తూ తెలంగాణను నెట్-జీరో ఎమిషన్స్ రాష్ట్రంగామలచడమే లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. దీని ప్రధాన వ్యూహాలుగా.. పునరుత్పాదక శక్తిపై భారీ పెట్టుబడులు, గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సర్క్యులర్ ఎకానమీ, పరిశ్రమల్లో కార్బన్ నిరోధక మార్గాలను అవలంబించేలా విధానాలు ఉంటాయని వెల్లడించింది.

ఏసీబీకి చిక్కిన మధిర లేబర్ ఆఫీసర్

15వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

మధిర రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా మధిర లేబర్ అసిస్టెంట్ ఆఫీసర్ (ఎల్ఏవో) బీమా సొమ్ము మంజూరు కోసం రూ.15 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. మధిరకు చెందిన ఓ భవన నిర్మాణ కార్మికుడు గతేడాది సహజ మరణం పొందాడు. భవన నిర్మాణ కార్మికులకు 'న్యాచురల్ డెత్ బెనిఫిట్ స్కీం' కింద రూ.1.30 లక్షల బీమా వస్తుంది. ఈ సొమ్ము కోసం దరఖాస్తు చేసుకోవడానికి బాధిత కుటుంబం ఎల్ఏవో చందర్‌ను సంప్రదించింది. డెత్ సర్టిఫికెట్, ఇతర పత్రాలు పైఅధికారులకు పంపడానికి చందర్ రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితులు ఖమ్మం ఏసీబీ వై.రమేశ్‌కు ఫిర్యాదు చేశారు. వారి సూచనల మేరకు బాధిత కుటుంబం సోమవారం సాయంత్రం మధిరలోని కార్యాలయానికి వెళ్లి చందర్‌కు రూ.15వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చందర్‌ను అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు.

బెట్టింగ్‌లకు యువకుడు బలి

» అప్పులపాలై ఉరేసుకొని ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఓ యువకుడు బలయ్యాడు. బెట్టింగ్‌ల కోసం అప్పులు చేసి వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో జరిగింది. దండుమైలారం గ్రామానికి చెందిన అచ్చన లింగం కుమారుడు నవీన్(23) ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. బాధితుడి మొబైల్‌లోని సమాచారం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పారుతున్న నాలా పట్టాగా మార్పు

» వాసవి, శాంతా శ్రీరాం సంస్థలపై కేసు

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ భూమిలో పారుతున్న నాలాను పూర్తిగా మూసి వేసి, దానిని పట్టాభూమిగా చూపించి, అనుమతులు పొందారంటూ వాసవి, శాంతా శ్రీరాం సంస్థలపై అందిన ఫిర్యాదులను లోకాయుక్త స్వీకరించింది. ఇందుకు బాధ్యులను చేస్తూ వాసవి ఎర్రం విజయ్ కుమార్, శాంతా శ్రీరామ్ అధినేత నర్సయ్యలపై కేసు నమోదు చేసింది. గచ్చిబౌలిలో సర్వే నంబరు 15, 16లో ఉన్న ప్రభుత్వ భూమి నిషేధిత జాబితాలో ఉన్నా, గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పని చేసిన రోనాల్డ్‌రోస్ అనుమతులు ఇచ్చారంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది రామారావు వాదించారు. అనుమతులు ఇచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి ధర్మాసనం భూమి వివరాలు, అనుమతులు ఇచ్చిన అధికారుల పాత్రపై నివేదిక అందించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

హెల్త్ వర్సిటీలో అక్రమార్కులు నిజమే

» నిగ్గు తేల్చిన కమిటీ
» ప్రాథమిక ఆధారాలతో సర్కారుకు నివేదిక
» కలకలం రేపిన 'ఆంధ్రజ్యోతి' కథనం
» విచారణకు కమిటీ వేసిన ప్రభుత్వం
» ఫోరెన్సిక్ ఆడిట్‌కు మెడికోల డిమాండ్



హైదరాబాద్, వరంగల్ మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య పీజీ పరీక్షల్లో గోల్‌మాల్ జరిగి ఒక విద్యార్థికి నిబంధనలకు విరుద్ధంగా మార్కులు కలిపి పాస్ చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది కాళోజీ యూనివర్సిటీలో 'అక్రమార్కులు' పేరిట సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం కలకలం రేపింది. దీనిపై ప్రభుత్వం స్పందించింది. వెంటనే ప్రాథమిక విచారణ జరిపించాలని వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తును ఆదేశించింది. సర్కారు ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి ముగ్గురు సభ్యులతో ఒక కమిటీని వేశారు. 'ఆంధ్రజ్యోతి' కథనంపై ప్రాథమిక విచారణ జరిపి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు, వరంగల్ కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్య, వరంగల్ విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావులను కమిటీ సభ్యులుగా నియమించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఈ కమిటీ వరంగల్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి వెళ్లి ప్రాథమిక విచారణ జరిపింది. అక్రమాలు చోటు చేసుకున్న విషయం వాస్తవమేనని కమిటీ ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఆరోగ్య విశ్వవిద్యాలయం 4న విడుదల చేసిన పరీక్ష ఫలితాల్లో దక్షిణ తెలంగాణలోని ఓ ప్రైవేటు వైద్య కళాశాల పీజీ జనరల్ మెడిసిన్ విద్యార్థినికి హాల్ టికెట్ నంబరు లేదు. ఆ తర్వాత ఈ నెల 21న ఆమె పాస్ అయినట్లు వెల్లడించారు. దీనిపై కమిటీ సభ్యులు లోతుగా విచారించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.అలాగే, రీ కౌంటింగ్‌కు నమోదు చేసుకున్న 155 మంది విద్యార్థుల పత్రాలను పరిశీలించినట్లు తెలిసింది. మరోవైపు ఈ ఒక్క ఘటనే కాకుండా ఆరోగ్య విశ్వవిద్యాలయంలో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని వైద్యవిద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఐటీ రంగంలో విశేష అనుభవం ఉన్న వారి చేత ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్ష ఫలితాలకు సంబంధించిన లాగిన్‌లను ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని మెడికోలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన పీజీ ఫలితాల్లో 205 మంది విద్యార్థులు ఫెయిలవగా, 155 మంది రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో ఏ ఒక్క అభ్యర్థి కూడా పాస్ కాలేదని రిజిస్ట్రార్ నాగార్జునరెడ్డి తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో 2,123 మంది పీజీ అభ్యర్థులు అక్టోబరు 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన థియరీ పరీక్షలు, 23వ తేదీ నుంచి నవంబరు 1వ తేదీ వరకు నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఇందులో 1,918 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పీజీ ఫలితాల్లో అవకతవకలు ఉన్నట్లయితే విచారణలో నిజాలు వెలుగు చూస్తాయని పేర్కొన్నారు.

ఇద్దరు అధికారుల డిప్యూటేషన్లు రద్దు

» విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు ఔట్
» వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపికి అదనపు బాధ్యతలు
» మార్క్‌ఫెడ్ జీఎం విష్ణువర్ధన్‌రావుకూ ఉద్వాసన
» మాతృసంస్థల్లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అనుబంధ సంస్థలు.. తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ కునుసోత్ కేశవులు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ విష్ణువర్ధన్‌రావు డిప్యూటేషన్లు రద్దయ్యాయి. వారు తమ మాతృ సంస్థల్లో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ ఎండీగా.. వ్యవసాయశాఖ డైరెక్టర్ బి.గోపికి అదనపు బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయశాఖలో కీలకమైన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (సీడ్ కార్పొరేషన్), విత్తన ధ్రువీకరణ సంస్థ (సీడ్ సర్టిఫికేషన్) డైరెక్టర్ పోస్టులకు ఒకే అధికారి ఉండేవారు. 2014లో తెలంగాణ ఏర్పాటైన తర్వాత జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కునుసోత్ కేశవులుకు ఈ రెండు పదవులను అప్పగించిన నాటి రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 11 ఏళ్ల డిప్యుటేషన్‌లో కొనసాగించారు. కొద్ది నెలల క్రితం విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా కేశవులును తప్పించిన సర్కారు.. విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్‌గా ఇప్పటివరకు కొనసాగించింది. కేశవులు డిప్యుటేషన్ సోమవారంతో ముగియటంతో రద్దుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కేశవులు మాతృశాఖ ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ) రిజిస్ట్రార్ వద్ద నివేదించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 8 ఏళ్లుగా మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న సహకారశాఖ జాయింట్ రిజిస్ట్రార్ విష్ణువర్ధన్‌రావు డిప్యూటేషన్ రద్దు చేయాలన్న మార్క్‌ఫెడ్ బోర్డు తీర్మానం అమలుకు నోచుకోలేదు. డిప్యూటేషన్లు పూర్తయిన వారి సేవల పునరుద్ధరణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఈ నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కీలక పోస్టుల్లో డిప్యూటేషన్‌పై తిష్ట వేసిన అధికారులను మాతృశాఖలు, సంస్థలకు పంపాలని ఆదేశించారు.

చెన్నై - హైదరాబాద్ వయా తిరుపతి..
'బుల్లెట్' ప్రతిపాదన..!

» ప్రయాణ సమయం 2.20 గంటలు తగ్గే అవకాశం

చెన్నై, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చెన్నై-హైదరాబాద్ బుల్లెట్ రైలు తిరుపతి మార్గంలో నడిచేలా ప్రణాళికలు సిద్ధం చేసిన దక్షిణ మధ్య రైల్వే.. ఆ మేరకు నివేదికను తమిళనాడు ప్రభుత్వానికి అందజేసింది. 2027లో సూరత్ నుంచి తొలి బుల్లెట్ రైలు నడిచేలా యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అదే విధంగా దక్షిణాదిన రెండు మార్గాల్లో బుల్లెట్ రైళ్ల ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది. చెన్నై-బెంగళూరు-మైసూరు మార్గంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టు అమలుకు భూసర్వే జరుగుతోంది. అలాగే చెన్నై-హైదరాబాద్ మధ్య 778 కి.మీ. బుల్లెట్ రైలు ప్రాజెక్టు నివేదికను దక్షిణ మధ్య రైల్వే సిద్ధం చేస్తోంది. చెన్నై నుంచి గూడూరు మీదుగా హైదరాబాద్‌కు బుల్లెట్ రైలు సేవలు అందేలా చర్యలు చేపట్టాలని భావించింది. అయితే తిరుపతి మార్గంలో ఆ ప్రాజెక్టును అమలు చేయాలని తమిళనాడు ప్రభుత్వం ఇదివరకే దక్షిణ మధ్య రైల్వేకు విజ్ఞప్తి చేసింది. ఆ ప్రకారం కొన్ని సవరణలు చేసి నివేదిక రూపొందించిన దక్షిణ మధ్య రైల్వే... రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. దీనికి సూత్రప్రాయంగా ఆమోదం లభిస్తే, చెన్నై-హైదరాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ పనులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం, తమిళనాడు ప్రభుత్వ కన్సల్టెన్సీ రిట్స్, తమిళనాడులో బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు '223.44 హెక్టార్ల భూమి అవసరం. అలాగే 65 రోడ్లు, 21 హై-వోల్టేజ్ లైన్లు దాటవలసి ఉంటుంది. చెన్నై సెంట్రల్, మీంజూరు సమీపంలోని చెన్నై ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో 2 బుల్లెట్ రైల్వే స్టేషన్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. వాటికోసం ఆ రెండు ప్రాంతాల్లో తలా 50 ఎకరాల చొప్పున భూసేకరణ చేయాల్సి ఉంటుంది' అని నివేదిక సమర్పించినట్లు సమాచారం. ఒకవేళ చెన్నై-హైదరాబాద్ మధ్య బుల్లెట్ రైలు ప్రాజెక్టు అమలులోకి వస్తే... ప్రస్తుత ప్రయాణ సమయం 12 గంటలు కాగా... 2.20 గంటలు తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.